

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నూతన సీజేఐ ఎంపిక ప్రక్రియ ఆరంభం 2

వచ్చే నెల 23న జస్టిస్ గవాయ్ పదవీ విరమణ

వారసుడి పేరు సూచించాలని కేంద్రం లేఖ

సీజేఐ తర్వాత అత్యంత సీనియర్‌గా జస్టిస్ సూర్యకాంత్.. ఆయనకే అవకాశం!

2027 ఫిబ్రవరి 9 వరకు పదవీ కాలం

శుక్రవారం | 24-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 188 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా.1.20 తదుపరి చవితి; నక్షత్రం: అనూరాధ పూర్తి; వర్జ్యం: ఉ.9.21-11.09; దుర్ముహూర్తం: ఉ.8.32-9.18, మ.12.22-1.08; అమృతఘడియలు: రా.8.09-9.57; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.44 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్యాబినెట్ సమావేశం నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్





రోడ్డున పడొద్దు!

అనవసర విషయాలకు రాద్ధాంతం వద్దు.. ప్రజలు, ప్రతిపక్షాల్లో చులకన కావొద్దు

సంఘటితంగా ఉందాం.. జరిగిందంతా టీ కప్పులో తుపానే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి, స్థానిక ఎన్నికలకు వెళ్దాం

మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు సీఎం రేవంత్ హితవు

'స్థానికం'పై ఏం చేద్దాం?.. అభిప్రాయాలు అడిగిన సీఎం

హైకోర్టు స్పందన కోసం వేచిచూద్దామన్న అమాత్యులు

మీడియా సమావేశంలో కలిసి కూర్చున్న కొండా, పొంగులేటి!

మా అమ్మాయి వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నా

ముఖ్యమంత్రి రేవంత్‌పై ఆవేశంలో మాట్లాడింది

మాదంతా ఒకే కుటుంబం.. సర్దుకుపోయాం: మంత్రి సురేఖ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రుల మధ్య సఖ్యత కొరవడడంపై రాష్ట్ర క్యాబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగింది! చిన్నపాటి అంశాల్లో విభేదాలతో మంత్రులు రచ్చ చేసుకోవద్దని, స్వల్ప వివాదాలకు సంబంధించి రోడ్డెక్కడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది. అనవసర విషయాలకు రాద్ధాంతం చేసుకోవడం వల్ల ప్రజలతో పాటు ప్రతిపక్షాల్లో కూడా పలుచన అవుతున్నామని హితవు పలికినట్లు సమాచారం. ఇలాంటి అవాంఛిత ఘటనలను నివారించాలని సూచించినట్లు తెలిసింది. ఇప్పటివరకు జరిగిన ఘటనలను టీకప్పులో తుపానులా భావించి.. ఇక నుంచి సంఘటితంగా ఉండాలని, ఈ విషయంలో ప్రజలకు స్పష్టమైన సంకేతాన్ని ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ప్రభుత్వంపై, మంత్రులపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేసినప్పుడు.. సంబంధిత ఘటనకు సంబంధించి సమగ్ర వివరాలు ప్రజలకు తెలియజేయాలని కూడా మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో

మిగతా 13వ పేజీలో...

హైకోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలపై నిర్ణయం

3న హైకోర్టు ఇచ్చే తీర్పును అధ్యయనం చేయాలి

7న క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం

బీసీలకు 42%.. ప్రభుత్వ లక్ష్యం

కొత్త టెక్నాలజీతో మిగిలిన శ్రీశైలం సొరంగం తవ్వకం

2027లో నల్లగొండకు నీళ్లు

15 వేల మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజీ ప్లాంటు

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు 13

లిక్కర్ దందా.. కల్వకుంట్ల పేటెంట్!

కేటీఆర్ అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా?

మీ చెల్లెలు ఢిల్లీకి వెళ్లి లిక్కర్ స్కాంలో ఇరుక్కోలేదా?

మీరు బీజేపీ కాళ్లపై పడలేదా?

నేను లేఖ రాస్తేనే రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నాడా? 13

ఆయనకు ఏఐజీలో 10 లక్షల వేతన ఆఫర్ వచ్చింది

నిజాయితీ అధికారి అయితే నా లేఖలపై స్పందించలేదెందుకు?

మంత్రి జూపల్లి కృష్ణారావు ఫైర్

క్యాబినెట్ భేటీకి రిజ్వీ 13

మద్యం దరఖాస్తులతో.. 2,863 కోట్ల ఆదాయం

గతంతో పోల్చితే ఈసారి 218కోట్లు అదనం

రాష్ట్రవ్యాప్తంగా 95,436 దరఖాస్తులు

27న డ్రా ద్వారా వ్యాపారుల ఎంపిక



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కోసం వచ్చే దరఖాస్తుల ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం సాధించాలన్న లక్ష్యాన్ని ఎక్సైజ్ శాఖ దాదాపుగా చేరుకుంది. దరఖాస్తుల గడువు గురువారం ముగియగా.. రాష్ట్ర వ్యాప్తంగా 95,436 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2,863 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే ఇది రూ.218 కోట్లు అధికం కావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల కేటాయింపునకు

మిగతా 14వ పేజీలో...

లిక్కర్ షాపుల దరఖాస్తు గడువు పెంపును వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ 14

నాగ్ క్షిపణులు.. టార్పెడోలు..

రూ.79 వేల కోట్లతో ఆయుధాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం

రక్షణ రంగం బలోపేతం దిశగా నిర్ణయం 2



బిహార్ మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా

తేజస్వీ యాదవ్

ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వీఐపీ అధ్యక్షుడు సహనీ

పట్నాలో ప్రకటించిన అశోక్ గెహ్లోత్

గోవుల అక్రమ రవాణాపై సమాచారం ఇస్తున్నారనే.. ప్రశాంత్‌పై కాల్పులు

నిందితుడితో ఆయనకు ముందే పరిచయం

మాట్లాడదామని పిలిచి ఇబ్రహీం కాల్పులు

ప్రశాంత్ రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు 12

గంటల వ్యవధిలోనే ముగ్గుర్ని అరెస్టు చేశాం

ప్రశాంత్ ప్రాణాలకు ప్రమాదం లేదు: సీపీ


గోవులతో రూ.కోట్ల దందా చేస్తుంటే ఏం చేస్తున్నారు?.. కేంద్ర మంత్రి బండి సంజయ్

ఫీజు బకాయిల కోసం బీజేపీ పోరుబాట

వచ్చే నెల తొలివారంలో 'ఛలో హైదరాబాద్'

కాలేజ్ యాజమాన్యాల సమ్మెకు మద్దతు ప్రకటించిన రాంచందర్‌రావు 3

మనిషిని బట్టే మందు!



ఫార్మాకో జీనోమిక్స్‌పై అధ్యయనం జరిపిన ఏఐజీ వైద్యులు కల్యాణ్, ఉషలతో నాగేశ్వర్‌రెడ్డి

- జబ్బును బట్టి అందరికీ ఒకే మెడిసిన్ సరికాదు
- జన్యుక్రమం, శరీరతత్వానికి అనుగుణంగా వేర్వేరు మందులు
- అందుకు వీలు కల్పించేలా ఫార్మాకోజీనోమిక్స్ టెస్టు
- ఏఐజీ ఆస్పత్రిలో రూ.5 వేలకే.. ఏఐ ఆధారంగా కచ్చితమైన విశ్లేషణ
- ఒకసారి పరీక్ష చేయించుకుంటే జీవితాంతం ప్రయోజనం
- ఆ రిపోర్టుతో ఏ డాక్టర్ వద్ద అయినా కచ్చితమైన వైద్యం
- 30శాతం మందికి ఒకే మందు సరిపడటం లేదని గుర్తించాం
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి 10



రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో తీసుకొచ్చేలా రోడ్‌మ్యాప్‌నకు కసరత్తు

దీంతో 5 లక్షల మందికి ఉపాధి

మెల్‌బోర్న్‌లో 'ఆస్‌బయోటెక్ 2025' సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లైఫ్ సైన్సెస్ రంగంలో 2030 నాటికి లక్ష కోట్ల పెట్టుబడుల్ని రాష్ట్రానికి తీసుకొచ్చి.. 5 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గురువారం లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్'.. మెల్‌బోర్న్‌లో

మిగతా 12వ పేజీలో...

రష్యా చమురుపై ఆంక్షల మంటలు!

'రాస్‌నెఫ్, లుకోయిల్'లపై అమెరికా ఆంక్షలు

వాటి నుంచి చమురు కొనే విదేశీ సంస్థలపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిక

రష్యా సహజవాయువు దిగుమతులు, చమురు రవాణా నౌకలపై ఈయూ ఆంక్షలు

ఏడాది చివరికల్లా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుంది: ట్రంప్

ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ కోసం చేస్తున్న ప్రయత్నాలకు ఆంక్షలతో విఘాతం: రష్యా

ఆంక్షల నేపథ్యంలో చమురు ధరలకు రెక్కలు

ఆసియాన్ సదస్సుకు మోదీ వెళ్లట్లేదు!

వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని

ట్రంప్ టార్గెట్ చేస్తారన్న భయం.. కాంగ్రెస్



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఎలాగైనా ఆపుతానని చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యాను మరింతగా ఇరుకున పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. రష్యా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు ఎగుమతులను దెబ్బతీసే చర్యలకు దిగారు. రష్యాకు చెందిన పెద్ద చమురు సంస్థలు రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లతో

మిగతా 2వ పేజీలో...

సునీత విజయం ఖాయం!

భారీ మెజారిటీ లక్ష్యంగా పని చేయండి.. ప్రజలు విజ్ఞతతో ఓటు వేస్తారు

రౌడీ షీటర్ కుటుంబాన్ని ఓడిస్తారు.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సమీక్షలో కేసీఆర్

హైదరాబాద్, గజ్వేల్/మర్కుక్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మాగంటి సునీత గెలుపును ప్రజలు ఇప్పటికే ఖాయంచేశారని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. భారీ మెజార్టీ దక్కించుకునేందుకు పార్టీ నేతలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయన జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత, కేటీఆర్, హరీశ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇతర ముఖ్య నేతలతో

మిగతా 12వ పేజీలో...



జూబ్లీహిల్స్ బరిలో 81 మంది

130 మంది నామినేషన్ల తిరస్కరణ

ముగిసిన పరిశీలన 12

17 గంటలపాటు స్ర్కూటినీ

ఉపసంహరణకు నేడు ఆఖరి రోజు

స్వతంత్రులను విత్‌డ్రా చేయించేందుకు నేతల యత్నాలు



అమెరికాలోని డాలస్‌లో జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రవాస భారతీయులు

భారతీయులకు చెడ్డపేరొస్తోంది!

అవగాహనారాహిత్యంతో అమెరికాలో అప్రఖ్యాతి

వీధుల్లో ఉత్సవాలు, బాణసంచా కాల్చడం, లౌడ్ స్పీకర్ల వాడకం ప్రమాదకరం

థియేటర్లలో పాలాభిషేకాలు, ఈలలు, డ్యాన్సులు వంటి చేష్టలతో మనపై అమెరికన్ల చిన్నచూపు

డాలస్‌లో అవగాహన సదస్సులో వక్తలు

(డాలస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

"అమెరికాలో నివసిస్తున్న భారతీయులు, మరీ ముఖ్యంగా కొందరు ప్రవాస తెలుగువారి ప్రవర్తనతో భారతీయులకు చెడ్డపేరు వస్తోంది. కొందరు అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తుండడంతో ప్రవాస భారతీయుల గౌరవానికి భంగం వాటిల్లుతోంది" అని డాలస్‌లో ప్రవాసులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వక్తలు ఆందోళన వ్యక్తం

మిగతా 10వ పేజీలో...

హెచ్-1బీపై లక్ష డాలర్ల ఫీజు వద్దు.. ట్రంప్‌కు అమెరికా చట్టసభ సభ్యుల బృందం లేఖ 2



ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

జనవరి నెలాఖరులో ప్రాక్టికల్స్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి ఆఖర్లో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ప్రతి ఏటా మార్చి మొదటి వారంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతేడాది మార్చి5న ప్రారంభమైన పరీక్షలు 25న ముగిశాయి. అయితే ఈ విద్యా సంవత్సరంలో మాత్రం ఫిబ్రవరి 25 నుంచి ప్రథమ, 26 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

మిగతా 3వ పేజీలో...



కార్బయిడ్ గన్‌తో 14 మంది పిల్లలకు అంధకారం



కార్బయిడ్ గన్స్

- మధ్యప్రదేశ్‌లో దీపావళి వేళ కొన్ని కుటుంబాల్లో విషాదం 2
- కంటి గాయాలతో మూడు రోజుల్లో ఆస్పత్రులకు 122 మంది
- ఈ తుపాకులపై కేంద్రం నిషేధం.. అయినా అడ్డగోలుగా విక్రయాలు
- గన్లు అమ్మిన ఆరుగురి అరెస్టు

నెత్తురోడిన రోడ్లు

ఒకేరోజు 4 వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం

మృతుల్లో ముగ్గురు చిన్నారులు 3

రంగారెడ్డి, మంచిర్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఘటనలు

నూతన సీజేఐ ఎంపిక ప్రక్రియ ఆరంభం

- వారసుడి పేరు సూచించాలని జస్టిస్ గవాయ్‌కు కేంద్రం లేఖ
- జస్టిస్ సూర్యకాంత్‌కు అవకాశం?

న్యూఢిల్లీ, అక్టోబరు 23: సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నియామక ప్రక్రియను గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్.గవాయ్ వచ్చే నెల 23న పదవీ విరమణ చేయనుండడంతో కొత్తవారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. వారసుడి పేరును సూచించాల్సిందిగా కోరుతూ జస్టిస్ గవాయ్‌కు లేఖ రాసింది. 65 ఏళ్ల వయసు వచ్చిన వెంటనే ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. దానిని పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణకు నెల రోజులు ముందుగా కేంద్రం లేఖ రాయడం సంప్రదాయంగా వస్తోంది. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి తరువాత అత్యంత సీనియర్ అయిన జడ్జిని తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమించే ఆచారం ఉండడంతో ఆ అవకాశం జస్టిస్ సూర్యకాంత్‌కు దక్కే సూచనలు ఉన్నాయి. ఒకవేళ జస్టిస్ సూర్యకాంత్ నియమితులైతే ఆయన 15 నెలలపాటు అంటే నవంబరు 24 నుంచి 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకు పదవిలో కొనసాగనున్నారు.

విమానాల్లో పవర్ బ్యాంకులపై నిషేధం?!

- విమానయాన భద్రతపై డీజీసీఏ సమాలోచనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశీయ విమానాల్లో పవర్ బ్యాంకులపై నిషేధం విధించడంపై పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) సమాలోచనలు జరుపుతోంది. ఆదివారం ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నాగాలాండ్‌లోని దిమాపూర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుని పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగాయి. క్యాబిన్ సిబ్బంది సత్వరమే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టమూ వాటిల్లలేదు. ఈ ఘటన తరువాత లిథియం బ్యాటరీలతో పనిచేసే పవర్ బ్యాంకులను విమానాల్లో తీసుకువెళ్లడం, వాటిని ఉపయోగించడం ఎంత వరకు క్షేమమన్న అంశంపై సమగ్ర పరిశీలన అవసరమైంది. ఈ నేపథ్యంలో డీజీసీఏ సమాలోచనల తరువాత పవర్ బ్యాంక్‌లపై పూర్తి నిషేధం లేదా వాటి వాడకంపై కఠిన నిబంధనలు అమలు కావచ్చని తెలుస్తోంది.

ఒక్కో ఓటు తొలగింపునకు రూ.80

- కర్ణాటకలోని ఆళంద నియోజకవర్గ ఓటర్ల లిస్టు అక్రమాలపై సిట్ గుర్తింపు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కలబురగి జిల్లా ఆళంద శాసనసభ నియోజకవర్గం ఓటర్ల జాబితా అవకతవకల కేసులో సిట్ అధికారులు కీలక విషయాలు గుర్తించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6,018 మంది పేర్లను ఓటర్ల లిస్టు నుంచి తొలగించేందుకు డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. ఒక్కో ఓటు తొలగింపునకు రూ.80 చొప్పున ఓ డేటా సెంటర్ నిర్వాహకుడికి చెల్లించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఓట్లను తొలగింపునకు సంబంధించి 2022 డిసెంబరు, 2023 ఫిబ్రవరి మధ్య 6,018 దరఖాస్తులు చేశారని, ఇందుకుగానూ రూ.4.80 లక్షల చెల్లించారని గుర్తించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆళంద నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ పాటిల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత నెలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దయెత్తున ఓట్ల దొంగతనం ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఓటర్ల తొలగింపును పార్టీ గుర్తించకుంటే.. తాను ఆళంద సీటులో ఓడిపోయేవాడినని అన్నారు.

ఢిల్లీలో బిహారీ గ్యాంగ్‌స్టర్ల ఎన్‌కౌంటర్

- పోలీసుల ఎదురుకాల్పుల్లో నలుగురు హతం

న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల ఎదురుకాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ 'సిగ్మా అండ్ కంపెనీ' గ్యాంగ్ సభ్యులైన నలుగురు నేరస్తులు హతమయ్యారు. వీరిపై బిహార్‌లో హత్యలు, దోపిడీలు, క్రూరమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిని రంజన్ పాథక్ (25), బిమ్లేశ్ మహతో (25), మనీశ్ పాథక్ (33), అమన్ ఠాకూర్ (21)గా పోలీసులు పేర్కొన్నారు. అందరూ బిహార్‌లోని సీతామర్హి జిల్లాకు చెందిన వారని, సిగ్మా గ్యాంగ్ సభ్యులని వెల్లడించారు. ఢిల్లీ, బిహార్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎదురుకాల్పుల్లో వీరు హతమయ్యారని చెప్పారు. ఈ నేరగాళ్లు కొద్ది రోజులుగా ఢిల్లీలో దాగి ఉన్నారన్న సమాచారం మేరకు పోలీసులు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో తారసపడిన వారు పోలీసులపై కాల్పులు జరిపారని, ప్రతిగా జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు నేరస్తులు గాయపడ్డారని, ఆ తర్వాత ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

నాన్నే నేరస్తుడని నమ్మించేలా అమ్మను చంపేశాడు!

- చదువుకోమంటోందని ఓ బాలుడి ఘాతుకం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని ఒత్తిడి చేస్తోందని తల్లిని ఓ బాలుడు చంపేయడమే కాకుండా.. ఆ నేరం తండ్రిపైకి వస్తుందని ధీమాగా ఉన్నాడు. అయితే పోలీసుల విచారణలో దొరికిపోయాడు. తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కీల్‌కుప్పంవేలూరుకు చెందిన లారీ డ్రైవర్ గుణశేఖరన్, మహేశ్వరి (40) దంపతులకు ఓ కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. దీపావళి రోజు భర్త తీసుకొచ్చిన చీరను తీసుకునేందుకు మహేశ్వరి నిరాకరించింది. దీంతో ఆ దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో గుణశేఖరన్ ఆమెపై చేయిచేసుకున్నాడు. అనంతరం మహేశ్వరి ఇంటి నుంచి పొలానికి వెళ్లింది. అదే రోజు సాయంత్రం ఆమె మృతదేహం ఊరి చివరి పొలాల్లో రక్తపు మడుగులో పడి ఉంది. సమాచారం అందుకున్న నావలూరు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముందుగా మహేశ్వరి భర్తను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే లోతైన దర్యాప్తు చేపట్టాక మహేశ్వరి కుమారుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు అనుమానించి బుధవారం అతనిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. చదువుకోవాలంటూ నిత్యం పోరుపెడుతున్న తల్లి పట్ల ఆ బాలుడు ఆగ్రహం పెంచుకుని ఆ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. బాలుణ్ణి అరెస్టు చేసిన పోలీసులు గురువారం జువైనల్ హోంకు తరలించారు.

మగాడివైతే యుద్ధానికి రా!

- పాక్ ఆర్మీ చీఫ్‌కు తాలిబన్ల సవాల్

న్యూఢిల్లీ, అక్టోబరు 23: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్‌కు తెహ్రీక్ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తీవ్ర హెచ్చరికలు చేసింది. పాక్ ఆర్మీ తన సైనికులను చావడానికి పంపడం మానుకోవాలని హితవు పలికింది. దీని బదులు ఉన్నతాధికారులే యుద్ధక్షేత్రంలోకి దిగి ముందుండి నడిపించాలని సవాలు విసిరింది. పాకిస్తాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఇటీవల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో టీటీపీ ఈ మేరకు పాక్ ఆర్మీకి హెచ్చరికలు చేయడం గమనార్హం. పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోయిన అనేక ఘటనలకు సంబంధించిన వీడియోలను కూడా టీటీపీ విడుదల చేసింది. 'నువ్వు మగాడివైతే మమ్మల్ని ఎదుర్కో! తల్లిపాలు తాగినోడివైతే మాతో యుద్ధం చెయ్యి' అంటూ ఆ వీడియోల్లో మునీర్‌ను ఉద్దేశించి టీటీపీ కమాండర్ కజీమ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.

'సర్'కు సన్నాహాలు చేయండి

- రాష్ట్రాల సీఈవోలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) చేపట్టడానికి సన్నాహాలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారు (సీఈవో)లను ఆదేశించింది. ఈ సన్నాహాల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నివేదికలు పంపించాలని సూచించింది. గురువారం ఇక్కడ ముగిసిన ఈసీఓల సదస్సులో ఈ సూచనలు చేసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో 'సర్'కు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు వివరించారు. పలు సందేహాలను తీర్చారు. ఈ సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు పాల్గొన్నారు.

రష్యా చమురుపై

ఆంక్షల మంటలు!



(మొదటిపేజీ తరువాయి)

పాటు వాటి అనుబంధ కంపెనీలపై ఆంక్షలు విధించారు. అమెరికా సహా ప్రపంచ దేశాల్లోని కంపెనీలేవైనా.. సదరు రష్యా కంపెనీలతో ఎలాంటి లావాదేవీలు జరిపినా కఠిన చర్యలు చేపడతామని ప్రకటించారు. ఈ మేరకు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటన చేశారు. మిత్ర దేశాలన్నీ ఈ ఆంక్షలకు కట్టుబడి, తమతో కలిసి రావాలని కోరారు. రష్యా ఉక్రెయిన్‌లో ప్రజలను చంపడం ఆపి, వెంటనే కాల్పుల విరమణ పాటించడానికి ఇది సరైన సమయమని పేర్కొన్నారు. మరోవైపు యూరోపియన్ యూనియన్ కూడా రష్యా నుంచి సహజవాయువు దిగుమతులు, చమురు రవాణా నౌకలపై ఆంక్షలు విధించింది. రష్యాకు ఆర్థిక వనరులు అందకుండా చేయడమే తమ లక్ష్యమని ప్రకటించింది. ఇక రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించే అంశంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్న 35 దేశాల ప్రతినిధులు శుక్రవారం లండన్‌లో సమావేశం కానున్నారు. కాగా, అమెరికా తాజా ఆంక్షలపై రష్యా మండిపడింది. ఉక్రెయిన్‌లో యుద్ధం నిలిపివేత దిశగా జరుగుతున్న దౌత్య ప్రయత్నాలకు ఈ ఆంక్షలు విఘాతం కలిగిస్తాయని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆంక్షలను సమర్థంగా ఎదుర్కొనగలమని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ కొనుగోళ్లు ఆపేస్తుంది: ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. "రష్యా చమురులో 40%భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పుడు ఆ కొనుగోళ్లు నిలిపివేసేందుకు సిద్ధమైంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టొచ్చు. ఈ ఏడాది చివరికల్లా పూర్తిగా నిలిపివేస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి గతంలో రష్యా, చైనా మధ్య సంబంధాలు కూడా ఏమీ బాగుండేవి కావని.. కానీ అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా, బైడెన్ అమలు చేసిన విధానాల కారణంగా దగ్గరయ్యాయని వ్యాఖ్యానించారు. ఇప్పుడు పరిస్థితి మారుతోందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ఆపాలన్నదానిపై ఆసియాన్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చిస్తానని చెప్పారు.

చమురు ధరల మంటలు షురూ..

రష్యాకు చెందిన అతిపెద్ద చమురు సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగానే చమురు ధరల మంటలు మొదలయ్యాయి. గురువారం ఒక్కరోజే ముడి చమురు ధరలు 4.4% మేర పెరిగాయి. అమెరికా ఆంక్షల కారణంగా భారత్, చైనాల్లోని రిఫైనరీలు రష్యా చమురు సంస్థలతో లావాదేవీలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో ఇతర దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకోక తప్పదు. ఇది మార్కెట్లో డిమాండ్ పెంచుతుందనే ఉద్దేశంతో చమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి.

పరస్పరం కొనసాగుతున్న దాడులు..

ఉక్రెయిన్‌లోని కీవ్, ఖార్కివ్ సహా పది ప్రాంతాలపై రష్యా డ్రోన్, క్షిపణి దాడులు కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. రష్యా బుధవారం రాత్రి 405 డ్రోన్లు, 28 క్షిపణి దాడులు చేసినట్టు వెల్లడించింది. ఈ దాడుల్లో ఆరుగురు చనిపోయారని పేర్కొంది. అదే సమయంలో తాము రష్యాలోని కీలక రసాయన కర్మాగారంపై దాడి చేసి ధ్వంసం చేశామని వెల్లడించింది.


రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించక తప్పనట్లే!

ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా, యూరప్ దేశాలు గతంలో పలు ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించుకున్నాయి. ఈ క్రమంలో రష్యా తమ చమురును అమ్ముకునేందుకు రాయితీలు ఇవ్వడం మొదలుపెట్టింది. దీనితో రష్యా నుంచి చైనా, భారత్ చమురు దిగుమతులను భారీగా పెంచుకున్నాయి. అయితే చైనా, భారత్ చమురు కొనుగోళ్లతో సమకూరిన సొమ్మును ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యా వినియోగిస్తోందని అమెరికా మండిపడుతోంది. ఈ క్రమంలోనే భారత్‌పై 50% సుంకాలు కూడా విధించింది. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించాలన్న షరతు కూడా పెట్టింది. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించేందుకు భారత్ సిద్ధమైంది కూడా. దీనికితోడు రష్యా చమురు కంపెనీలపై తాజా ఆంక్షల నేపథ్యంలో భారత రిఫైనరీలు దిగుమతులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా భారత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా నుంచి తక్కువ ధర చమురును భారీ స్థాయిలో దిగుమతి చేసుకుని, శుద్ధిచేసి.. అమెరికా, యూరప్ దేశాలకు పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం, ఇతర ఉత్పత్తులను విక్రయిస్తోంది. రిలయన్స్‌కు రష్యా రాస్‌నెఫ్ట్ సంస్థ నుంచి రోజుకు 5లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా ఒప్పందం కూడా ఉంది. ఆంక్షల వల్ల రిలయన్స్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థలైన ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం సంస్థలు రష్యా చమురు దిగుమతులను నిలిపివేయనున్నాయి.

హెచ్-1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజు వద్దు

- ట్రంప్‌నకు అమెరికా చట్టసభ సభ్యుల బృందం లేఖ

న్యూఢిల్లీ, అక్టోబరు 23: హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు సొంత పార్టీ నుంచే సెగ తగిలింది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ అధికార రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలకు చెందిన ఏడుగురు చట్టసభ సభ్యుల బృందం ఆయనకు లేఖ రాసింది. పెంచిన ఫీజు కారణంగా చిన్న కంపెనీలతో పాటు స్టార్టప్‌లపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, ఆవిష్కరణలకు ఆటంకం ఏర్పడుతుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న హెచ్-1బీ వీసా విధానంలో మార్పులు అవసరమని తాము కూడా అంగీకరిస్తున్నామని, అయితే ఫీజు పెంపు నిర్ణయం కంపెనీల యాజమాన్యాలకు గణనీయమైన సవాళ్లను సృష్టించడంతో పాటు అమెరికా పోటీ తత్వాన్ని బలహీనపరుస్తుందని హెచ్చరించారు. దీనివల్ల నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను దేశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అమెరికన్ల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకొనే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం, వీసా అర్హతల్లో మార్పులు తదితర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీజులు పెంచడానికి బదులుగా ఈ వ్యవస్థను సరిదిద్దడానికి కాంగ్రెస్‌తో కలసి పనిచేయాలని అధ్యక్షుడిని కోరారు. హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సమస్యలను పరిష్కరించడానికి గల మార్గాలపై తమతో చర్చలు జరపాలని ట్రంప్‌తో పాటు వాణిజ్య మంత్రి లుట్నిక్‌ను సభ్యుల బృందం అభ్యర్థించింది.



లోకం తీరు

ఆసియాన్ సదస్సుకు మోదీ వెళ్లట్లే!

- వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని
- మలేసియాలో ట్రంప్-మోదీ భేటీ లేనట్లే..



న్యూఢిల్లీ, అక్టోబరు 23: మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరగనున్న 47వ ఆసియాన్ సదస్సుకు ప్రధాని మోదీ హాజరవడం లేదు. ఈ విషయాన్ని గురువారం ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న ఆసియాన్ సదస్సుకు వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతున్నానని.. వర్చువల్‌గా పాల్గొంటానని తెలిపారు. అంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోదీ భేటీ లేదన్నమాట. మోదీకి బదులుగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో తెలిపారు. ఆసియాన్ సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా, భారత్ ఎప్పటికీ మలేసియాకు ప్రధాన భాగస్వామి అని ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం అన్నారు. ప్రధాని మోదీ తనకు ఫోన్ చేశారని తెలిపారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ప్రధాని మోదీ ఆసియాన్ సదస్సుకు వెళ్లడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాగా, భారత్‌లోని కెనడా రాయబార కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి మోదీ సర్కారు అంగీకారం తెలిపింది.

కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత

రుద్రప్రయాగ్/ఉత్తరకాశీ, అక్టోబరు 23: శీతాకాలం రావడంతో హిమాలయాల్లోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను ఉత్తరాఖండ్ అధికారులు మూసివేశారు. ఈ సందర్భంగా గురువారం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆర్మీ మేళతాళాలు, సుమారు పది వేల మంది భక్తుల నినాదాల మధ్య రుద్రప్రయాగ్ నుంచి కేదార్‌నాథుడి పల్లకి ఊరేగింపు ఘనంగా ప్రారంభమయింది. ఈ ఊరేగింపు శనివారం నాటికి ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయానికి చేరుకోనుంది. మిగిలిన ఆరునెలల పాటు ఆ ఆలయంలో కేదార్‌నాథుడు పూజలందుకుంటాడు. ఈ ఉత్సవాల్లో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ఆలయాలను అధికారులు మూసివేయగా, బద్రీనాథ్ ఆలయాన్ని నవంబరు 25న మూసివేయనున్నారు. మంచు, తీవ్రమైన చలి కారణంగా ప్రతి సంవత్సరం అక్టోబరు- నవంబరు నెలల్లో ఈ ఆలయాలను మూసివేసి ఏప్రిల్- మే నెలల్లో తిరిగి తెరుస్తారు.

మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్



పట్నా, అక్టోబరు 23: బిహార్ మహాగఠ్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిగా రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్ పేరును ఎట్టకేలకు అధికారికంగా ప్రకటించారు. దీంతో పాటు డిప్యూటీ సీఎం అభ్యర్థిగా వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) అధ్యక్షుడు ముఖేశ్ సహనీ పేరును కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ పాట్నాలో ప్రకటించారు. ఈ ఇద్దరి పేర్లపై కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు విపక్ష కూటమి అంగీకారం తెలిపిందని ఆయన వెల్లడించారు. తేజస్వీ గతంలోనే డిప్యూటీ సీఎంగా పనిచేయగా, సహనీ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు.

ఎవరీ ముఖేశ్ సహనీ

వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సహనీ 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి నలుగురు అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. అయితే తాను మాత్రం ఓడిపోయారు. అయినా ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన బీజేపీ.. కేబినెట్‌లో మత్స్యశాఖ మంత్రిగా తీసుకుంది. అనంతర పరిణామాల్లో ఆయన పార్టీ ఎమ్మెల్యే ఒకరు చనిపోవడం, మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. ఆ తర్వాత సహనీకి బీజేపీ అవకాశం ఇవ్వకపోవడంతో మహాగఠ్‌బంధన్‌తో చేతులు కలిపారు. మరోవైపు.. బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవరును వెంటనే తొలగించాలని డిమాండు చేస్తూ గురువారం పట్నాలో స్థానిక నేతలు ఆందోళనకు దిగారు. దీనిపై స్పందించిన అధిష్ఠానం.. కృష్ణ అల్లవరు యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగానూ కొనసాగుతుండగా ఆ బాధ్యతల నుంచి తప్పించింది. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఎన్డీయే వికాసానికి, మహాగఠ్‌బంధన్ వినాశనానికి మధ్య పోరుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పారు. ఔరంగాబాద్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తాను పాట్నాలోనే పుట్టి పెరిగానని, ఆర్జేడీ అవినీతి పాలనను కళ్లారా చూశానన్నారు.

మరో వందేళ్ల దాకా మరచిపోలేరు: మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 23: మరో వందేళ్ల దాకా బిహార్‌లో ఆర్జేడీ ఆటవిక పాలనను ప్రజలు మరచిపోలేరని ప్రధాని మోదీ చెప్పారు. విపక్షాలది పార్టీల కూటమి కాదని, బెయిల్‌పై బయట కొచ్చిన దోపిడిదార్ల కూటమి అని ఆరోపించారు. యువ సంవాద్ పేరిట ఆయన ఆన్‌లైన్ ద్వారా బిహార్ యువతతో ముచ్చటించారు. కేంద్రంలోనూ, బిహార్‌లోనూ స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాలు ఉండటం వల్లే నిరంతర అభివృద్ధి జరుగుతోందన్నారు. తాజా ఎన్నికలు కొత్త చరిత్రను సృష్టించబోతున్నాయని, ఇందులో యువత కీలక పాత్ర పోషించబోతుందని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలని ఓటర్లకు చెప్పాలని ప్రధాని యువతకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించాలన్నారు.

కార్బయిడ్ గన్.. 14 మంది పిల్లల చూపు పోగొట్టింది!

- మధ్యప్రదేశ్‌లో కొన్ని కుటుంబాల్లో చీకట్లు నింపిన దీపావళి
- ఈ తుపాకులపై కేంద్రం నిషేధం.. అయినా అడ్డగోలుగా విక్రయాలు



భోపాల్, అక్టోబరు 23: కాకర పూవొత్తులు, చిచ్చుబుడ్లు, దూసుకెళ్లే రాకెట్లతో అమావాస్య చీకట్లను చీల్చుకొని.. వెలుగుజిలుగులు పరచడం ద్వారా నింగిని శోభాయమానం చేసి నేత్రపర్వంగా సాగే దీపావళి, కొందరి పిల్లల కంటిచూపును శాశ్వతంగా పోగొట్టి వారి జీవితాల్లో చీకట్లు నింపింది. అత్యంత ప్రమాదకరమైన కార్బయిడ్ గన్‌ను పేల్చడం ద్వారా మధ్యప్రదేశ్‌లో కేవలం మూడు రోజుల్లో 122 మంది చిన్నారులు తీవ్ర నేత్ర సంబంధిత గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. వీరిలో 14 మంది చిన్నారులు శాశ్వతంగా చూపు పోగొట్టుకున్నారు. విదిశ జిల్లాలో ఎక్కువ మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. భోపాల్, ఇండోర్, జబల్‌పూర్, గ్వాలియర్‌లోనూ ఎక్కువ కేసులు వెలుగుచూసినట్లు చెబుతున్నారు. కార్బయిడ్ తుపాకులు అత్యంత ప్రమాదకరమైనవి కావడంతో వీటి అమ్మకాలపై అక్టోబరు 18న కేంద్రం నిషేధం విధించింది. అయినా.. వీటి విక్రయాలు భారీగా సాగాయి. కార్బైడ్ గన్ అనేది హ్యాండ్‌మేడ్ గన్. ప్లాస్టిక్ గొట్టాలతో తయారు చేస్తారు. దానికి చిన్న రంధ్రం చేసి.. అందులో కాల్షియం కార్బయిడ్ లేదా గన్‌పౌడర్ కూర్చి పేల్చుతారు. ఇది పేల్చితే బాంబుల తరహాలో భారీగా శబ్దం వస్తుండం, అప్పటికప్పుడు పైపులతో సులభంగా తయారు చేసుకునే వీలు ఉండటం, బయట కూడా తక్కువ ధర (రూ.150-రూ.200)కే లభిస్తుండటంతో మధ్యప్రదేశ్‌లో పిల్లలు ఈసారి ఎగబడి కొన్నారు. ఈ తుపాకులను పేల్చినప్పుడు కొన్నిసార్లు నిప్పుకణికల్లాంటి రసాయన రేణువులు, మంటలు నేరుగా ముఖంపైకే దూసుకొస్తాయి. ఆస్పత్రిపాలైన పిల్లల్లో చాలామంది పాక్షికంగా చూపు కోల్పోయారు. 'కార్బయిడ్ గన్‌తో ఒక కన్ను పూర్తిగా కాలిపోయింది. ఆ కన్నుతో నేను ఇక చూడలేను' అని నేహ అనే 17 ఏళ్ల బాలిక చెప్పింది. 'సోషల్ మీడియాలో చూసి.. కార్బయిడ్ గన్‌ను నేనే తయారు చేసి పండుగ రోజు పేల్చాను. ముఖమ్మీదే పేలడంతో ఒక కన్ను పూర్తిగా పోయింది' అని రాజ్ విశ్వకర్మ అనే యువకుడు చెప్పాడు. కార్బయిడ్ గన్ తయారీ, విక్రయాలకు సంబంధించి విదిశ జిల్లాలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కార్బయిడ్ గన్‌ను బొమ్మ తుపాకీగా పరిగణించొద్దని, అది అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థం అని.. కంటి రెటీనాను పూర్తిగా దెబ్బతీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నాగ్ క్షిపణులు.. టార్పెడోలు..

రూ.79 వేల కోట్లతో ఆయుధాల కొనుగోలుకు ఆమోదం



న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ఈ ఏడాది ఆగస్టులో రూ.67,000 కోట్ల విలువైన రక్షణ పరికరాల సేకరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్రం.. తాజాగా మరో రూ.79,000కోట్ల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాలు, మిలిటరీ హార్డ్‌వేర్ కొనుగోలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశంలో.. ట్యాంక్ విధ్వంసక గైడెడ్ నాగ్-2 క్షిపణులు, ఉభయచర యుద్ధ నౌకలకు అవసరమైన ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్, అడ్వాన్స్‌డ్ లైట్ వెయిట్ టార్పెడోలు, ఎలక్ట్రానిక్స్ ఇంటెలిజెన్స్, నిఘా వ్యవస్థలు సహా రూ.79,000 కోట్ల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇంత భారీ మొత్తంలో రక్షణ పరికరాల సేకరణకు ఆమోదం తెలపడం ఇది రెండోసారి. భారత నావికా దళం కోసం.. ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్ (ఎల్‌పీడీ), 30 ఎంఎం నావల్ సర్ఫేస్ గన్స్ (ఎన్ఎస్‌జీ), అడ్వాన్స్‌డ్ లైట్ వెయిట్ టార్పెడోలు (ఏఎల్‌డబ్ల్యూటీ), ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రా-రెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సిస్టమ్, 76 ఎంఎం సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ కోసం స్మార్ట్ మందుగుండు సామగ్రి కొనుగోలు చేయనున్నారు. ఎల్‌పీడీల సేకరణ వల్ల భారత నావికాదళం.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌తో కలిసి ఉభయచర కార్యకలాపాలు చేపట్టేందుకు ఉపయోగపడతాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధిచేసిన ఏఎల్‌డబ్ల్యూటీలకు సంప్రదాయ, అణు జలాంతర్గాములను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం ఉంది. 30 ఎంఎం ఎన్ఎస్‌జీలతో నేవీ, భారత తీరప్రాంత రక్షణ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇక భారత సైన్యం కోసం.. 2,408 యాంటీ ట్యాంక్ గైడెడ్ నాగ్ మార్క్-2 మిస్సైల్స్ (నామిస్), గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సిస్టమ్, హై మొబిలిటీ వెహికిల్స్ (హెచ్‌ఎంవీ) కొనుగోలు చేసేందుకు ఆమోదం లభించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నాగ్ మార్క్-2 క్షిపణులను సమకూర్చుకుంటే శత్రువుల పోరాట వాహనాలు, బంకర్లు, స్థావరాలను లక్ష్యంగా దాడులు చేయడానికి ఉపయోగపడతాయని, గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ శత్రువు కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని 24 గంటలూ అందిస్తుందని రక్షణ శాఖ పేర్కొంది. అలాగే భారత వైమానిక దళం కోసం కొలాబరేటి వ్ లాంగ్ రేంజ్ టార్గెట్ సాచ్యురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ (సీఎల్ఆర్‌టీఎస్/డీఎస్)ను కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

380 పదాతిదళ బెటాలియన్లకు 'ఆష్నీ' డ్రోన్లు

భారత సైన్యంలోని 380 పదాతిదళ బెటాలియన్లను 'ఆష్నీ' డ్రోన్ ప్లాటూన్లతో అనుసంధానం చేసినట్టు పదాతి దళ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అజయ్ కుమార్ తెలిపారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో సైన్యం పోరాట సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునీకరణలో భాగంగా ఎలైట్ కమాండో యూనిట్లను పెంచుతున్నామని చెప్పారు. పదాతి దళ ఆధునీకరణలో భాగంగా సైన్యం రూ.2,770 కోట్లతో 4.25 లక్షల తుపాకీలు కూడా కొనుగోలు చేయనుందని చెప్పారు. 380 పదాతిదళ బెటాలియన్లలో ప్రతి బెటాలియన్‌కూ ఒక ఆష్నీ డ్రోన్ ప్లాటూన్‌ను అందిస్తున్నామని, వాటిలో కనీసం నాలుగు నిఘా డ్రోన్లు కూడా ఉంటాయన్నారు.

ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు



(మొదటి పేజీ తరువాయి)

కానున్నాయి. ఇక ప్రాక్టికల్ పరీక్షలు జనవరి ఆఖర్లో ప్రారంభించి ఫిబ్రవరి మొదటి వారంలో పూర్తి చేయనున్నారు. ఈ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో నిర్వహించనున్నారు. పరీక్షల షెడ్యూల్‌తోపాటు ఫీజులకు సంబంధించి ఇంటర్ బోర్డు చేసిన ప్రతిపాదనను ప్రభుత్వంగురువారం ఆమోదించింది. పరీక్షలు ముందుగా నిర్వహిస్తే సెకండియర్ విద్యార్థులు ఎప్‌సెట్, ఐఐటీ లాంటి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యేందుకు మరింత సమయం లభించనుంది. అలాగే పరీక్షలు ముందుగా ముగించి ఫలితాలు ప్రకటిస్తే.. కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపుపై అధ్యాపకులు పూర్తిగా దృష్టిసారించే అవకాశాలుంటాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఈసారి ప్రాక్టికల్ పరీక్షలకు ఒక్కో విద్యార్థికి రూ.30 చొప్పున వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈసారి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి నుంచి రికగ్నిషన్ ఫీజు రూ.220, గ్రీన్ ఫండ్ ఫీజు రూ.15 చొప్పున వసూలు చేయాలని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు నవంబరు13

పదో తరగతి వార్షిక, ఒకేషనల్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ప్రభుత్వ పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. ఈనెల 30 నుంచి నవంబరు13 వరకు పదో తరగతి విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు చెల్లించాల్సి ఉంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 11, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు29 లోపు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులకు ఫీజు రూ.125గా నిర్ణయించారు. గతంలో ఫెయిలైనవారు 3 సబ్జెక్టుల వరకు రూ.110, 3-6 సబ్జెక్టులకు రూ.125 చెల్లించాలి. ఇక ఒకేషనల్ పరీక్షలకు ఫీజు రూ.60గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంది.



పాఠాలు వింటూనే బెంచీ మీద తలవాల్చేసి..

- ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి తొమ్మిదేళ్ల బాలుడు
- బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించిన ఆస్పత్రి వైద్యులు
- హనుమకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘటన



ప్రేమ్ కుమార్

హనుమకొండ, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): బానోతు సుదీష్ ప్రేమ్ కుమార్.. తొమ్మిదేళ్లుంటాయి. నాలుగో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బడికి వెళ్లాడు. తరగతి గదిలో పాఠాలు వింటూనే ఒక్కసారిగా బెంచీపై తలవాల్చేశాడు. కంగారుపడిన ఉపాధ్యాయురాలు.. మిగతా టీచర్లకు చెప్పగా అంతా కలిసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. బాలుడు బ్రెయిన్ డెడ్ అయినట్లు చెప్పారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం జరిగిన ఈ ఘటన అక్కడివారిని తీవ్ర విషాదంలో ముంచింది. ప్రేమ్ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు. తండ్రి రమేశ్ విద్యుత్తు శాఖలో, తల్లి సుజాత ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నారు. పొద్దున బడికి వెళ్లే సమయంలో పూర్తి ఆరోగ్యంగా ఉన్న తమ బిడ్డ.. హఠాత్తుగా ఈ స్థితికి చేరుకోవడాన్ని రమేశ్, సుజాత దంపతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పాఠశాల యాజమాన్యం సకాలంలో స్పందించి ఉండాల్సిందని కన్నీరుమున్నీరయ్యారు. తీవ్రమైన తలనొప్పి వచ్చిన సందర్భాల్లో శ్వాస సరిగా అందకపోవడంవల్ల బ్రెయిన్‌డెడ్ అవుతారని వైద్యులు వారికి చెప్పినట్లు సమాచారం. గుండె ఇంకా కొట్టుకుంటుండటంతో ప్రేమ్‌ను వెంటిలేటర్‌పై ఉంచారు. కాగా విద్యార్థి సంఘాలు పాఠశాల వద్దకు చేరుకొని ఘటనపై ఆందోళనకు దిగాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపాలని, పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇదే పాఠశాలలో నెల పదిహేను రోజుల క్రితం ఓ విద్యార్థి మృతిచెందాడని, మళ్లీ అలాంటి ఘటనే జరగడం చూస్తుంటే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. పోలీసులొచ్చి విద్యార్థి సంఘాల ప్రతినిధులను శాంతింపజేశారు. కాగా, ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ప్రామిక విచారణ జరిపారు. పాఠశాలలోని సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యాలను తెప్పించుకొని చూశారు. విద్యార్థికి ఇలా జరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు.

ప్రేమ పేరుతో పోకిరీ వేధింపులు

- అవమానంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



జశ్విత (ఫైల్)

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ పోకిరీ పెట్టిన వేధింపులు తాళలేక ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో జరిగింది. పేరువంచకు జశ్విత (18) కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన అనిల్.. కొంత కాలంగా ప్రేమిస్తున్నానంటూ జశ్విత వెంటపడుతున్నాడు. యువతి కుటుంబసభ్యులు హెచ్చరించినా అతడి తీరు మారలేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జశ్విత ఇంట్లోకి ప్రవేశించిన అనిల్.. యువతితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయగా ఇంటి బయట షాపులో ఉన్న వెంకటయ్య వచ్చి అనిల్‌ను అడ్డుకోవడంతో 'నీ బిడ్డను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటా' అని కేకలు వేస్తూ చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో మనోవేదనకు గురైన జశ్విత గురువారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. గమనించిన వెంకటయ్య.. జశ్వితను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనిల్‌పై వేధింపుల కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని కల్లూరు ఎస్సై డి.హరిత తెలిపారు.

ఫీజు బకాయిల కోసం బీజేపీ పోరుబాట

విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలతో కలిసి వచ్చేనెల తొలివారంలో 'చలో హైదరాబాద్'!

- కాలేజీ యాజమాన్యాల సమ్మెకు పూర్తి మద్దతు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- బండి సంజయ్, లక్ష్మణ్‌తో కాలేజీ యాజమాన్యాల భేటీ



కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్‌తో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు

హైదరాబాద్, గన్‌పార్క్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులు సహా వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి వచ్చేనెల మొదటి వారంలో 'ఛలో హైదరాబాద్ ' ఆందోళన చేపట్టాలని నిర్ణయించింది. అలాగే ఫీజు బకాయిలు పూర్తిగా చెల్లించేదాకా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగించేందుకు కార్యాచరణ రూపొందించు కుంటోంది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు గురువారం ఉదయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతో, కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో వేర్వేరుగా సమావేశమయ్యాయి. బండి సంజయ్‌తో జరిగిన భేటీలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ పాల్గొన్నారు. భేటీ సందర్భంగా.. భవిష్యత్తు కార్యాచరణపై కాలేజీ యాజమాన్యాలతో బండి, లక్ష్మణ్ చర్చించారు. రెండు, మూడు రోజుల్లో ఫీజు బకాయిలు చెల్లించని పక్షంలో వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు నవంబరు మొదటి వారంలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహించాలనే విషయమ్మీద చర్చలు జరిపారు. ఈ భారీ ఆందోళనకు బీజేపీ.. ఒకట్రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేయనుంది. కాగా ప్రతినెలా రూ.500 కోట్ల చొప్పున ఏడాదిలో రూ.6వేల కోట్ల మేర ఉన్న బకాయిలను చెల్లిస్తామని అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ ప్రకటించారని యాజమాన్యాలు గుర్తు చేశాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ తాము సమ్మె నోటీసు ఇస్తే.. కాలేజీల్లో తనిఖీల పేరుతో విజిలెన్స్ బృందాలను పంపి బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ బండి సంజయ్, లక్ష్మణ్‌తో యాజమాన్యాలు పేర్కొన్నాయి. అయితే.. బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే.. తనిఖీలు చేసినా తమకు ఇబ్బంది లేదని, తాము పొరపాట్లు చేసి ఉంటే గనక సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాయి. కాగా యాజమాన్యాల ఆవేదనంతా విన్న బండి సంజయ్.. రాంచందర్‌రావుతో ఫోన్‌లో చర్చించారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు తనతో ప్రస్తావించిన అంశాలను సంజయ్‌తో రాంచందర్‌రావు పంచుకున్నారు. విద్యాసంస్థల సమ్మెకు సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్లు రాంచందర్‌రావు ప్రకటించారు. విద్యార్థులు, యాజమాన్యాల న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేవరకూ బీజేపీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం.. కాలేజీ యాజమాన్యాలు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సంజయ్ ప్రకటించారు. ఫీజు బకాయిలు చెల్లించేలా విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల పక్షాన నిలబడి బీజేపీ పోరాడుతుందని హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై అసెంబ్లీలో ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

నెత్తురోడిన రహదారులు

- ఒకేరోజు 4 వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం
- రంగారెడ్డి, మంచిర్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఘటనలు
- వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి.. చికిత్స పొందుతూ ఇద్దరి మృతి.. తుక్కుగూడ, జల్‌పల్లి వద్ద ఘటనలు

చేవెళ్ల, సిరిసిల్ల, యాచారం, జిన్నారం, పహాడిషరీఫ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకేరోజు నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణంపాలయ్యారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. ఆ పిల్లల్లో ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు కావడం మరో విషాదం. చేవెళ్ల పరిధిలోని మల్కాపూర్ గేట్ వద్ద గురువారం అర్ధరాత్రి దాటాక ఓ వాహనం ఢీకొని ఇద్దరు మృతిచెందారు. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం పగడియాల్‌కు చెందిన వడ్ల రవి కుమార్ చారి (27), సయ్యద్ సల్మాన్ (27) స్నేహితులు. పరిగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దమ్మను పరామర్శించేందుకు సల్మాన్‌ను వెంటబెట్టుకొని రవి గురువారం స్కూటీపై బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి వీరు ప్రయాణిస్తున్న స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ మృతి చెందారు. సిరిసిల్ల జిల్లా చందుర్తి తిమ్మాపూర్‌కు చెందిన పిట్టల నీరజ.. తన ఇద్దరు కూతుళ్లను వెంటబెట్టుకొని ఇటీవల కోనరావుపేట మండలం నిమ్మపల్లిలోని పుట్టింటికి వెళ్లింది. గురువారం తిరిగివస్తూ సిరిసిల్లలో తెలిసిన వ్యక్తి ముప్పారపు అజేరియా (37) కనిపించడం, బైక్‌పై తమ ఊరికే వెళుతుండటంతో పెద్ద కూతురు సాన్విత (8)ను అతడి బైక్ ఎక్కించింది. చిన్న కూతురితో కలిసి తాను ఆటో ఎక్కింది. అయితే అజేరియా, సాన్విత ప్రయాణిస్తున్న బైక్.. సిరిసిల్ల బైపాస్‌రోడ్డు కన్వెన్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అజేరియా, సాన్విక మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్వేన్‌కు చెందిన తలాతి హరిబాబు, తాతి స్వామి అన్నదమ్ములు. నల్లగొండ జిల్లా చండూర్‌లోని ఓ విందులో పాల్గొనేందుకు స్వామి తన కుమారులు హర్దిక్ రామ్ (9), సాత్విక్ రామ్ (11)తో పాటు సోదరుడి కుమారుడు అభిరామ్ (8)లను బైక్‌పై ఎక్కించుకొని బయలుదేరాడు. బైక్ యాచారం మండలం తమ్మలోనిగేట్ వద్దకు రాగానే.. ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో హార్దిక్‌రామ్, అభిరామ్ మృతిచెందారు. స్వామి, సాత్విక్‌రామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గన్‌పూర్‌కు చెందిన దొసర్ల అంకన్న (46), ఉట్నూరు మండలం నాగ్‌పూర్‌కు చెందిన సిడాల మోతీరామ్ (50) బైక్‌పై గురువారం జిన్నారం వెళ్తుండగా.. మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం మొర్రిగూడ వద్ద కారు ఢీకొట్టింది. ఇద్దరూ తీవ్రగాయాలతో మృతిచెందారు. ఇక.. బుధవారం రాత్రి హైదరాబాద్ తుక్కుగూడ అయ్యప్ప ఆలయం వద్ద జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌లోని మల్లాపూర్‌కు చెందిన కుక్కల శ్రీకాంత్ (20) గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. చాంద్రాయణగుట్టకు చెందిన మహేశ్ ఈనెల 19న బైక్‌పై వెళుతూ జల్‌పల్లి గేటు వద్ద అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు.


వివేకా హత్య కేసులో నిందితులకు సీబీఐ కోర్టు నోటీసులు

- 'తదుపరి దర్యాప్తు'పై అభిప్రాయాలు చెప్పాలని ఆదేశం
- దర్యాప్తు అసంపూర్ణమంటూ సునీత పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో 'తదుపరి దర్యాప్తు'నకు సంబంధించి వివరణ ఇవ్వాలని నిందితులకు సీబీఐ కోర్టు నోటీసులు పంపించింది. నిందితులుగా ఉన్న టీ గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి (అప్రూవర్), దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిలతోపాటు ప్రతివాదిగా ఉన్న సీబీఐకి నాంపల్లి సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి డాక్టర్ టీ రఘురాం ఆదేశాలు జారీచేశారు. తన తండ్రి హత్యకు సంబంధించి ఇంకా వెలుగు చూడాల్సిన అనేక విషయాలు ఉన్నాయని, సీబీఐ లోతుగా దర్యాప్తు చేయకుండా వదిలేసిందని పేర్కొంటూ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఇది విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున న్యాయవాది ఎస్ గౌతమ్ వాదనలు వినిపిస్తూ 'తదుపరి దర్యాప్తు' చేయాలన్న తమ పిటిషన్‌ను విచారణార్హత (మెయింటెనబులిటీ) పేరిట తిరస్కరించరాదని సుప్రీంకోర్టు నిర్దేశించిన విషయాన్ని గుర్తుచేశారు. అందరి వాదనలు విని 8 వారాల్లో ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిందని తెలిపారు. వాస్తవానికి తదుపరి దర్యాప్తు చేయాలి అనే విషయం బాధితురాలైన సునీతకు, సీబీఐకి మధ్య ఉన్న అంశమని, దీనిపై నిందితుల వాదన వినాల్సిన అవసరం లేదని తెలిపారు. అయినప్పటికీ అందరివాదన విని నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొనడంతో నిందితులందరికీ కాపీలు అందజేశామని పేర్కొన్నారు. వాదనలు విన్న కోర్టు.. సుప్రీంకోర్టు సమయం నిర్దేశించిన నేపథ్యంలో ఈనెల 27లోపు కౌంటర్‌లు దాఖలు చేయాలని నిందితులు, సీబీఐకి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. మరోవైపు వివేకా హత్యకు సంబంధించిన ప్రధాన కేసు సైతం గురువారం విచారణకు వచ్చింది. ఈ విచారణకు నిందితులు గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి హాజరుకాగా మిగతా వారు రాలేదు. తదుపరి విచారణ నవంబర్ 10కి వాయిదా పడింది.

బాలికల పట్ల పీఈటీ అసభ్యకర చేష్టలు

- అభ్యంతరకరంగా తాకుతూ వేధింపులు
- అసభ్యపదజాలంతో వాట్సాప్ మెసేజ్‌లు
- అతడిని కొట్టి.. పోలీసులకు అప్పగించిన ఏబీవీపీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు
- భూపాలపల్లిలోని ప్రైవేటు స్కూల్లో ఘటన
- పీఈటీని విధుల నుంచి తొలగిస్తామన్న ప్రిన్సిపల్



పీఈటీ మోహన్

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బానోతు మోహన్ (29) అక్కడ చదువుకుంటున్న బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలొచ్చాయి. మహాముత్తారం మండలం బూర్లగూడేనికి చెందిన మోహన్ ఏడాది క్రితమే విధుల్లో చేరాడు. అతడు.. బడిలోని 7-10 తరగతులకు చెందిన కొందరు బాలికలను అభ్యంతరక రీతిలో తాకుతున్నట్లు, వాట్సాప్‌లో వారికి అసభ్యపదజాలంతో సందేశాలు పంపుతున్నట్లు ఆరోపణలొచ్చాయి. అతడి వేధింపులు తీవ్రం కావడంతో ఓ బాలిక, తన తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పుకొంది. సదరు విద్యార్థిని తల్లి.. బజరంగ్‌దళ్‌లోని ఓ నేతకు విషయం చెప్పడంతో బుధవారం సాయంత్రం ఏబీవీపీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు బడికి చేరుకున్నారు. విద్యార్థినులను ఓ గదిలోకి తీసుకెళ్లి పీఈటీ వేధింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థినులు.. ఓ కాగితంపై ఆ పీఈటీ పేరు రాసి, అతడి వేధింపుల గురించి వివరించారు. ఆ చీటీలన్నీ చదవిన ప్రతినిధులు.. పీఈటీ మోహన్‌ను పట్టుకొని కొట్టారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. కాగా ఈ ఘటనపై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసచారి స్పందించారు. విద్యార్థినులతో పీఈటీ అసభ్యంగా ప్రవర్తించినట్లుగా తమ దృష్టికి రాలేదని.. పిల్లలుగానీ, తల్లిదండ్రుల నుంచి గానీ ఫిర్యాదు రాలేదని అయినా పీఈటీ మోహన్‌ను విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి రాజేందర్ విచారణ జరిపారు. పాఠశాలకు చేరుకున్న ఆయన ప్రిన్సిపల్‌తో ఘటనపై ఆరా తీశారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మోదీ అతి జాగ్రత్త!


భారత ప్రధాని నరేంద్రమోదీ ఆసియాన్ సదస్సుకు వెళ్ళడం లేదు. కౌలాలంపూర్‌లో ఈనెల 26–27తేదీల్లో జరగబోతున్న ఈ సదస్సుకు ఆయన వర్చువల్‌గా హాజరవుతారని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రాహీం గురువారం ప్రకటించడంతో పాటు, దీపావళి వేడుకల కారణంగానే మోదీ రాలేకపోతున్నారని కూడా తెలియచేశారు. మలేషియా అధ్యక్షతన జరిగే ఈ సదస్సు విజయవంతం కావాలని ఆశిస్తూ మోదీ కూడా తన ట్వీట్‌లో ఈ వర్చువల్ హాజరు అంశాన్ని ఖరారుచేశారు. వ్యక్తిగత గైర్హాజరుకు కారణం దీపావళి వేడుకలంటూ పైకి చెబుతున్నప్పటికీ, దగ్గరపడిన బిహార్ ఎన్నికలు కారణం కావచ్చునని విశ్లేషకుల వాదన. కానీ, కాంగ్రెస్‌కు మాత్రం ఇందులో మరోకోణం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు వస్తున్నందున మోదీ ఇలా మొఖం చాటేస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధి జైరామ్ రమేష్ అంటున్నారు. 'సోషల్ మీడియాలో ట్రంప్‌ను ఆకాశానికి ఎత్తేయడం వేరు, పక్కనే నిలబడి భుజంభుజం రాసుకోవడం వేరు. ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని యాభైమూడుసార్లు, భారత్ ఇకపై రష్యా చమురు కొనబోదని ఇప్పటికే ఐదుసార్లు చెప్పుకున్న మనిషికి ఎదురుపడటం రిస్కే' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. మొన్నటికి మొన్న గాజా శాంతి సదస్సుకు మోదీ గైర్హాజరు కావడానికి కూడా ఇదే కారణమని గుర్తుచేస్తూ, ఇలా అంతర్జాతీయవేదికలకు మొఖం చాటేస్తూంటే ప్రపంచనాయకులతో ముచ్చట్లు, వారితో ఫోటోలు దిగుతూ తనను తాను విశ్వగురుగా అభివర్ణించుకొనే అవకాశం తప్పిపోతుంది కదా? అని జైరాం రమేష్ ఎద్దేవా చేస్తూ, 'బచ్‌కే రే రహ్నారే బాబా, బచ్‌కే రహ్నారే' అన్న పాత హిందీ చిత్రగీతాన్ని గుర్తుచేశారు.

బిహార్ ఎన్నికలు భారతీయ జనతాపార్టీకి ముఖ్యమే కానీ, ఒక అంతర్జాతీయ సదస్సుకోసం మోదీ ఓ రెండురోజులు తన షెడ్యూల్ సర్దుకోలేరా? ఆసియాన్‌తో మనబంధం ఇటీవల బాగా బలపడింది కూడా. అనేకదేశాధినేతలతో చర్చలు జరపగలిగే అవకాశం ఉండికూడా కౌలాలంపూర్ పోవద్దన్న నిర్ణయం వెనుక ట్రంప్‌కు ఎదురుపడటం ఎందుకన్న ఆలోచన ఉండే ఉంటుంది. మోదీ తనకు ఆప్తమిత్రుడని అంటూనే ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ట్రంప్‌కు ఎదురుపడటం ప్రమాదమే. అంతా సవ్యంగా ఉన్నప్పుడే ట్రంప్‌తో భేటీ అంటే ఒక అనిశ్చితి. ఓ ప్రమాదహెచ్చరిక. ఎర్రతివాచీలే ఉంటాయన్న నమ్మకమేమీ లేదు. ఉక్రెయిన్ అధ్యక్షుడి గతానుభవం తెలియనిదేమీ కాదు.

గురువారం మళ్ళీ రెండు రష్యన్ చమురుకంపెనీలపై ట్రంప్ సరికొత్త ఆంక్షలు విధిస్తే, ఇటువంటివి చాలా చూశామని రష్యా తేలికగా తీసిపారేసింది. ముడిచమురు కొనడం ఆపేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెబుతున్నప్పుడల్లా మన ప్రభుత్వం ఔననీ, కాదనీ అనకుండా, అతి జాగ్రత్తగా మాట్లాడుతూ వస్తోంది. ట్రంప్ మాటలు నమ్మక్కర్లేదని అనుకున్నప్పటికీ, అమెరికా ఒత్తిళ్ళతో గతంలో చాలా రాజీలు పడిన, ఆయా దేశాలనుంచి చమురుకొనడం మానేసిన అనుభవం మనకు ఉన్నది కనుక, ట్రంప్ ఒత్తిడిమేరకు రష్యా నుంచి చమురు దిగుమతులు వేగంగా తగ్గించుకొనే ఆలోచనలో భారత్ ఉండవచ్చు. దేశప్రయోజనాలే పరమావధి అని పైకి చెబుతున్నప్పటికీ, ప్రస్తుత భారీ దిగుమతుల్లోనూ సామాన్యుల ప్రయోజనాలు అంతగా లేవు కనుక, ఆ నిర్ణయం ఎప్పుడైనా జరగవచ్చు. అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించగలననుకున్న ట్రంప్ అది సాధ్యం కాకపోవడంతో తలకిందులైపోతున్నారు. పుతిన్‌ను దారికి తేవడం సాధ్యం కాక, మళ్ళీ జెలెన్‌స్కీమీద కన్నెర్రచేశారు. తక్షణమే యుద్ధం ఆగాలంటే రష్యా ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ ఉక్రెయిన్ వదులుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఉక్రెయిన్‌కు తోమహాక్ క్షిపణులు ఇస్తానని బెదిరించినంతమాత్రాన రష్యా వొణికిపోతుందని అనుకోవడం అవివేకం. రష్యన్ నగరాలన్నింటినీ ధ్వంసం చేయగల ఆ క్షిపణులు నిజంగానే ఉక్రెయిన్ చేతికి వస్తే, అది మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తుంది తప్ప యుద్ధం ముగిసిపోదు. ఇంతాచేసి చివరకు జెలెన్‌స్కీకి క్షిపణులు ఇవ్వనుపొమ్మనడం ద్వారా ట్రంప్ మరింత పరువుపోగోట్టుకున్నారు. ట్రంప్ స్టేట్స్‌మాన్ కాదు, షోమాన్ అన్న వ్యాఖ్య పూర్తినిజం. పెద్దరికంతో, గుంభనంగా వ్యవహారాలు నెరపడం ఆయనకు తెలియదు. భారత్–అమెరికా వాణిజ్యచర్చలు కొలిక్కివచ్చి, ఒప్పందాలమీద సంతకాలు అయ్యేంతవరకూ తప్పించుకు తిరుగువాడు ధన్యుడే.

సంస్కృతి... శాపమా? వరమా?

సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడటం మనకు అసాధ్యం. భూమ్మీద ఉన్నంతవరకూ గురుత్వాకర్షణను తప్పించుకోవటం ఎలా సాధ్యపడదో సంస్కృతి విషయంలోనూ మన పరిస్థితి అంతే! మనల్ని బంధించేది గురుత్వాకర్షణ శక్తి అని గుర్తించిన తర్వాతే దాన్ని అధిగమించే నియమాలను కనిపెట్టి అంతరిక్ష విన్యాసాలను చేయగలుగుతున్నాం. ఆకాశ ప్రయాణాలను సాగించగలుగుతున్నాం. అట్లాగే సంస్కృతిలో మంచిచెడులను గుర్తిస్తేనే మంచిని పెంచగలం. చెడుని తుంచగలం. ఒకనాటి పాశ్చాత్య ఆధిపత్యానికి సంస్కృతే కారణమని గట్టిగా వాదించే ఆర్థిక చరిత్రవేత్త జోల్ మోకియర్ ఈసారి నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. పాశ్చాత్య సంస్కృతి ఒక్కదానికే ఆ శక్తి ఎట్లా వచ్చింది? మిగతా వాటిల్లో అదెందుకు లేదు? మోకియర్ ప్రతిపాదనల లోతుల్లోకి వెళితేనే నిజం కొంత తెలుస్తుంది.



ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని ప్రతిపాదించటం విజ్ఞానశాస్త్ర గతినే మార్చేసింది. ఇది అందరికీ తెలిసిందే. న్యూటన్ ముందూ తర్వాతా ఎందరో మహామహులు తమ ప్రయోగాలు, పరిశీలనలు ఆధారంగా విశ్వం స్వరూప, స్వభావాలను వర్ణించి మన ఆలోచనల్లో సమూల మార్పులు తెచ్చారు. అనుభవ జ్ఞానం ఆధారంగానే మన అభిప్రాయాలను ఏర్పరుచుకోవాలనీ నిర్దేశించారు. పెద్దలు చెప్పారనో, పవిత్ర గ్రంథాలు పేర్కొన్నాయనో భావిస్తూ పరిశీలనాశక్తిని కొండెక్కిస్తే మన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని మన అవసరాలకు అనుగుణంగా సమర్థంగా ఉపయోగించుకోలేమనీ తేల్చిచెప్పారు. మనుషులు పారిశ్రామిక విప్లవంలోకి అడుగు పెట్టటానికి ప్రయోగ–పరిశీలన ఆధార ఆలోచనలే ప్రధాన కారణమయ్యాయి.

మరి ఈ ఆలోచనలు యూరపులోనే పరిపక్వతను పొంది, అక్కడే పారిశ్రామిక విప్లవానికి ఎందుకు దారితీశాయి? వేల సంవత్సరాల నాగరికతలకు నిలయాలైన ఆసియా, ఆఫ్రికా ఖండాలు ఆ పరిణామానికి తొలుత ఎందుకు దూరంగా ఉండిపోయాయి? కారణం ఎక్కడ ఉంది? ఆ లోపానికి బాధ్యులెవరు? ఆసియా, ఆఫ్రికాలకు కాలం కలిసి రాలేదా? ప్రకృతిలోని అసమానతలే అందుకు దోహదం చేశాయా? సంప్రదాయాలూ, సంస్కృతులూ కొత్త ఆలోచనలకు ప్రతిబంధకాలయ్యాయా? ఇవన్నీ కీలక ప్రశ్నలు. అన్నీ పారిశ్రామిక విప్లవం చుట్టూ తిరిగేవే. పారిశ్రామిక విప్లవం కొన్ని దేశాలకు ఆధిపత్యాన్ని కట్టబెడితే, కొన్ని దేశాలకు పరాధీనతను ప్రసాదించింది. ధనిక–పేద దేశాలను సృష్టించింది. వలసరాజ్యాలు, సామ్రాజ్యాల ఏర్పాటుకు దారితీసింది. ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హొవియిట్‌లు పరిశోధించారు.

> “ ప్రయోగాలు, పరిశీలనలు, అనుభవాలు, హేతుబద్ధ వివేచన అనేవి జ్ఞానసముపార్జనకు సోపానాలుగా మారి విశ్వజనీనతను సంతరించుకున్నప్పుడు వాటిని గుడ్డిగా తిరస్కరించటం తిరోగమనమే అవుతుంది. దేశంలో ఇప్పుడు ఆ ఛాయలు కనపడుతున్నాయి. సకలశాస్త్రాలకూ, ప్రజాస్వామ్య పద్ధతులకూ, పర్యావరణ పరిరక్షణ విధానాలకూ భారతదేశాన్నే పురిటిగడ్డగా భావించే సంకుచితత్వం పెరుగుతోంది. దేశంపైనా, వ్యక్తులపైనా, సమూహాలపైనా గుడ్డి ప్రేమ, గుడ్డి ద్వేషం సంకుచితత్వాన్నే నేర్పుతుంది. పాత సాంకేతిక పరిజ్ఞానాలను కొత్తవాటితో తోసిపుచ్చటమే సృజనాత్మక విధ్వంసంగా ఆర్థికశాస్త్రంలో పేర్కొంటారు. కొత్త సృజనతో పాత సృజన కనుమరుగు అవుతుంది. సంస్కృతికైనా ఈ సూత్రం వర్తిస్తుంది.

మనం సంస్కృతి అనే పదాన్ని తరచూ చాలా పరిమిత అర్థంలో వాడతాం. సామాజికశాస్త్రాల్లో దానికి చాలా విస్తృతార్థం ఉంది. సంప్రదాయాలు, పూజలు, ఆరాధనా పద్ధతులు, కుటుంబ సంబంధాలు, మంచీ చెడులు, ధర్మాధర్మాలు, నైతిక ప్రవర్తనలు, బాధ్యతలు లాంటివన్నీ సంస్కృతిలో భాగమే. కానీ వీటన్నిటికంటే మించింది వివేచనాశక్తి. హేతుబద్ధంగా ఆలోచించగలిగే తత్వం. కాలక్రమంలో సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు ముందుకాళ్లకు బంధనాలుగా మారతాయి. వాటిని తొలగించుకునే శక్తి కూడా సంస్కృతిలో భాగంగానే మనుషులకు లభించాలి. అలా లభించాలంటే వివేచనా శక్తి, హేతుబద్ధ ఆలోచనలకు సంస్కృతిలో ప్రాధాన్యత ఏర్పడాలి. ముఖ్యంగా సమాజంలో పై మెట్టులో ఉన్న వర్గాలు సంస్కృతిలో ఆ మేరకు సంస్కరణలకు మార్గాలు తెరవాలి. అట్లా యూరపులో కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరవబట్టే పారిశ్రామిక విప్లవం సాధ్యమైందని జోల్‌మోకియర్ ప్రతిపాదించారు.

వలసదేశాలను దోచుకోవటం, ఆఫ్రికా వాసులను బానిసలుగా అమెరికా ఖండానికి తీసుకువెళ్లటం, అక్కడి నుంచి బంగారం, వెండి లోహాలను కొల్లగొట్టటం, బలప్రయోగంతో ఆసియా–ఆఫ్రికా వ్యాపారస్థులను లొంగదీసుకోవటం, అతితక్కువ ధరలకు ముడిసరుకులను తరలించుకుపోవటం, రైతుల చేతుల్లో నుంచి భూములను తొలగించి వారిని కార్మికులుగా మారేలా చేయటం, బ్రిటన్‌కు భూమిపైపొరల్లో బొగ్గు తేలికగా లభించటం లాంటివన్నీ కలగలిసి పారిశ్రామిక విప్లవానికీ, ఆ తర్వాత యూరోపు ఆధిపత్యానికీ దోహదం చేశాయనీ చెప్పే వాదనలను తోసిపుచ్చుతూ జోల్‌మోకియర్ చేసిన ప్రతిపాదనలు ఆర్థిక చరిత్రకారుల్లో ఇప్పటికీ చర్చలను రగుల్చుతూనే ఉన్నాయి. ప్రయోగాలకూ, పరిశీలనలకూ ప్రాధాన్యమిచ్చే సంస్కృతి యూరపులో కొలంబస్ సాహసిక నౌకాయానాల కాలం నుంచి మొదలై ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే నాటికి గట్టిగా స్థిరపడిందనీ, 18వ శతాబ్దంలో అధికంగా బలపడి పారిశ్రామిక విప్లవానికి కావాల్సిన మేధో భూమికను తయారుచేసిందన్నదే మోకియర్ ప్రతిపాదనల్లో ప్రధానమైంది. ఆ సంస్కృతి వల్లే అనేక రంగాల్లో విజ్ఞానం పోగుపడి, యంత్రాల తయారీకి దారితీశాయని చెప్పారు. దేశాల తలరాతలను సంస్కృతే మార్చిందనీ, దేశాల మధ్య ఆర్థిక అంతరాల అన్వేషణకు సంస్కృతిలోకే తొంగిచూడాలని చెబుతూ మోకియర్ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. మోకియర్ దృష్టి నుంచి చూస్తే సొంత సంస్కృతి సర్వశ్రేష్ఠమని గుడ్డిగా భావించే ఏ సమాజమూ ముందుకు వెళ్లలేదు.



■ రాహుల్ కుమార్

మోకియర్ ప్రతిపాదనలతో నూటికినూరుపాళ్లు ఏకీభవించటం కష్టమైనా చాలా దేశాల్లో జాతీయ సంస్కృతి పేరుతో భిన్నాభిప్రాయాలను కాలరాస్తున్న నేపథ్యంలో, సంస్కృతిలోని లోపాలను ఎత్తిచూపే వారిని దేశ వ్యతిరేకులుగా ముద్రవేస్తున్న కాలంలో సంస్కృతిలోని మంచిచెడులను చర్చించుకోటానికి మళ్లీ అవి ఒక సందర్భాన్ని ఇచ్చాయి. పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన ఆలోచనాపరులందరూ తమతమ ప్రతిపాదనలతో సంప్రదాయ సంస్కృతీ పునాదులను కదిలించారు. అలా కదిలించకపోతే ప్రగతి సాధ్యమయ్యేదే కాదు. మోకియర్ వాదన సారాంశాన్ని 10 అంశాలుగా చూడొచ్చు. 1) జ్ఞానసముపార్జనకు, కొత్త ఆవిష్కరణలకు, ప్రగతి భావనకు సమాజంలో గౌరవం పెరగటం మొదటిదిగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు మతపరమైన విషయాలకే తప్ప ఇతరత్రా వాటికి గౌరవస్థానం ఉండేది కాదు. 2) 1500–1800 మధ్యకాలంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆలోచనాపరులు సరిహద్దులను చెరిపివేసి అన్నిటినీ ఇచ్చిపుచ్చుకున్నారు. దీన్నే సరిహద్దులను దాటిన మేధగా పిలిచేవారు. ప్రకృతిని అర్థం చేసుకోవటం ద్వారా జీవితం మెరుగుపడుతుందనే భావనను బలంగా వ్యాప్తి చేశారు. 3) రాజకీయ, న్యాయ, నైతిక అంశాలపై కొత్త ఆలోచనలు రేకెత్తిస్తూనే ఉపయోగకర జ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అంటే జ్ఞానం మనిషికి ప్రత్యక్షంగా ఉపయోగపడాలి. అతని జీవన పరిస్థితిని మెరుగుపర్చటమే దాని పరమార్థం కావాలి. 4) జ్ఞానం అనేది నిరంతరం విస్తరించేదిగానూ ప్రగతికి దోహదం చేసేదిగానూ పేర్కొంటూ భవిష్యత్తు మరింత అభివృద్ధి దాయకమన్న ఆశను పెంపొందించారు. 5) రాయల్ సొసైటీ లాంటి విజ్ఞానసంఘాలు విరివిగా ఏర్పడ్డాయి. పుస్తకాలు, విజ్ఞానసర్వస్వాలు ప్రచురితమయ్యాయి. కొత్త పరికరాల సృష్టి, ఆవిష్కరణలతో ఉత్పత్తి పెరిగింది. 6) యూరపులోని చిన్నచిన్న రాజ్యాల మధ్య పోటీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పెంచింది. రాజకీయ, సైనిక అవసరాలు కూడా ఆవిష్కరణల్లో పోటీకి కారణమయ్యాయి. 7) ప్రశ్నించే స్వేచ్ఛకూ, భిన్నాభిప్రాయాలను సహించే ధోరణికీ ప్రోత్సాహం పెరిగింది. ఈ రెండు లేకపోతే శాస్త్రీయపురోగతే ఆగిపోయేది. ప్రశ్నించటం వల్ల తప్పులను వెంటనే సవరించుకునే వీలుకలిగింది. మరోవైపు సంప్రదాయాలనూ, చర్చి ఆధిపత్యాన్నీ ప్రశ్నించటం మొదలైంది. 8) మత చింతనాపరుల కంటే నూతన భావాల, పరికరాల ఆవిష్కర్తల ప్రతిష్ఠ పెరిగింది. 9) జ్ఞానం, సాంకేతికత, ఉత్పత్తి పరస్పరం ప్రభావితమై సంపద పెరగటానికి కారణమైంది. పెరిగిన సంపదతో విద్యారంగంలోకి వచ్చేవారి సంఖ్య ఎక్కువైంది. పెరిగిన విద్యాధికులతో జ్ఞానం మరింత విస్తృతమైంది. జ్ఞానం ఒక స్థాయికి చేరుకుని ఆగిపోకుండా నిరంతరం విస్తృతమయ్యే ప్రవాహంలా మారింది. 10) పారిశ్రామిక విప్లవానికి ఆర్థిక అంశాలు తీవ్రంగా ప్రభావితం చేసినా దానికి దోహదం చేసింది మాత్రం సాంస్కృతిక రంగంలో వచ్చిన విప్లవమే.

మోకియర్ కంటే ముందు కూడా సంస్కృతీ ప్రాధాన్యం గురించి చెప్పిన వారూ ఉన్నారు. ఆధునిక సామాజిక శాస్త్రానికి మూలపురుషుడిగా భావించే మాక్స్‌వెబర్ 1905లోనే ప్రొటెస్టంట్ నైతికత (ప్రొటెస్టంట్ ఎథిక్) పేరుతో దాన్ని వివరించారు. కఠినశ్రమ, క్రమశిక్షణ, పొదుపు, నిజాయితీ, ఆత్మనియంత్రణ, సమయపాలన, క్రమబద్ధజీవితం అనేవి ఆ నైతికతలో భాగమనీ ఇవన్నీ ఆధునిక క్యాపిటలిస్టు ఆర్థికవ్యవస్థకు ప్రాణాధారాలనీ వెబర్ సూత్రీకరించారు. ఇవేమీ ఇస్లాం, హిందూమతాల్లో అంత ప్రముఖంగా లేవనీ కూడా వెబర్ విమర్శించారు.

> పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హొవియిట్‌లు పరిశోధించారు.

పాశ్చాత్య ఆధిపత్యానికి ఇట్లా సొంత సంస్కృతిలో వచ్చిన మార్పులే ప్రధాన కారణమని చెప్పే వివరణతో విభేదించే ప్రభావవంతమైన విశ్లేషణలు ఇప్పటికే ఎన్నో వచ్చాయి. కానీ ఎన్ని ఇతర కారణాలను చెప్పుకొన్నా భావ, వైజ్ఞానిక రంగంలో పాశ్చాత్య దేశాల్లో వచ్చిన మార్పుల ప్రభావాన్ని కాదనలేం. 16, 17, 18, 19 శతాబ్దాల్లో పాశ్చాత్య గడ్డమీద నుంచి వచ్చిన సిద్ధాంతాలూ, విశ్లేషణల్లో కొన్నైనా ఆధిపత్యాల్ని, అసమానతలను, వలస దోపిడీలనూ, సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నించేలా చేశాయి. అందుకే ఒక సంస్కృతి నుంచి జనించిన భావాలు ఇతర సమాజాలకు పూర్తిగా పనికి రావనీ చెప్పలేం. అట్లా భావిస్తే ప్రజాస్వామ్యంతో మొదలుపెట్టి ఎన్నో ఆధునిక ఆలోచనలను వదులుకోవాల్సి వస్తుంది. ప్రయోగాలు, పరిశీలనలు, అనుభవాలు, హేతుబద్ధ వివేచన అనేవి జ్ఞానసముపార్జనకు సోపానాలుగా మారి విశ్వజనీనతను సంతరించుకున్నప్పుడు వాటిని గుడ్డిగా తిరస్కరించటం తిరోగమనమే అవుతుంది. దేశంలో ఇప్పుడు ఆ ఛాయలు కనపడుతున్నాయి. సకలశాస్త్రాలకూ, ప్రజాస్వామ్య పద్ధతులకూ, పర్యావరణ పరిరక్షణ విధానాలకూ భారతదేశాన్నే పురిటిగడ్డగా భావించే సంకుచితత్వం పెరుగుతోంది. దేశంపైనా, వ్యక్తులపైనా, సమూహాలపైనా గుడ్డి ప్రేమ, గుడ్డి ద్వేషం సంకుచితత్వాన్నే నేర్పుతుంది. పాత సాంకేతిక పరిజ్ఞానాలను కొత్తవాటితో తోసిపుచ్చటమే సృజనాత్మక విధ్వంసంగా ఆర్థికశాస్త్రంలో పేర్కొంటారు. కొత్త సృజనతో పాత సృజన కనుమరుగు అవుతుంది. సంస్కృతికైనా ఈ సూత్రం వర్తిస్తుంది. కొత్త సృజనకు దారి ఇవ్వాలంటే సంస్కృతి కూడా సంస్కరణకు గురికాక తప్పదు. సంస్కృతిపై అతి మమకారాన్ని వదులుకోకా తప్పదు.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఏమిటి?

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో ఏకైక నిశ్చయత అనిశ్చితి మాత్రమే! వాతావరణ మార్పును ఎదుర్కోవాల్సిన పద్ధతులపై ఎడతెగని మథనం జరుగుతోంది. అంతిమంగా ఏ భావాలు, పద్ధతులు విజయం పొందుతాయన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయి విషయమై ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించిన విషయాన్ని పరిశీలనలోకి తీసుకోండి. అది, 2023లో 420.4 పీపీఎమ్ నుంచి 2024లో 423.9 పీపీఎమ్‌కు పెరిగింది. ఈ పెరుగుదల పూర్వపు పెరుగుదలలు అన్నిటికంటే అధికంగా ఉన్నదని ఆ ప్రపంచ సంస్థ పేర్కొంది. దీని వల్ల ఉష్ణోగ్రతలు మరింతగా తీవ్రమవుతాయని, ప్రాకృతిక విపత్తుల సంభవత అధికమవుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ స్పష్టం చేసింది. అయినప్పటికీ వాతావరణ మార్పును నిరోధించేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టడంలో తీవ్ర తాత్సారం జరుగుతోంది. ఈ తిరోగమన పోకడల్లో అనేక దేశాలు పోటీపడుతున్నాయి! కాలుష్యకారక వాయు ఉద్గారాలను తగ్గించే సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించుకోవడాన్ని ముమ్మరం చేసేందుకు ప్రపంచ దేశాలు సంశయిస్తున్నాయి. మరి ఈ పరిస్థితుల్లో వాతావరణ మార్పునరికట్టే చర్యల తక్షణ ఆవశ్యకత లేక ఆర్థిక ప్రయోజనాలే పరమ లక్ష్యంగా ఉన్న క్రియాశూన్యతలో ఏది అంతిమంగా ప్రాధాన్యం పొందుతుందనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ శోచనీయ పరిస్థితుల్లో ఒక శుభ పరిణామమూ చోటుచేసుకున్నది. ఈ ఏడాది ప్రథమార్థంలో పునరుత్పాదక ఇంధన వనరులు మొదటిసారిగా బొగ్గును అధిగమించి ప్రపంచవ్యాప్తంగా విద్యుదుత్పాదనకు అతిపెద్ద వనరుగా మారాయి. 2025 మొదటి ఆరునెలల్లో పునరుత్పాదక ఇంధన వనరులు 5072 టీడబ్ల్యూహెచ్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, శిలాజ ఇంధనమైన బొగ్గు 4896 టీడబ్ల్యూహెచ్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసిందని నిపుణ ఆలోచనాశీలుర బృందం (థింక్ ట్యాంక్) 'Ember' నివేదిక 'Global Electricity MidYear Insights–2025' వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదనలో అగ్రగామిగా ఉన్న చైనాయే బొగ్గు ఆధారిత కొత్త థర్మల్ విద్యుదుత్పాదన కేంద్రాల నిర్మాణంలో చురుగ్గా ఉన్నదని 'Carbon Brief' అనే వెబ్‌సైట్ వెల్లడించింది. భారత విద్యుత్ రంగంలోనూ ఇలానే జరుగుతోందనేది మనం విస్మరించలేని వాస్తవం. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదన మరింతగా ఉధృతమవుతుందా లేక విద్యుదుత్పత్తికి ప్రధాన వనరుగా శిలాజ ఇంధనాలే ప్రధానంగా పునర్వినియోగమవుతాయా?



> విద్యుత్ వాహనాల తయారీకి కీలకమైన అరుదైన భూ ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల విధించిన ఆంక్షలతో హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్)కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్తమాన ప్రపంచ ఆర్థిక, వాణిజ్య పరిస్థితులలో విద్యుత్ వాహనాల తయారీ వేగవంతమవుతుందా లేక మందగిస్తుందా అనేది మన ముందున్న ఒక ముఖ్యమైన ప్రశ్న.

సరే, ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. రవాణా రంగంలో కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించడంలో విద్యుత్ వాహనాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. తత్కారణంగా ఈ అధునాతన వాహనాలకు విశేష ప్రోత్సాహం లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విక్రయమవుతున్న కొత్త కార్లలో 20శాతం విద్యుత్ వాహనాలే అని 'ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ' (ఐఈఏ) వెల్లడించింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తి, వినియోగంలో చైనా ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. విద్యుత్ వాహనాల సరఫరా గొలుసులో చైనాకు తిరుగులేని ప్రాబల్యం ఉన్నది. లిథియం, కోబాల్ట్ మొదలైన ముడి పదార్థాల తవ్వకం, ప్రాసెస్ చేయడం; బ్యాటరీ సెల్స్‌ను ఉత్పత్తి చేయడం, వాటిని వాహనాలలో అనుసంధానించడం; వాహనాలను అసెంబుల్ చేయడం.. మరింత స్పష్టంగా చెప్పాలంటే విద్యుత్ వాహనాల తయారీ, పంపిణీ ప్రక్రియలన్నిటా చైనాదే సంపూర్ణ ఆధిపత్యం. సరిగ్గా ఈ కారణాల వల్లే ఇతర వాహనాల తయారీలో అగ్రగాములుగా ఉన్న దేశాలు విద్యుత్ వాహనాల ఉత్పత్తిని చేపట్టేందుకు సంశయిస్తున్నాయి. విద్యుత్ వాహనాల రంగంలో అగ్రగామిగా వెలుగొందాలన్న తమ ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు తమకు అనుకూల పరిస్థితులు లేవని, చైనాతో పోటీపడలేమన్న వాస్తవాన్ని గుర్తించాయి. ఈ కారణంగానే విద్యుత్ వాహనాలకు ప్రకటించిన సబ్సిడీలను ఉపసంహరించుకుంటున్నాయి. సంప్రదాయక ఐసీ ఇంజన్లతో నడిచే వాహహనాల తయారీకి దశల వారీగా ముగింపు పలకడంపై పునరాలోచన చేస్తున్నాయి. విద్యుత్ వాహనాల తయారీకి కీలకమైన అరుదైన భూ ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల విధించిన ఆంక్షలతో హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్ – కర్బన ఉద్గారాలు అధికంగా ఉండే ఆర్థిక వ్యవస్థ నుంచి అవి తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థకు మారడం)కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్తమాన ప్రపంచ ఆర్థిక, వాణిజ్య పరిస్థితులలో విద్యుత్ వాహనాల తయారీ వేగవంతమవుతుందా లేక మందగిస్తుందా అనేది మన ముందున్న ఒక ముఖ్యమైన ప్రశ్న.

నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, అస్థిరత నెలకొన్నాయని, వాణిజ్య ఘర్షణలు, రాజకీయ అనిశ్చితి అందుకు ప్రధాన కారణాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ఇటీవల వెలువరించిన 'వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్' నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరం తరువాత ప్రప్రథమంగా 2025లో పేద దేశాలు అభివృద్ధి సహాయం కింద విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి పొందుతున్న నిధుల కంటే తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించేందుకే అధిక మొత్తాలను వెచ్చిస్తున్నాయనే చేదు సత్యాన్ని కూడా ఐఎమ్ఎఫ్ నివేదిక వెల్లడించింది. మరి ఈ గందరగోళ, అవ్యవస్థిత ప్రపంచంలో మన భవిష్యత్తు ఏమిటి? సానుకూల మార్పుల పవనాలు మరింత వేగంగా, శక్తిమంతంగా వీచేందుకు మనం ఏం చేయాలి? అన్నదే మన చివరి ప్రశ్న. బహుశా, ఇది మాత్రమే మనం వేసుకోవాల్సిన ఏకైక ప్రశ్న.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

జన సమూహాల నిర్వహణలో రైల్వే దక్షత

మన దేశం 1.4 బిలియన్ల జనాభాతో అన్నివిధాలా వృద్ధి చెందుతున్నది. అనేక జాతులు, సంస్కృతులు, భాషలు, పండుగల సమాహారమైన ఈ దేశంలో సహజంగానే ప్రజలంతా ఒకే చోట గుమికూడే సందర్భాలు ఎక్కువ. ఇలాంటి సందర్భాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద గుంపుల నిర్వహణకు మన దేశం వేదికగా మారుతున్నది. దేశంలో జనాభా పెరిగే కొద్దీ, గుంపులు కూడా అంతకంతకూ పెద్దవి అవుతున్నాయి. వాటిని నియంత్రించటం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

గుంపుల నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్) అంటే మనుషుల్ని బలవంతంగా అదుపు చేయటమో, వారికి కాపలా కాయటమో కాదు; బహిరంగ ప్రదేశాల్లో గుమికూడిన మనుషుల ప్రవర్తన పట్ల శాస్త్రీయమైన అవగాహనతో వ్యవహరించటం. భారత్ వంటి దేశంలో గుంపుల నియంత్రణ ఎంతో ముఖ్యమైన అంశం. దేశ జనాభా పెరిగే కొద్దీ, ప్రజా సమూహాల కదలికని అదుపు చేయటం, ముఖ్యంగా ఇరుకు ప్రదేశాల్లోను, ఆవేశపూరితమైన వాతావరణంలోను మనుషుల్ని నియంత్రించటం చాలా కష్టంగా మారింది. దేశంలో నగరాలు విస్తరించేకొద్దీ, వలసలు పెరిగేకొద్దీ, గుంపుల నియంత్రణలో ఇప్పుడు సైకాలజీ, టెక్నాలజీల వినియోగమూ, ముందస్తు ప్రణాళికల అవసరమూ పెరిగింది.

ఇటీవల తమిళనాడులోని కరూర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన తొక్కిసలాట– గుంపుల నియంత్రణ ఎంత అవసరమో మరోమారు తెలియజెప్పింది. ఒక నటుడి రాజకీయ ప్రచారం సందర్భంగా ఆ ప్రాంతంలో ముప్పై వేల మందికి పైగా జనాభా గుమికూడారు. భారతదేశంలో 2000–2022 సంవత్సరాల మధ్య జరిగిన ప్రమాద మరణాలూ, ఆత్మహత్యలపై ఎన్‌సీఆర్‌బీ ప్రకటించిన నివేదిక ప్రకారం తొక్కిసలాటల్లో 3,074 మంది ప్రాణాలు పోయాయి. గత మూడు దశాబ్దాలుగా నాలుగువేలకు పైగా తొక్కిసలాట ఘటనలు జరిగాయి. వీటిలో 2001–2014 మధ్య జరిగిన 79 శాతం తొక్కిసలాట ఘటనలు ప్రార్థనా స్థలాల్లోనే జరిగాయి.

అది కుంభమేళా అయినా, రాజకీయ ప్రచార సభ అయినా– గుంపుల్లో మానవ స్వభావాన్ని అంచనా వేసి నియంత్రించగలగటం వల్ల చాలా ప్రమాదాలను నివారించగలం. ఒక సామూహిక కలయిక సక్రమంగా జరగటానికి బారికేడ్లు ఉంటే సరిపోవు. ఒకరి పరిస్థితిని మరొకరు అర్థం చేసుకోవటం, పరస్పర గౌరవాన్ని ఇవ్వటం, పౌర బాధ్యతను పాటించటం ముఖ్యం. ఎంతమంది హాజరవుతారన్న లెక్కలూ, అందుకు తగ్గ ఏర్పాట్లతోపాటు, మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవటం కూడా గుంపులను నిర్వహించటంలో కీలకమైన అంశం. లక్షలాది మంది ఒకేచోట చేరినప్పుడు వారంతా సంయమనంతో కదిలారా, గందరగోళంతో చెల్లాచెదురయ్యారా అన్నది ముందస్తు ప్రణాళికని బట్టి ఉంటుంది. గుంపుల నిర్వహణలో చిన్న చిన్న లోపాలే తొక్కిసలాటలకు దారితీస్తాయి.

కుంభమేళా సందర్భంలో భారతీయ రైల్వే దానికి సిద్ధమైన తీరు నుంచి ఎన్నో మంచి పాఠాలను నేర్చుకోవచ్చు. ప్రయాగ్‌రాజ్‌లో 2025లో జరిగిన కుంభమేళాను భూమి మీదే అతిపెద్ద మానవ సమీకరణగా చెప్పవచ్చు. దీన్ని నిర్వహించిన తీరు గుంపుల నిర్వహణకు ఒక ఆదర్శంగా నిలుస్తుంది. పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ భారీ వేడుకలో భాగంగా త్రివేణీ సంగమ స్థలిలో పుణ్యస్నానం చేసేందుకు కోట్లాదిమంది ఒకచోటకు చేరతారు. ఈ ఏడాది 67 కోట్ల మంది ఈ ఉత్సవంలో పాల్గొన్నారని అంచనా. ఎక్కువ మంది హాజరైన రోజుగా చెప్తున్న జనవరి 29న ఏకంగా ఏడు కోట్ల అరవై లక్షల మంది పాల్గొన్నారు. ఇంతటి భారీ ఉత్సవం కోసం భారతీయ రైల్వే నెలల ముందు నుంచీ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా– టెంపరరీ స్టేషన్లు, శాటిలైట్ స్టేషన్లు తెరిచారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా జన సాంద్రతను అంచనా వేస్తూ, డ్రోన్ సర్వేలెన్స్‌ను నిరంతరం వాడారు. రైల్వేలకు, పోలీసులకు, ఇతర పౌర సంబంధ అధికారులకు మధ్య సమన్వయాన్ని సాధించారు. ప్రజలతో వ్యవహరించే సిబ్బందికి స్పష్టంగా సామరస్యంగా ఎలా నడుచుకోవాలో శిక్షణ ఇప్పించారు. కచ్చితమైన గణాంకాలకు తోడుగా, టెక్నాలజీని, ఏఐను విస్తృతంగా వాడారు. రైల్వే పరిసరాలను ఎప్పటికప్పుడు రీడిజైన్ చేస్తూ మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ రైల్వే రికార్డు స్థాయిలో 17,152 రైళ్లను నడిపింది.

> ప్రయాగ్‌రాజ్‌లో 2025లో జరిగిన కుంభమేళాను అతిపెద్ద మానవ సమీకరణగా చెప్పవచ్చు. ఇంతటి భారీ ఉత్సవం కోసం భారతీయ రైల్వే నెలల ముందు నుంచీ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉంది. ఇక్కడ గుంపుల నిర్వహణ కోసం రైల్వే చేపట్టిన చర్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా అలాంటి సందర్భాలకు ఆదర్శంగా మారాయి.



ప్రయాగ్‌రాజ్‌తో పాటు ఆ దరిదాపుల్లో ఉన్న రైల్వే స్టేషన్లు అన్నింటికీ పెద్ద స్థాయిలో మార్పులు చేపట్టారు. 48 కొత్త ప్లాట్‌ఫామ్‌లూ, 21 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలూ, 21 రోడ్‌ఓవర్ బ్రిడ్జిలూ, రోడ్ అండర్ బ్రిడ్జిలూ నిర్మించారు. ప్రయాగ్‌రాజ్, పపామావ్, రాంబాగ్, ఝూసీ ప్రాంతాల్లో రైల్వే యార్డ్ రీమోడలింగ్ పనులను చేపట్టారు. గుంపుల ఉధృతి తీవ్రస్థాయికి చేరిన సమయాల్లో వాళ్లకి చోటు కల్పించేలా శాశ్వత నిర్మాణాలను చేపట్టారు. ప్రయాణికుల రాకడను నిత్యం కనిపెడుతూ ఉండటానికి వెయ్యికి పైగా సీసీ టీవీ సర్వేలెన్స్ కెమెరాలను వాడారు. అలాగే ప్రకటనలను వేర్వేరు భాషల్లో వినిపించటం వల్ల చాలావరకు గందరగోళాన్ని తగ్గించగలిగారు.

కుంభమేళా సందర్భంగా గుంపులను నియంత్రించేందుకు, నిర్వహించేందుకు భారతీయ రైల్వే తీసుకున్న చర్యలు ఇప్పుడు ఇలాంటి మరికొన్ని సందర్భాల కోసం ఉపయోగపడుతున్నాయి. 2027లో నాసిక్‌లో జరగనున్న సింహస్థ కుంభమేళా, అదే ఏడాది రాజమండ్రిలో జరగనున్న పుష్కరాలు, 2028లో ఉజ్జయినిలో జరగనున్న కుంభమేళాల కోసం ఆయా స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచటం కోసం భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో గుంపుల నిర్వహణ కోసం భారతీయ రైల్వే చేపట్టిన చర్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా అలాంటి సందర్భాలకు ఆదర్శంగా మారాయి.

పరిసర వ్యవస్థల అభివృద్ధితోపాటు, సిమ్యులేషన్, స్పష్టమైన సైన్‌లు, గుంపుల కదలికను అంచనా వేయటం.. ఇవన్నీ సమర్థమైన గుంపుల నిర్వహణకు ఎంతో కీలకం. మన దేశంలో ప్రజా సమూహాలు పరిమాణంలో పెరుగుతూనే ఉంటాయి. ప్రజలు గుంపులుగా ఒకచోట గుమికూడటం ఆగదు. కానీ తెలివిగా వ్యవహరిస్తే– ఆ గుంపులు సామూహిక అయోమయంగా గాక, సామూహిక ఐక్యతకు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ విషయంలో కుంభమేళా నేర్పిన పాఠం: "సమూహాన్ని నడపాలంటే ముందు దాని స్వభావాన్ని అర్థం చేసుకోవాలి".



■ ఇతీ పాండే
ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్
సౌత్ సెంట్రల్ రైల్వే



గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 కనిష్ఠం 23.4



ఐటీ.. ఇదేంటీ

- హైటెక్స్‌లో మురుగు పరుగు
- ఐటీ కారిడార్‌లో పొంగుతున్న డ్రైనేజీలు
- సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వాహనదారుల ఇబ్బంది

8

వచ్చే నెల 21, 22 తేదీల్లో జేఎన్‌టీయూ కాలేజీ వజ్రోత్సవాలు

8

నోటరీయా.. నో కనెక్షన్!


పలు సెక్షన్లలో కొత్త మీటర్ల జారీ నిలుపుదల

ఆఫీసుల చుట్టూ వినియోగదారుల ప్రదక్షిణలు

ఓసీ లేని భవనాలకు అభ్యంతరం

ఓవర్‌లోడ్‌తో కాలిపోతున్న పాత మీటర్లు

ఆమ్యామ్యాలు ఇస్తే మీటర్లు : వినియోగదారుల ఆరోపణ



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'మీ ఇల్లు నోటరీ డాక్యుమెంట్‌తో నిర్మించి ఉందా.. అయితే కొత్త విద్యుత్ మీటర్‌ను జారీ చేయలేం..' అంటూ విద్యుత్ సిబ్బంది చేతులెత్తేస్తుండడంతో పలువురు వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఆమ్యామ్యాలకు ఆశపడి లేని నిబంధనలను ముందుకు తెచ్చి మీటర్లను ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇది ఒక్క ప్రాంతంలోనే కాదు.. నగరంలోని పలు సెక్షన్లలో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రేటర్‌పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో 10 సర్కిళ్లు ఉండగా 200కు పైగా సెక్షన్లు ఉన్నాయి. కొంతకాలంగా పలు సెక్షన్లలో నోటరీ డాక్యుమెంట్లతో కొత్త విద్యుత్‌మీటర్లకు దరఖాస్తు చేసుకున్న వారికి వాటిని జారీచేయడం లేదు. బోయిన్‌పల్లి డివిజన్ ఆర్‌ఆర్‌నగర్ సెక్షన్‌లో నోటరీ డాక్యుమెంట్లతో విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకున్నా జారీచేయడం లేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30, 40 ఏళ్ల క్రితం నోటరీతో కొనుగోలు చేసిన నివాసాలకు కొత్తమీటర్లు ఎందుకు జారీ చేయడం లేదని అధికారులను ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని చెబుతున్నారని ఓ వినియోగదారుడు తెలిపారు. కొన్నిసెక్షన్లలో క్షేత్రస్థాయిలో సిబ్బంది సిండికేట్‌గా మారి వాళ్లు అడిగినంత డబ్బులు చెల్లిస్తే మీటర్లు ఇస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారికి నోటరీ డాక్యుమెంట్ల పేరుతో కొర్రీలు పెడుతున్నారంటూ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు నోటరీ డాక్యుమెంట్లతో మీటర్లు జారీచేసిన దక్షిణ డిస్కం ప్రస్తుతం సెక్యూరిటీ డిపాజిట్‌ను మూడు రేట్లు చెల్లించినా జారీ చేయడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విద్యుత్ మీటర్ల కోసం కొందరు నిత్యం

మిగతా 6వ పేజీలో..

నిబంధనలు ఇలా..

వివాద స్థలాలు, కోర్టు కేసుల పరిధిలో ఉన్న స్థలాల్లో మీటర్లు ఇవ్వరాదు. నోటరీ డాక్యుమెంట్లకు విద్యుత్‌మీటర్ల జారీకి సెక్యూరిటీ డిపాజిట్ మూడు రేట్లు వసూలు చేయాలి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో కొత్త విద్యుత్ మీటర్ కనెక్షన్ తీసుకునేందుకు 1కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జి కింద రూ.1,400, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 వసూలు చేయాలి. అయితే, నోటరీ డాక్యుమెంట్‌తో జారీచేసే మీటర్లకు సెక్యూరిటీ డిపాజిట్‌ను మూడు రెట్లు అంటే రూ.600 దక్షిణ డిస్కం చెల్లించాలి.

ఓల్డ్‌సిటీ మెట్రోపై నజర్

అనుమతి కోసం సర్కార్ తీవ్ర ప్రయత్నాలు

ఇప్పటికే కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తులు

సానుకూల ధోరణిలో కేంద్రం..

త్వరలో గ్రీన్‌సిగ్నల్!



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌సిటీ మెట్రో కారిడార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతిని త్వరగా తీసుకొచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రధానంగా ఈ కారిడార్‌ను మొదటి దశలోనే ప్రతిపాదించారని, ఆమోదానికి ఆలస్యం చేయొద్దని కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ తరుణంలో మరికొద్ది రోజుల్లో పాతబస్తీ పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులు భావిస్తున్నారు. మెట్రో రెండోదశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గాన్ని

మిగతా 6వ పేజీలో..

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులు

వేగంగా చేపట్టాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వికాస్‌రాజ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని గోషామహల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్‌అలీ, కలెక్టర్ హరిచందన, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ నరేంద్రకుమార్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. అనంతరం ఆస్పత్రి భవనాల వివరాలు, పార్కింగ్, విద్యుత్, అప్రోచ్ రోడ్లు, నీటి సదుపాయాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీసీపీ రక్షితమూర్తి, మెగా సీజీఎం శ్రీనివాస్, విద్యుత్, జీహెచ్‌ఎంసీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిసెంబరు నాటికి మరిన్ని ఈవీలు

ఇప్పటికే రోడ్లపై 265 ఎలక్ట్రిక్ బస్సులు

మరో 275 తీసుకువచ్చే దిశగా చర్యలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో డిసెంబరు నాటికి కొత్తగా వందకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపైకి తీసుకువచ్చే దిశగా టీజీఎస్‌ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే నగరంలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్న ఆర్టీసీ క్రమంగా వాటి సంఖ్య పెంచుకునే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది. మరో ఆరు నెలల్లో 275 ఈవీ బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే గ్రేటర్‌జోన్ పరిధిలోని 25 బస్సు డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలను సిద్ధం చేశారు. కంటోన్మెంట్, హెచ్‌సీయూ, మియాపూర్-2 డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండగా.. డిసెంబరు నాటికి మరో 10 డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ భావిస్తోంది. ప్రధాన రహదారులకు సమీపంలో ఉన్న డిపోల్లో మొదట ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే ఆయా డిపోల్లో జిల్లా సర్వీసులు సైతం చార్జింగ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.





ముసారాంబాగ్ పాత బ్రిడ్జిని కూల్చివేస్తున్న సిబ్బంది

ముసారాంబాగ్ బ్రిడ్జి కూల్చివేత

మూసీ ఉధృతికి పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణం

దాని స్థానంలో కొత్త వంతెన

ఇప్పటికే ఒకవైపు 60 శాతం పనులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోటెత్తిన మూసీ నది వరదకు ముసారాంబాగ్ బ్రిడ్జి దెబ్బతిని వినియోగానికి అనువుగా లేదని జీహెచ్‌ఎంసీ నిర్ధారించింది. ఇప్పటికే వంతెనపై రాకపోకలు నిలిపివేసిన అధికారులు కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవలి మూసీ వరదలకు బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నది. సర్ఫేస్‌పై కాంక్రీట్ శ్లాబ్ కొట్టుకుపోగా, ఫౌండేషన్లు దెబ్బతిన్నాయని నిర్మాణ స్థిరత్వ పరీక్షలో గుర్తించారు. రాకపోకలకు బ్రిడ్జి ఏ మాత్రం అనువుగా లేదని, కూల్చివేయాల్సిందేనని ఏజెన్సీ నివేదిక సమర్పించినట్టు ఓ అధికారి తెలిపారు. దీంతో కూల్చివేత పనులు సాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో వేర్వేరుగా రెండు హై లెవల్ బ్రిడ్జిలను ప్రతిపాదించగా.. ఇప్పటికే ఒకవైపు వంతెన పనులు దాదాపు 60 శాతం పూర్తయ్యాయని, త్వరలో రెండోవైపు హై లెవల్ వంతెన నిర్మాణం మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు.

శివారు మున్సిపాలిటీలకు

మహర్దశ

అభివృద్ధి పనులకు హెచ్‌ఎండీఏ శ్రీకారం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శివారు మున్సిపాలిటీలకు మహర్దశ రానుంది. సరైన నిధులు లేక, పన్నుల ద్వారా ఆదాయం రాక ప్రజలకు మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులకు హెచ్‌ఎండీఏ శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీలలో ప్రాధాన్యత క్రమంలో పనులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. ప్రధానంగా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో రూ.7.80కోట్లను వ్యయం చేసి రోడ్లు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించిన 32 పనులను చేపట్టనున్నారు. అదేవిధంగా తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని పలుప్రాంతాల్లో 14 పనులను రూ.7.01కోట్లతో చేపట్టనున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.5.86కోట్లతో రోడ్లు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించిన 11 పనులు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే.. హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్టు విభాగం ఆధ్వర్యంలో కూడా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని కన్నెగంటి కాలనీలో పార్కు అభివృద్ధికి, మేడ్చల్ మున్సిపాలిటీలోని కేఎల్‌ఆర్ ఫేజ్-2 పార్కును అభివృద్ధి చేయడం, తూంకుంట మున్సిపాలిటీలోని రాజీవ్ రహదారి పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. దుండిగల్ మున్సిపాలిటీలో బహదూర్‌పల్లి పార్కు, శ్రీకృష్ణ ప్రాపర్టీ పార్కు, తుక్కుగూడ మున్సిపాలిటీలో చల్లా గార్డెన్ పార్కు, మణికొండ మున్సిపాలిటీలో ల్యాంకో పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



ఓటర్ స్లిప్‌లపై భారీ అక్షరాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఓటింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఓటర్ స్లిప్పుల్లో ఓటర్ల సీరియల్ నంబర్, పార్ట్ నంబర్‌ను పెద్ద అక్షరాలతో, స్పష్టంగా చదివేందుకు వీలుగా ముద్రించనున్నారు. ఈ కొత్త కార్యక్రమం ద్వారా పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం తగ్గి, ఓటరు తాము ఉన్న ఓటర్ల జాబితాలోని వివరాలను త్వరగా గుర్తిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

సీఎం పీఠం.. ఇక్కడో సెంటిమెంట్

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లలో నేతల నివాసాలు

ఎన్టీఆర్ నుంచి నేటి రేవంత్ వరకు ఇక్కడే..

ఇతర నేతలూ ఇక్కడ నివాసానికే మొగ్గు



నార్సింగ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్, బంజారాహిల్స్.. రాజకీయ వ్యూహాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన వారిలో అత్యధికులు ఈ ప్రాంతాల్లోనే ఉన్నారు. దాంతో ఇక్కడ ఉంటేనే సీఎం పదవి దక్కుతుందనే నమ్మకం కొంతమంది నేతల్లో బలంగా ఏర్పడింది. సీఎం పీఠం అధిరోహించాలనుకునే వివిధ పార్టీల ప్రధాన నేతలు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలకి షిఫ్ట్ కావాలని భావిస్తున్నారు. నగర శివారులో రాజసం లాంటి ఇంద్ర భవనాలను నిర్మించుకున్న కొంతమంది నేతలు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మహానగరంలో అత్యంత

మిగతా 6వ పేజీలో..

నాడు కేసీఆర్.. నేడు రేవంత్

బీఆర్‌ఎస్ రథసారథి కేసీఆర్ కూడా 2014 వరకు బంజారాహిల్స్ బసవతారకం ఆస్పత్రి పక్కన నందిహిల్స్‌లోనే ఉండేవారు. నాటి ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి దగ్గరలోనే మల్కాజిగిరి పార్లమెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జూబ్లీహిల్స్ సెంటిమెంట్ కలిసి వచ్చినట్లుగా రేవంత్ వర్గీయులు చెప్పుకుంటున్నారు.



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదుల వివరాలు తెలుసుకుంటున్న రంజిత్‌కుమార్

ఫిర్యాదులపై స్పందించాలి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనులపై వెంటనే స్పందించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఎంసీఎంసీ, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ రూమ్, ఎంసీసీ కంట్రోల్ రూమ్, 1950 ఫిర్యాదుల కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఫిర్యాదులు, ఉల్లంఘనలపై వెంటనే స్పందిస్తూ క్షేత్రస్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్ బృందాలకు సమాచారమందిస్తూ సత్వర చర్యలు తీసుకుంటున్నట్టు కర్ణన్ వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.2.75కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని, ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులపై పదికిపైగా కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఈవీఎంలకు ఫస్ట్ లెవెల్ చెకింగ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)కు గురువారం చాదర్‌ఘాట్‌లోని విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ఫస్ట్ లెవెల్ చెకింగ్ చేపట్టారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఔటర్ అండర్‌పాస్‌లో నిఘా

రూ.7.54కోట్లతో త్వరలోనే సీసీ కెమెరాల ఏర్పాటు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు అండర్‌పాస్‌ల్లో నిఘాను ప్రభుత్వం మరింత పటిష్ఠం చేయనుంది. ఇప్పటికే విద్యుద్దీపాలు ఏర్పాటు చేసిన హెచ్‌ఎండీఏ.. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. తొలుత సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 66 అండర్‌పాస్‌ల్లో రూ.7.54కోట్ల వ్యయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు టెండర్లను కూడా ఆహ్వానించారు. ఆ తర్వాత ఔటర్ అండర్‌పాస్‌ల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. మరో విడుతలో ఔటర్ ఇంటర్ చేంజ్‌ల్లో, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఔటర్ అండర్‌పాస్‌ల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ అండర్‌పాస్‌లు నేరాలకు అడ్డాగా మారుతున్నాయి. దేశంలోనే సంచలనం సృష్టించిన 'దిశ' ఘటన ఔటర్ అండర్‌పాస్‌లోనే కావడం గమనార్హం. నిఘా లేకపోవడంతో నేరాలు, ఘోరాలు అండర్ పాస్‌లలో నిత్యకృత్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఔటర్ అండర్‌పాస్‌ల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేసినా, ఓవైపు పోలీసులు, మరో వైపు ఔటర్‌కు సంబంధించిన పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నా కానీ నేరాలు తగ్గడం లేదు. దీంతో సైబరాబాద్ పోలీసులు పూర్తిస్థాయిలో సర్వే చేసి హెచ్‌ఎండీఏకు నివేదిక అందిస్తూ సైబరాబాద్ పరిధిలోని దాదాపు 66 అండర్‌పాస్‌ల్లో సత్వరమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రూ.7.54కోట్ల వ్యయంతో 66 అండర్‌పాస్‌ల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ఇటీవల టెండర్లను ఆహ్వానించారు. ఈ సీసీ కెమెరాలను ఆరు నెలల్లోనే అన్ని ప్రాంతాల్లో అమర్చాలని, పూర్తిగా పోలీసు కమిషనరేట్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు కూడా పూర్తిస్థాయి నిఘాలోకి వెళ్లనుంది.

నగరంలో మోస్తరు వర్షం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో ఉదయం నుంచే నగర వ్యాప్తంగా చల్లని వాతావరణంతో పాటు శీతలగాలులు వీచాయి. జీడిమెట్ల, గాజులరామారం ఈఎస్‌ఐ వద్ద 17 మిల్లీమీటర్లు, మహదేవపురంలో 15.3, కూకట్‌పల్లి రాజీవ్ గృహకల్ప వద్ద 8.3, చార్మినార్ సర్దార్‌మహల్‌వద్ద 7.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిరుజల్లులు, శీతలగాలుల కారణంగా నగరంలో ఒక్కసారిగా చలితీవ్రత పెరిగింది. మరో రెండు, మూడు రోజులపాటు కూడా నగరంలో చల్లని వాతావరణం ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'బినీత్ ది లేయర్స్'



మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రూపవాణి తలారి ఆధ్వర్యంలో 'బినీత్ ది లేయర్స్' సోలో పెయింటింగ్ ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. రచయిత్రి అంజు పొద్దార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈనెల 28 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

- హైటెక్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మజ్లిస్ పార్టీ దౌర్జన్యాలు

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
- జూబ్లీహిల్స్ ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వెంగళరావునగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మజ్లిస్ పార్టీ దౌర్జన్యాలు, రౌడీయిజం, గూండాయిజం పెరిగిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మజ్లిస్ పార్టీని బీఆర్ఎస్ బాటలోనే పెంచి పోషిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం రాత్రి వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్, వెంగళరావునగర్ కాలనీలలో పార్టీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మజ్లిస్ పార్టీకి చెందిన వ్యక్తి గోరక్షకుడిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హత్యాయత్నం చేయడం దారుణమని అన్నారు. ఈ ఘటన రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి అద్దం పడుతోందని అన్నారు. మజ్లిస్ పార్టీ తరఫున గతంలో పనిచేసిన, పోటీ చేసిన వ్యక్తికే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం.. ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుతనానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, ఆ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. పని చేసే సమర్థుడైన బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్ రావు, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బండారు విజయలక్ష్మి, భరత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో..

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు గురువారం రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ పోచమ్మ దేవాలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.



మధురానగర్‌లో ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

యూసుఫ్‌గూడలో..

యూసుఫ్‌గూడ డివిజన్‌లోని వెంకటగిరి పోచమ్మ దేవాలయం నుంచి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.

బోరబండ, ఎర్రగడ్డలో..

బోరబండ డివిజన్ రాజ్‌నగర్, వినాయకరావు నగర్ బస్తీలలో, ఎర్రగడ్డ డివిజన్‌లోని బంజారానగర్, న్యూ సుల్తాన్‌నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్ తదితర ప్రాంతాల్లో, శ్రీనగర్ కాలనీలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని లంకాల దీపక్ రెడ్డి అన్నారు.

వ్యవస్థలను కాపాడడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను కాపాడడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో లిఖిత డయాగ్నస్టిక్ సెంటర్ సౌజన్యంతో గురువారం జర్నలిస్టుల మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టీయూడబ్ల్యూజే- ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీతో కలిసి ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ప్రెస్ అకాడమీ ధ్యేయమని అన్నారు. విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రహదారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు రంగా నర్సింహా గుప్తా, వెంకటేశ్వర్ రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే- ఐజేయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంప్ కన్వీనర్ ఆర్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

- దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పండగల సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య అధికారులు తెలిపారు. అక్టోబరు 25న చర్లపల్లి- బరౌని (07093), 27న బరౌని- చర్లపల్లి (07094) ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ రైళ్లు వచ్చి వెళ్లేప్పుడు జనగామ, కాజీపేట్, పెద్దపల్లి, మంచిర్యాల్, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చందాపోర్ట్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, ఝుర్సుగూడ, రూర్కెలా, రాంచీ, మూరి, బొకారో స్టీల్ సిటీ, ధన్‌బాద్, చిత్తరంజన్, మధుపూర్ స్టేషన్‌లలో ఆగుతాయని తెలిపారు. అలాగే అక్టోబరు 24న పోదనూర్ జంక్షన్- బరౌని జంక్షన్ (06187), 25న పోదనూర్ జంక్షన్- బరౌని జంక్షన్ (06193), 26న బరౌని- ఎర్నాకులం జంక్షన్(దక్షిణం)(06184), 27న బరౌని జంక్షన్ - పోదనూర్ జంక్షన్ (06188), 28న బరౌని జంక్షన్ - పోదనూర్ జంక్షన్(06194)ల మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ఓల్డ్‌సిటీ మెట్రోపై నజర్

(5వ పేజీ తరువాయి)

చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఈ కారిడార్‌కు రూ.2,741 కోట్లను కేటాయించారు. ముఖ్యంగా ఈ మార్గంలో ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ లాంటి చారిత్రక కట్టడాలకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా వాటికి కాస్త దూరంగా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. మెట్రో స్తంభాలు, స్టేషన్ల నిర్మాణానికి 'డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్' (డీజీపీఎస్) సర్వే చేపడుతున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారిని 100 అడుగులకు విస్తరించి, ప్రభావిత ఆస్తులను కూల్చివేస్తున్నారు. అలాగే యుటిలిటీలను గుర్తించేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేను కూడా చేపట్టారు.

ప్రాజెక్టుపై పలుమార్లు విజ్ఞప్తులు

రెండో దశలో మొత్తం 8 కారిడార్లను ప్రతిపాదించి డీపీఆర్‌లు సిద్ధం చేసి అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే 11 నెలలుగా ఆమోదం రాలేదు. దీంతో తీవ్ర నిరాశకులోనైన రాష్ట్ర ప్రభుత్వం ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు నిర్మిస్తున్న ఓల్డ్‌సిటీ కారిడార్‌కైనా అనుమతి ఇవ్వాలని పలుమార్లు ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తులు చేశారు. అనుమతి ఇస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెబుతోంది. అయితే, ఈ కారిడార్ ఫస్ట్ ఫేజ్‌లోనే ప్రతిపాదించి, వివిధ కారణాలతో ఆగిపోయిన నేపథ్యంలో కేంద్రం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని భావిస్తున్నట్లు హెచ్ఎంఎల్ వర్గాలు చెబుతున్నాయి.

నోటరీయా.. నో కనెక్షన్!

(5వ పేజీ తరువాయి)

సెక్షన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మీటర్ల జారీ అంశంపై దక్షిణడిస్కం స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే స్పష్టత నెలకొంటుందని వినియోగదారులు చెబుతున్నారు.

బస్తీల పేర్లు ఆన్‌లైన్‌లో పెట్టాలి

గ్రేటర్ వ్యాప్తంగా ఎలాంటి బస్తీల్లో విద్యుత్ మీటర్లు జారీ చేయలేమనే వివరాలను టీజీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు. నగరంలో వేల సంఖ్యలో పాత భవనాలు కూల్చి ఆ స్థలాల్లో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కొంతమంది రెండు, మూడు ఫ్లోర్లకు అనుమతి తీసుకుంటూ 4-5 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇలాంటి భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేదనే కారణంగా విద్యుత్‌శాఖ కనెక్షన్ల జారీని నిలిపివేసింది. దీంతో పాత మీటర్ల ద్వారా అధిక లోడ్ వినియోగించడంతో అవి తరుచూ కాలిపోతున్నాయి. కాలిపోయిన మీటర్లు మార్చుతున్న విద్యుత్‌శాఖ లోడ్‌కు తగినట్లు మీటర్లు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



నిమ్స్‌లో అత్యాధునిక పరికరాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బీరప్ప

నిమ్స్‌లో అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు

నిమ్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో రూ.2 కోట్ల వ్యయంతో సమకూర్చిన రెండు అత్యాధునిక పరికరాలను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులోకి వచ్చిన పరికరాల్లో 'ఐసీజీతో కూడిన కార్ల్ స్టోర్జ్ 4కే టీఎల్-400 రుబినా లాప్రోస్కోపిక్ టవర్ సిస్టమ్ ద్వారా సర్జరీల సమయంలో హై డెఫినిషన్ విజువలైజేషన్, నియర్- ఇన్ఫ్రారెడ్ ఫ్లోరసెన్స్ ఇమేజింగ్ సదుపాయాన్ని కల్పిస్తుందని తెలిపారు. 'ఒలంపస్ సీవీ -170 ఎండోస్కోపీ అండ్ కోలనోస్కోపీ సిస్టమ్' ద్వారా చిత్ర నాణ్యతను అత్యుత్తమంగా అందిస్తూ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ వ్యాధుల తీవ్రతను ముందుగానే గుర్తించి చికిత్స సమయంలో కీలక పాత్ర వహిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రదీప్ గౌడ్ తదితరులు

బీసీలకు అన్ని రంగాల్లో 50శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

పంజాగుట్ట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్ని రంగాల్లో 50శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యమని మహాజన సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు తరహా బీసీ ఉద్యమాన్ని నిర్మించి, బీసీ ముఖ్యమంత్రి అయ్యే వరకు పోరాడుతామని అన్నారు. హైకోర్టులో కావాలనే బీసీల 42శాతం రిజర్వేషన్లపై స్టే వచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. ఒక రాజకీయ పార్టీలో ఉండి ఆర్.కృష్ణయ్య బీసీ జేఏసీ చైర్మన్‌గా ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. ఎంపీ పదవికి రాజీనామా చేసి జేఏసీ చైర్మన్‌గా కొనసాగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మహాజన సేన జాతీయ కోఆర్డినేటర్ షణ్ముఖ రావు, మహిళా విభాగం కన్వీనర్ పి.మంగమ్మ, యువసేన నాయకులు ఎస్.ప్రశాంత్, అరుణ్, అనిల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే సమస్యలకు పరిష్కార మార్గాలు

రాంనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోరాటాలే సమస్యలకు పరిష్కార మార్గాలు అవుతాయని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పేర్కొన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలు తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోరెంకల నరసింహ, లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 25 సంవత్సరాలుగా మత్స్యకారుల సమస్యలపై తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. ఈ సందర్భంగా 25 మంది ప్రముఖులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.రమణ, పి.ఆశయ్య, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

రేపు ఛాయ సాహిత్యోత్సవం

- అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వేదికగా సంబురం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జూబ్లీహిల్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వేదికగా ఛాయ సాహిత్యోత్సవం నిర్వహిస్తున్నట్లు ఛాయా ఎడిటర్ అరుణాంక్ తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు 'దక్షిణాది స్వరాలు' కార్యక్రమంతో సాహిత్యోత్సవం మొదలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ మురుగన్(తమిళ), వసుధేంద్ర(కన్నడ), షీలాటోమీ(మలయాళ), అల్లం రాజయ్య(తెలుగు) రచయితలు ప్రధాన వక్తలుగా పాల్గొంటారు. మరో వేదిక ముంగిలిలో 'డిజిటల్ యుగంలో సాహిత్య ప్రయాణం', 'పిల్లల పుస్తకాల రూపకల్పనలో బొమ్మలు, ఊహల ప్రభావాలు', తదితర అంశాలపై సమావేశాలు ఉదయం 11గంటల నుంచి సాయత్రం 5.50గంటల వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు. 'కితాబ్' వేదికపై ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పుస్తకావిష్కరణలు, పుస్తక సమీక్షలు, పరిచయాలు జరుగుతాయని ఛాయా ప్రతినిధి క్రాంతి టేకుల చెప్పారు. రచయితలతో పాఠకుల సంభాషణ 'ముచ్చట' వేదిక ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు 15కుపైగా పుస్తకాల స్టాళ్లు కొలువుదీరనున్నాయని ఛాయా వ్యవస్థాపకుడు మోహన్‌బాబు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే సాహిత్యోత్సవంలో ప్రవేశం పూర్తి ఉచితమని, మరిన్ని వివరాలకోసం ఛాయా సాహిత్యోత్సవం - 2025 వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సీఎం పీఠం.. ఇక్కడో సెంటిమెంట్

(5వ పేజీ తరువాయి)

ఖరీదైన ప్రాంతాలుగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లున్నాయి. ఈ ప్రాంతంలో ఉంటే కాలం కలిసివస్తుందనే నమ్మకాలున్నాయి. ముఖ్యంగా రాజకీయరంగ ప్రముఖులకు ఈ ఏరియాలు బాగా కలిసివచ్చాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచిన వారంతా ఎక్కువగా ఇదే ఏరియాలో ఉంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కీలక పదవులు దక్కాలంటే ఇక్కడినుంచే పాచికలు వేయాల్సిందేనన్న సెంటిమెంట్ ఉంది.

ఎన్టీఆర్ నుంచి..

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ ప్రాంతాలకు అటు, ఇటుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా ఇక్కడ సెంటిమెంట్ మాత్రం కొనసాగింది. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇక్కడి నుంచే వ్యూహాలు రచించి ఏపీలో సీఎం అయ్యారు. విపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్ 2019 వరకు లోటస్‌పాండ్‌లో ఉండి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించారు. ఆ తర్వాత ఎన్నికలకు కూడా ఇక్కడి నుంచే వెళ్లడంతో జగన్ సీఎం అయ్యారు. 2019లో అధికారం కోల్పోయిన చంద్రబాబు కరోనా సమయంలో మొత్తం జూబ్లీహిల్స్‌లోనే ఉన్నారు. ఇక్కడి నుంచే చంద్రబాబు చక్రం తిప్పి 2024లో తిరిగి అధికారంలోకి వచ్చారనే సెంటిమెంట్ ఉన్నది.

ఇక్కడికి వచ్చేందుకు నేతల ప్రయత్నాలు

తాజాగా సీఎం పదవిపై ఆశలు పెట్టుకున్న నేతలంతా ఇప్పుడు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వైపే చూస్తున్నారు. ప్రశాంతంగా సిటీ బయట విల్లాలు కొన్నవారు, సొంత ఎస్టేట్‌లు, ఫామ్ హౌజ్‌లను నిర్మించుకున్న వారు కూడా ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనల్లో ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నందిహిల్స్‌లోనే ఎక్కువగా ఉంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య కారణాల రీత్యా ఫాంహౌజ్ నుంచి వచ్చి ప్రస్తుతం నందిహిల్స్‌లోనే ఉంటున్నారు. ఇక బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు కోకాపేట్ నుంచి త్వరలోనే జూబ్లీహిల్స్‌కు రాబోతున్నట్లు తెలిసింది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కవిత ఇప్పటికే జూబ్లీహిల్స్‌లో నివాసముంటున్నారు. బీజేపీ నేతలు కూడా సీఎం పీఠంపై ఆశలు పెంచుకుంటున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్ బంజారాహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇక శామీర్‌పేట్ పరిధిలో ఉంటున్న ఎంపీ ఈటల రాజేందర్ రాజకీయంగా కలిసిరావాలంటే కచ్చితంగా బంజారాహిల్స్ రావాలని అనుకుంటున్నట్లు తెలిసింది. త్వరలోనే విలాసవంతమైన సౌధాన్ని వదిలి ఈ ప్రాంతానికి వచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రస్తుతం బర్కత్‌పురాలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. బంజారాహిల్స్‌లో భారీ ఇంద్రభవనాన్ని నిర్మించుకుంటున్నారు. త్వరలోనే అందులోకి షిఫ్ట్ కాబోతున్నట్లు సమాచారం. ఈ సెంటిమెంట్ ఎంతవరకు నిజమో కానీ, ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించాలంటే ఇక్కడ ఉండటానికి నేతలంతా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎవరి సెంటిమెంట్ ఎలా వర్కవుట్ అవుతుందో వేచిచూడాలి.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/p17o6Paలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

సకాలంలో నీటి బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ కట్

● మెట్రో వాటర్ వర్క్స్ మేనేజర్ ఎం. యాదయ్య



పహాడిషరీఫ్ అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని తాగు నీటి కనెక్షన్ తీసుకున్న వారు సకాలంలో నల్లా బిల్లులు చెల్లించాలని మెట్రో వాటర్ వర్క్స్ మేనేజర్ ఎం. యాదయ్య అన్నారు. మునిసిపాలిటీలో 19 వేల నీటి కనెక్షన్లు ఉన్నాయని చాలా మంది వినియోగదారులు నీటి బిల్లులు చెల్లించడం లేదన్నారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, నల్లా ద్వారా నీరు పట్టుకున్న తర్వాత వృథా పోకుండా బంద్ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్ కట్ చేస్తామన్నారు.



మల్లాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

పహాడిషరీఫ్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోరక్షకులపై కాల్పుల సంఘటనను నిరసిస్తూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మల్లాపూర్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మజ్లిస్ నేతల దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఘటనల్లో పోచారం సమీపంలో గోరక్షకుడు ప్రశాంత్ సింగ్‌పై ఇబ్రహీం అనే వ్యక్తి కాల్పులు జరపడం, నిజామాబాద్‌లో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి ఘటనలు ప్రభుత్వం వైఫల్యమేనని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న హిందువులందరూ ఏకమై కొంతమంది మజ్లిస్ గూండాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ వారి దౌర్జన్యం పేట్రేగిపోయిందన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి , నవారు శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బీజేపీ నేతలు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గో రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ప్రశాంత్ సింగ్‌పై జరిగిన కాల్పులకు నిరసనగా చలో డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ నేతలు పొన్న శ్రీనివాస్, జె.చంద్రశేఖర్, కొడి సురేందర్, ఇతర నేతలు ఉన్నారు.



నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



బుల్లెట్ గాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోరక్షకుడు ప్రశాంత్ సింగ్‌ను గురువారం విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ పరామర్శించారు. ప్రశాంత్ సింగ్‌కు ఏదైన హాని కలిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని హెచ్చరించారు.

- గోషామహల్, (ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న రవికుమార్

యువత ప్రజారాజ్యంలో చేరాలి

● పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత ప్రజారాజ్యంలో చేరాలని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అవినీతి లేని తెలంగాణ నిర్మాణమే పార్టీ లక్ష్యమన్నారు. గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కూనపురెడ్డి హరిప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎంతో మంది యువత ఉపాధి, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, గ్రామ సర్పంచి పదవులో అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సింగం శ్రీనివాసరావు, పార్టీ ఉపాధ్యక్షుడు దాసరి శ్యామ్‌రావు, నాయకురాలు విజయరెడ్డి, ఉదయకుమారి, మైనారిటీసెల్ నాయకుడు ప్రొఫెసర్ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ నూతన అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మాధవరావు, కార్యదర్శిగా నాంపల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి రాజమనోహర్, కోశాధికారిగా పోటుగంటి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంది శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా రాచమల్ల సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

● ట్రాఫిక్ జామ్.. జరదేఖో!

మదీనా నుంచి సిటీ కాలేజ్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్ అవుతున్నది. హైకోర్టు వద్ద గల జిలేబీ షాప్‌ల వద్ద కార్లు ఆపి కొనుగోలు చేస్తున్నారు. అలాగే రోడ్లపై కొందరు బడాబాబులు వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో ఈ సమస్య తలెత్తుతోంది. సిటీ కాలేజ్ చౌరస్తాలో సిగ్నల్ ఏర్పాటు చేయకపోవడం కూడా ఒక కారణమని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు సిబ్బందిని నియమించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చార్మినార్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):




రహదారిపై నిలిపిన కార్లు

ఎన్వు ఇండియాతో అవగాహన ఒప్పందం

రాజేంద్రనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో పురుగు మందుల వాడకం పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎన్వు ఇండియా అనే సంస్థతో గురువారం రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామీణ ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి పెంపొందించేందుకు ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ అన్నారు. గ్రామీణ యువతకు తెగులు నిర్వహణ రంగంలో ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉంటాయన్నారు. విచక్షణా రహితంగా, అవగాహన లేకుండా పురుగు మందులు వాడకం వల్ల అనారోగ్య సమస్యలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్వు ఇండియా కు చెందిన డాక్టర్ అశీస్ డేక్రాస్, డాక్టర్ సంధ్య గోపకుమారన్, డాక్టర్ అంజన్ కుమార్ బంజా, ఎండీ ఖాన్, డాక్టర్ వాణిశ్రీ జోసెఫ్ పాల్గొన్నారు.



అవగాహన ఒప్పందం పత్రాలతో ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్ర కుమార్, ఎన్వు ఇండియా ఎండీ డాక్టర్ అరుణ్ కుమార్



బంగారు పతకం సాధించిన ఆర్యన్ యాదవ్

కుస్తీ పోటీల్లో పాతబస్తీ విద్యార్థికి బంగారు పతకం

మదీన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ అండర్-19 విభాగం కుస్తీ పోటీల్లో పాతబస్తీ విద్యార్థి ఆర్యన్ యాదవ్ బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఇంకా కొనసాగుతున్నాయి. అండర్-19లో 92 కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం జైభవాని వ్యాయామశాల నిర్వాహకులు, బస్తీవాసులు ఆర్యన్ యాదవ్‌కు సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి పాతబస్తీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సూర్య జూనియర్ కాలేజీలో ఆర్యన్ విద్యనభ్యసిస్తున్నాడు. జైభవాని వ్యాయామశాలలో శిక్షణ పొందుతున్నాడు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీవో

ఇనాంగూడలో అక్రమ లేఅవుట్ పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామ సర్వే నంబర్ 57లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను గురువారం డీఎల్‌పీవో సాధనరెడ్డి పరిశీలించారు. సదరు సర్వే నంబర్‌లో గేటెడ్ కమ్యూనిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఅవుట్ ఏర్పాటు చేశారని, అందులోని నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అక్రమంగా ఇంటి నంబర్లను కేటాయించారని గత నెలలో వెంకటేష్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం పంచాయతీ అధికారులతో కలిసి సాధనరెడ్డి .. సదరు లేఅవుట్, అందులోని నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. లేఅవుట్ , ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అని పంచాయతీ అధికారుల ద్వారా రికార్డులను పరిశీలించారు. అయితే ఫిర్యాదు దారు వెంకటేష్ నుంచి మరిన్ని వివరాలను రాబట్టారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో తెలిపినట్లు వెంకటేష్ చెప్పారు.

ప్రజల సహకారంతోనే పండగలు ప్రశాంతం: ఏసీపీ

ముషీరాబాద్ : ప్రజల సహకారంతోనే పండుగలు, సదరు ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్‌హుస్సేన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి ఏసీపీ ర మేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు, డీఐ ఎండీ నదీమ్ హుస్సేన్‌లను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాజీద్ హుస్సేన్, మహమూద్, అక్బర్ అలీ, రిజ్వాన్, తోఫిక్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు పూర్తి

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్.. పార్కుల అభివృద్ధి, సుందరీకరణలో భాగంగా పీఅండ్‌టీ కాలనీ సురభిపార్కులో ఇంజనీరింగ్ విభాగం ద్వారా పనులు పూర్తయ్యాయని డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కాలనీవాసులతో కలిసి ఆమె... పూర్తయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన పనుల్లో కాంపౌండ్‌వాల్ రిపేర్లు, ఫెన్సింగ్, పెయింటింగ్, పార్క్ చుట్టూ మెష్ ఏర్పాటు వాకింగ్ కోసం పాత్‌వే పనులు పూర్తి చేయించామని త్వరలో ఆహ్లాదకరమైన చక్కటి మొక్కలను ఏర్పాటు చేసి స్థానిక కాలనీవాసులకు ఉపయోగకరంగా అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు సాయిచంద్, జ్ఞానేశ్వర్, స్థానికులు శ్రీనివాస్, రాజశ్రీ, సువర్ణ, రాజేశ్వర్‌రావు, అఖిల్, కిరణ్ పాల్గొన్నారు.

వేదవర్ధన తీర్థస్వామికి ఘన స్వాగతం

బర్కత్‌పుర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నగరానికి వచ్చిన శిరూరు మఠాధిపతి వేదవర్ధన తీర్థస్వామి భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామీజీ 2026 జనవరి 19న సర్వజ్ఞ పీఠాన్ని అధిష్ఠించనున్న సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తా నుంచి రాఘవేంద్రస్వామి బృందావన సమితి వరకు ఈ యాత్ర జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామీజీకి స్వాగతం పలికారు.

మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మహిళ అదృశ్యమైంది. ఈసంఘటన కాచిగూడపీఎస్ పరిధిలో జరిగింది. కాచిగూడ పీఎస్ ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్న కమసమ్మ(40) భర్త చనిపోయాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. కర్నూలులో నివాసం ఉంటున్న ఒక కుమార్తె చూడడానికి ఆమె వెళ్లింది. కర్నూలు నుంచి కాచిగూడకు రైలులో తిరిగి వచ్చింది. కాని ఇంటికి చేరలేదు. తల్లి అదృశ్యంపై ఆందోళన చెందిన కుమార్తె అర్చన కాచిగూడ పీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిన్నెర మొగులయ్యకు పరామర్శ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కిన్నెర కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యను గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి, ఈదమ్మల బలరాం పరామర్శించారు. హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో మొగులయ్యకు కొంత స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలాల విషయంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆయన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయంలో ఆయనకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని వారు భరోసానిచ్చారు.



మొగులయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



దీపావళి పండుగ సందర్భంగా జీహెచ్ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు, స్వీట్లను కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ మిత్ర కృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అభిషేక్ మిత్ర, ఉమేశ్, విజయ్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

- గోషామహల్, ఆంధ్రజ్యోతి

నేటి బీసీ మహాధర్నాకు తరలిరండి

మన్సూరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడమే లక్ష్యంగా శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద మహాధర్నా కరపత్రాలను బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యమ నేతలు మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ టి.చిరంజీవులు అధ్యక్షతన చేపట్టే ఈ ధర్నాలో వివిధ పార్టీల బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు విచ్చేయనున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు బొమ్మ రఘురాంనేత, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు చామకూర రాజు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ల రాంనర్సింహాగౌడ్, తదితరులు ఉన్నారు.





ఒలింపియన్స్ కిడ్స్ వింటర్ గేమ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

● స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గురువారం ఎల్బీ.స్టేడియంలో ఫ్యూచర్ ఒలింపియన్స్ కిడ్స్ వింటర్ గేమ్స్ - 2025 పోస్టర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోని బాలాదేవితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్ 22, 23వ తేదీలలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఫ్యూచర్ ఒలింపియన్స్ ఆధ్వర్యంలో కిడ్స్ వింటర్ గేమ్స్ - 2025 జరగనున్నాయన్నారు. ఒలింపిక్స్ తరహా పోటీలను చిన్న పిల్లలకు అర్థమయ్యేలా ఆసక్తి గల క్రీడా అంశాలలో వారు రాణించే విధంగా సంస్థ ఆలోచన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, స్పెషల్ ఆఫీసర్ ఎస్.ఎం.బాషా, ఫ్యూచర్ ఒలింపియన్స్ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, జనరల్ మేనేజర్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ షోను ప్రభుత్వం నిషేధించాలి

● త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తాం : సామాజిక కార్యకర్తలు

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షోను ప్రభుత్వం నిషేధించాలని గజ్వేల్ సామాజిక కార్యకర్తలు కమ్మరి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరుకు చెందిన సుకుమారెడ్డిలు డిమాండ్ చేశారు. త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిగ్‌బాస్ షో పై ఈ నెల 16న జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 21న నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను కలిసి విన్నవించినా ఇప్పటివరకు స్పందన లేదని ఆరోపించారు. బిగ్‌బాస్ షోలో సన్నివేశాలు అసభ్యకరంగా ఉంటున్నాయని, దానిలో చూపిస్తున్న ఆటలు విలువలను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. మహిళా, ప్రజా సంఘాలు తమ పోరాటానికి అండగా ఉంటున్నాయన్నారు. దాన్ని చూడడం వల్ల విద్యార్థులు, యువత పెడదోవ పడుతుందన్నారు. అసభ్యకరమైన సన్నివేశాలు చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిగ్‌బాస్ షోను నిషేధించేంతా వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్‌కు చెందిన శ్రీలాన్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఇంటింటి ప్రచారం

నార్సింగ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో షేక్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో గణేశ్‌రెడ్డి, గణేశ్, ముక్తార్, మహిపాల్, చిరంజీవి, వివేక్, షేక్ ఇమ్రాన్, మహ్మద్ అజీత్, మహ్మద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భీంరాజ్

హయత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హయత్‌నగర్ వీరన్నగుట్టకు చెందిన భీంరాజ్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని భీంరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీంరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు వరకు ఈ పోరాటం ఆగదని తెలిపారు.



ఐటీ.. ఇదేంటీ..

- హైటెక్స్‌లో మురుగు పరుగు
- ఐటీ కారిడార్‌లో పొంగుతున్న డ్రైనేజీలు
- సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వాహనదారుల ఇబ్బంది

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీవరేజ్ నిర్వహణలో దేశంలో ఏ నగరంలో లేని విధంగా మినీ ఎయిర్‌టెక్ మిషన్లను తీసుకొచ్చినా సకాలంలో పనులను పూర్తిచేయడంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) వెనుకంజలో ఉన్నది. సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్య ఉందని వాటర్‌బోర్డు కాల్ సెంటర్ 155313కి ఫోన్ చేస్తే నమోదు చేసుకుంటారు. 3 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని ఫిర్యాదుదారుడికి సమాచారం ఇస్తారు. కానీ ఐటీ కారిడార్‌లో కొద్ది రోజులుగా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నా వాటర్‌బోర్డు అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. దీంతో ఐటీ ఉద్యోగులు, స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీవరేజ్ లైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి, మురుగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పర్యవేక్షిస్తున్నా ఐటీ కారిడార్‌లోని క్షేత్రస్థాయి అధికారులు కదలడం లేదు.

రోజుల తరబడి పనులు

హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే మార్గంలో గూగుల్ ఆఫీసు సమీపంలో మాదాపూర్ కొత్తగూడ చౌరస్తాలో నెలల తరబడి మురుగు నీరు పొంగి పొర్లుతోంది. మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐటీ కారిడార్‌లో మురుగు నిర్వహణ పనులను గంటల వ్యవధిలో పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. పనులను పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయడానికి వాటర్‌బోర్డులో సరైన విధానం లేదు. ఇటీవల వాటర్‌బోర్డు అధికారులు గంటల వ్యవధిలో మరమ్మతు పనులు పూర్తి చేసి నగరానికి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. కానీ మురుగు నీటి నిర్వహణలో మాత్రం అలాంటి విధానాన్ని క్షేత్రస్థాయి అధికారులు అనుసరించడం లేదు. కొత్తగూడ చౌరస్తాలో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వరుసగా మూడు రోజులు ఐటీ ఉద్యోగులకు సెలువులు వచ్చాయి. వాహనాల రద్దీ కూడా లేదు. కాంట్రాక్టర్ ఆ సమయంలో పనులను పూర్తిచేయాల్సి ఉన్నా చేయలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ఐటీ ఉద్యోగులు రోడ్డుపై మురుగు ప్రవాహం, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పర్యవేక్షణ మరిచిన అధికారులు

ఐటీ కారిడార్‌లో మురుగు సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కానీ పలు ప్రాంతాల్లో మురుగునీరు పొంగిపొర్లుతోంది. మాదాపూర్ హైటెక్స్ కమాన్ రోడ్డులో ఆలయానికి ఎదురుగా 15 రోజులుగా మురుగు నీరు ప్రధాన రహదారిపై పారుతోంది. ఆ రోడ్డుపై వాటర్‌బోర్డు అధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ వద్ద మురుగునీరు పొంగి ఫుట్‌పాత్‌పై ప్రవహిస్తోంది. దీంతో మెట్రో రైలు దిగిన ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్ పర్వత్‌నగర్‌లో మల్లన్న మోటర్స్ ఎదురుగా ప్రధాన రహదారిలో మూడు నెలలుగా సీవరేజ్ ఓవర్‌ఫ్లో అవుతోంది. ఈ మార్గంలో ప్రయాణించే ఓ వాహనదారుడు వాటర్‌బోర్డుకు ఫిర్యాదు చేయగా.. టోకెన్ నంబరు 2785 ఇచ్చారు. ఐటీ కారిడార్‌లో రోడ్లపై మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని ఐటీ ఉద్యోగులు కోరుతున్నారు.



మాదాపూర్-కొండాపూర్ రోడ్డుపై పారుతున్న మురుగునీరు



గన్‌పార్కు వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న గాలి వినోద్‌కుమార్, దిలీప్‌కుమార్, విమలక్క, విశారదన్, చిరంజీవులు తదితరులు

సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యం

- ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

గన్‌పార్క్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న 12 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర పాలనలో పాలకుల అవినీతి తారా స్థాయికి చేరిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర అధక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ నేతృత్వంలో చేపట్టిన సామాజిక చైతన్యయాత్రను గురువారం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ప్రారంభించారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన బాటలో ముందుకు సాగి బహుజన రాజ్యం తెచ్చుకుంటామన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా సామాజిక తెలంగాణ ముఖ్యమన్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాజ్యాధికార కల్పన, అవినీతిని రూపుమాపాలి, యువత మేలుకో-తెలంగాణ ఏలుకో అనే అంశాలపై సామాజిక చైతన్య యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఐఏఎస్ విశ్రాంత అధికారి చిరంజీవులు మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో కులగణన జరగాలని విమలక్క అన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీపై ఒత్తిడి పెంచండి

- 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడానికి ఢిల్లీపై ఒత్తిడి పెంచాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి పిలుపునిచ్చారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల సాధనకు ఉద్యమ కార్యాచరణకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాధించడానికి ఈ నెల 27 నుంచి నవంబరు 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాలలో దీక్షలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో టీపీసీసీ సంవిదాన్ చైర్మన్ డాక్టర్ పి.వినయ్‌కుమార్, పలు సంఘాల నాయకులు అజయ్‌కుమార్‌యాదవ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, పాండుయాదవ్, దాసురామ్ నాయక్, కె.నర్సింగ్‌రావు, కె.శ్రీనివాస్, శారదాగౌడ్, శైలజ పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- అమ్మవారి దర్శనానికి బారులు



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

చార్మినార్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. చార్మినార్ నుంచి గుల్జార్ హౌస్ వరకు బారులు తీరారు. భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ చైర్మన్ శశికళ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వెండితో ప్రత్యేకంగా తయారు చేసిన నాణాలను అందజేశారు. జస్టిస్ మాధవీలత, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఆలయంలో పూజలు చేశారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

'శ్రీరామ రావణీయం, ఆంధ్రీయం' ఆవిష్కరణ

చిక్కడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత పూసల రజనీగంగాధర్ రచించిన శ్రీరామ రావణీయం, ఆంధ్రీయం పుస్తకాలను శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ గురువారం ఆవిష్కరించారు. ముందుగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యకళాకారిణి దామిని శ్రీజ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. పొత్తూరి సుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య గౌరీశంకర్, వెంకటదాసు, మౌనశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా పండిత్ మధ్నూర్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఎఫ్‌టీఎస్‌ఏ) ఫెలోగా భూగర్భ జల శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ పండిత్ మధ్నూర్ ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వంలోని సీజీడబ్ల్యూబీ నుంచి సీనియర్ శాస్త్రవేత్తగా పని చేశారు. రాష్ట్రంలో భూమి, మహాసముద్రం, వాతావరణ, పర్యావరణ శాస్త్రాలలో, ముఖ్యంగా భూగర్భజల నిర్వహణలో చేసిన ఆయన కృషికి ఈ గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో అనేక శాస్త్రీయ పత్రాలను ఆయన ప్రచురించారు.



హెచ్ఎంటీ జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

హెచ్ఎంటీ స్థలాన్ని కాపాడతా

- ఎంపీ రఘునందన్‌రావు

కుత్బుల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కబ్జా అయిన హెచ్ఎంటీ స్థలాన్ని కాపాడతానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం హెచ్ఎంటీ మిషన్ టూల్స్ పరిశ్రమను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. జనరల్ మేనేజర్ అంజర్ షాహిన్‌ను అడిగి కార్మికుల సమస్యల తెలుసుకున్నారు. సమస్యలను కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్.. ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

నార్సింగ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి పేరుతో నకిలీ ఆధార్, పాన్‌కార్డు సృష్టించి ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను నార్సింగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పుప్పాల్‌గూడలో ధరణి ఇన్‌ఫ్రా పేరుతో ఎ. శ్రీకాంత్, అతడి స్నేహితులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఓ ప్లాట్ కొన్నారు. సూర్యప్రకాష్ అనే వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన నిందితులు వారి నుంచి రూ. 1,20,30,000 తీసుకున్నారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారని తెలియడంతో శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసి బాలాపూర్‌కు చెందిన శంకర్‌రెడ్డి, పులివెందుల నివాసులు కిరణ్‌కుమార్, జగదీశ్‌రెడ్డిని గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

నవంబరు 21, 22 తేదీల్లో జేఎన్‌టీయూ కాలేజీ వజ్రోత్సవాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పడి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా నవంబరు 21, 22 తేదీల్లో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నామని యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. గురువారం క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల డైమండ్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ డైమండ్ జూబ్లీ వేడుకలు 21న మొదలవుతాయని, 22న జరిగే గ్లోబల్ అలుమ్ని మీట్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని వైస్ చాన్స్‌లర్ ప్రకటించారు. వజ్రోత్సవ వేడుకలను ఈ సారి 'స్టూడెంట్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్స్' థీమ్‌తో నిర్వహిస్తామని, రెండు రోజులపాటు జరిగే వజ్రోత్సవ వేడుకల్లో సాంకేతిక సెషన్లతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లు ఉంటాయని వెల్లడించారు.

పూర్వ విద్యార్థులకు 'యంగ్ అచీవర్స్' అవార్డులు

వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల్లో 20 మంది ప్రముఖులకు విశిష్ట పూర్వ విద్యార్థుల అవార్డులను ప్రదానం చేస్తామని వీసీ తెలిపారు. విశ్వవిద్యాలయానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిన, వృత్తిపరమైన విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాంకేతిక ఆవిష్కరణ, వ్యవస్థాపక నైపుణ్యం, విద్యావేత్తలు, పరిశోధన, సామాజిక సేవ, కార్పొరేట్ లీడర్‌షిప్, కళలు, క్రీడలు, వినోదం వంటి విభిన్న రంగాల నుంచి 20 మంది యువకులను ఎంపిక చేసి వారిని యంగ్ అచీవర్స్ అవార్డులతో సత్కరిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అలుమ్ని డైరెక్టర్ భ్రమర, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం యూఎస్ఏ చాప్టర్ అధ్యక్షుడు హరి ఇప్పన్నపల్లి, జేఎన్‌టీయూ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు విజయ మోహన్‌రావు, వివిధ విభాగాల డైరెక్టర్లు పాల్గొన్నారు

బండారు దత్తాత్రేయకు

'ప్రైడ్ ఆఫ్ ఇండియా' అవార్డు

రవీంద్రభారతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శృతిలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు "ప్రైడ్ ఆఫ్ ఇండియా" అవార్డు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ దత్తాత్రేయ రాజకీయ నాయకుడే కాకుండా ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన సామాజిక నాయకుడని పేర్కొన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే యువతలో సేవా దృక్పథం పెరగాలన్నారు. ఈ గౌరవాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు గాయని ఆమని నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించారు.



దత్తాత్రేయకు అవార్డు అందజేస్తున్న మధుసూదనాచారి



సదస్సులో పాల్గొన్న అతిథులు

ముగిసిన బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్ సదస్సు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025 సదస్సు గురువారం ముగిసింది. పలు దేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులతో బయో మిమిక్రీ, స్పేస్ ఇన్నోవేషన్, సస్టెయినబల్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ అంశాలపై సమగ్ర చర్చలను సదస్సులో భాగంగా నిర్వహించారు. విశ్వంలో భూమి మీద కాకుండా మరెక్కడైనా ప్రాణులు ఉన్నాయేమో తెలుసుకునేందుకు చేపట్టిన 'ఏ సైన్ ఇన్ స్పేస్' ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు, ఆర్టిస్టిక్ డైరెక్టర్ డానియేల డీ పౌలిస్ తమ ప్రాజెక్ట్ వివరాలను వెల్లడించారు. ఏ సైన్ ఇన్ స్పేస్ ప్రాజెక్ట్ ద్వారా విశ్వంలోకి వివిధ సందేశాలను పంపేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

అంతరిక్షంలో పేరుకు పోతున్న వ్యర్థాల వల్ల ఎదురయ్యే సమస్యలు, వ్యర్థాలను నాశనం చేయాల్సిన ఆవశ్యకతను యాంటీమ్యాటర్ స్పేస్ సీఈవో నవీన్‌కుమార్ వెల్లడించారు. అంతరిక్షంలో వ్యర్థాల నిర్వహణ గురించి ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్ రెడ్డి వివరించగా, ఆస్ట్రో బయాలజీ పై షిఫా జహ్రా మాట్లాడారు. సదస్సుకు అపూర్వ స్పందన వచ్చిందని, రాబోయే సదస్సును కూడా హైదరాబాద్‌లో నిర్వహిస్తామని జియోప్యాక్ ఫౌండర్ ముర్తాజా అబ్బాస్ తెలిపారు.

మహిళపై అత్యాచార యత్నం

- అడ్డుకోవడంతో ఇనుప రాడ్డుతో తలపై కొట్టి హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి మహిళపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె అడ్డుకోవడంతో హత్య చేసిన ఘటన బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి జరిగింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన ఓ మహిళ(35) కొంతకాలం క్రితం నగరానికి వచ్చింది. అమీర్‌పేటలో ఓ స్పాలో పనిచేసేది. ఆమె మద్యం తాగి విధులకు వెళ్లడంతో పనిలో నుంచి తీసేశారు. బుధవారం రాత్రి ఓ వ్యక్తితో కలిసి గ్రీన్‌ల్యాండ్‌లో టిఫిన్ సెంటర్ వద్ద మద్యం తాగింది. అతడు ఆమెపై అత్యాచారానికి యత్నించగా అడ్డుకుంది. మత్తులో ఉన్న అతడు మహిళపై దాడిచేశాడు. గొంతు పిసికి ఇనుపరాడ్డుతో తలపై కొట్టడంతో చనిపోయింది. గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

నేటినుంచి జీపీఓలో ఆధార్ సేవలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్ జనరల్ పోస్టాఫీస్‌లో ఈనెల 24 నుంచి ఆధార్ కౌంటర్ ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తుందని చీఫ్ పోస్ట్ మాస్టర్ వై.ప్రసాద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. ఈ కౌంటర్ ద్వారా ఆధార్ సేవలను పొందవచ్చన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టూరిజం సంస్థలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం గౌరవాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం టూరిజం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి క్రాంతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డికి గురువారం వినతిపత్రాలు అందజేశారు.

సన్న, చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని

నూతన వ్యవసాయ విధానాలను రూపొందించాలి

ప్రొఫెసర్ కోదండరాం

రాజేంద్రనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన వ్యవసాయ విధానాలను రూపొందించాలని ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఏడాది కాలంలో అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టి అమలు చేయడం సంతోషకరమన్నారు. ఏ పంటలు పండించాలి.. ఏ పంటలు పండిస్తే రైతులకు అధిక లాభాలు ఉంటాయన్న దానిపై చర్చ జరగాలన్నారు. తెలంగాణ పల్లెలను ఎలా కాపాడుకోవాలని అనే స్ఫూర్తితో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ అన్ని వర్గాల వారు వ్యవసాయ విద్యను అభ్యసించడానికి చేస్తున్న కృషి గొప్పదన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ మేధస్సే పెట్టుబడిగా విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచడానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. డాక్టర్ సంతోష్, డాక్టర్ సాయికుమార్, డాక్టర్ సంపత్ మాట్లాడుతూ రైతు కూలీల బిడ్డలకు వ్యవసాయ విద్య అభ్యసించడానికి 15శాతం రిజర్వేషన్లను కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వాసుదేవ్, వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. పవన్ చంద్రారెడ్డి, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ఆట పాటలతో ఉర్రూతలూగించిన గోరటి వెంకన్న

వ్యవసాయ విద్యార్థులు, రైతాంగం, గ్రామీణ జీవన విధానం గురించి సహజ కవి గోరటి వెంకన్న పలు పాటలు పాడి విద్యార్థులను, ఉద్యోగులను ఉర్రూతలూగించారు. గ్రామీణ ఆర్థిక విధానాలు బాగుండాలంటే వ్యవసాయ రంగం బాగుండాలన్నారు.

విశేషం

ధర్మదీక్షాచార్యుడు

ఆది ఉత్తరాది మఠం యతివరేణ్యులైన శ్రీసత్య ధ్యానతీర్థులు తిరుచానూరులో స్థాపించిన విద్యాపీఠం. అక్కడ అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, ఫలితాలను ఒక కాగితం పై రాసి స్వామికి అధ్యాపకులు అందజేశారు. సాధించిన ఫలితాలకు తగిన నగదు బహుమతిని విద్యార్థులకు స్వామివారు ఇవ్వడం ఆనవాయితీ. అయితే ఒక విద్యార్థికి మొదటి శ్రేణి మార్కులు వచ్చినా... స్వామి తక్కువ నగదు అందజేశారు. ఇది గమనించిన మఠం దీవాన్... ఆ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. అప్పుడు స్వామి మందహాసం చేసి... "ఈ విద్యార్థి తీసుకొనేవాడు కాదు. భవిష్యత్తులో ఎంతోమందికి తానే ఇస్తాడు" అంటూ భవిష్యవాణి వినిపించారు. ఆ విద్యార్థి పేరు గురురాజాచార్. అతనే ఆ తరువాత 'శ్రీసత్య ప్రమోద తీర్థులు'గా... ఉత్తరాది మఠానికి 41వ అధిపతిగా... వేదాంత సామ్రాజ్యాన్ని ఏలారు.

తర్కశిరోమణి...

శ్రీసత్య ప్రమోద తీర్థులు 1918 ఆగస్టు 28న... కర్ణాటకలోని ధార్వాడలో శ్రీరంగాచార్యగుత్తల్, కమలాదేవి దంపతులకు 'గురురాజాచార్'గా జన్మించారు. ఆయన చిన్న వయసు నుంచే సంస్కృతం, వేద, శాస్త్రాధ్యయనాలలో చక్కటి ప్రతిభా పాటవాలు చూపి, గురువుల మెప్పు పొందారు. తర్కశాస్త్రంలో పాండిత్యానికి గాను 'తర్కశిరోమణి' అనే బిరుదు లభించింది. ఉత్తరాది మఠం 40వ అధిపతి అయిన శ్రీసత్యాభిజ్ఞ తీర్థులు... తన తరువాత మఠాధిపత్యాన్ని ఎవరికి ఇవ్వాలని ఆలోచిస్తున్నప్పుడు... ఆయన కలలో శ్రీసత్య ధ్యానతీర్థులు కనిపించి... గురురాజాచార్ అందుకు అర్హుడని సూచించారు. అయితే ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందే శ్రీసత్యాభిజ్ఞతీర్థులు మంచానపడి, అచేతనులయ్యారు. ఆయన తన వారసుణ్ణి ప్రకటించకుండానే పరమపదిస్తారేమోనని అందరూ ఆందోళనలో ఉండగా... శ్రీసత్యాభిజ్ఞ తీర్థులు మళ్ళీ స్వస్థత చెందారు. 1947లో గురురాజాచార్యులకు సన్న్యాస దీక్షను అనుగ్రహించి, 'శ్రీసత్య ప్రమోద తీర్థులు'గా నామకరణం చేశారు. ఉత్తరాది మఠాధిపతిగా నియమించారు.



అచంచల గురుభక్తి

మహా పండితులైన తమకు బదులుగా దక్షిన మఠాధిపత్యాన్ని శ్రీసత్య ప్రమోద తీర్థులు ఎలా నిలుపుకోగలరో చూద్దామనే అనేకమంది పండితుల అసూయా ద్వేషాలు, బలహీనమైన తన ఆరోగ్య స్థితి, క్షీణించిన మఠం ఆర్థిక పరిస్థితి... ఇలా ఎన్నో సవాళ్ళను, సమస్యలను ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎంతటి క్లిష్ట సమస్య అయినా... శ్రీసత్య ప్రమోదులు ఎన్నుకొన్న పరిష్కార మార్గం ఒక్కటే... అదే అచంచలమైన గురుభక్తి. తన గురువుల మీద ఉన్న అపారమైన విశ్వాసమే ఆయనకు శ్రీరామరక్షగా నిలిచింది. మలఖేడ్‌లో శ్రీజయతీర్థుల మూల బృందావనం దగ్గర ఆయన నిర్వహించిన మొదటి 'సుధామంగళ' కార్యక్రమం.. అనేకమంది పండితులను ఆయన విద్వత్తుకు దాసోహం చేసింది. అది ఆయన మొదటి విజయం. ఆయనది అద్భుతమైన జ్ఞాపకశక్తి. అలాగే ఆయన ధర్మ దీక్ష అనితర సాధ్యం. రోజూ జ్ఞానకార్యమైన 'సుధాపాఠం' లేనిదే... శ్రీమూలరాముల పూజ చేసేవారు కాదు.

విద్యాప్రదాత...

శ్రీసత్య ప్రమోదులు... ముంబాయిలో శ్రీసత్య ధ్యాన పీఠం, బెంగళూరులో శ్రీ జయతీర్థ విద్యాపీఠం నెలకొల్పి, ఎందరో వేద విద్యార్థులకు ప్రత్యక్షంగా తత్త్వ జ్ఞానాన్ని బోధించారు. అసంఖ్యాకమైన భక్తులకు బోధలు, మంత్రోపదేశాలు చేశారు, దీక్షలను అనుగ్రహించారు. భగవదానుగ్రహం పొందే జ్ఞానాన్ని ప్రసాదించారు. గ్రంథాలు రచించారు. ఆయన ప్రారంభించిన విద్యాదానం నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుత మఠాధిపతి శ్రీసత్యాత్మ తీర్థులకు కూడా ఆయనే మంత్రోపదేశం చేసి, సన్న్యాస దీక్ష ప్రసాదించారు. శ్రీసత్య ప్రమోదులు దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి... విష్ణుభక్తిని ప్రచారం చేశారు. ఉత్తరాది మఠం పరంపరలో... శ్రీనరహరి తీర్థుల తరువాత... ఒడిశాకు విచ్చేసిన మొదటి మఠాధిపతి ఆయనే. పల్లెటూర్లకు సైతం వెళ్ళి... హిందూ ధర్మాన్ని, మధ్వ సిద్ధాంతాన్ని బోధించి, ప్రజలను జాగృతం చేశారు. వారిలో భక్తి విశ్వాసాలను దృఢపరిచారు. ఎటువంటి భోగాలను ఆశించకుండా, నిస్వార్థమైన జీవనాన్ని సాగించిన శ్రీసత్య ప్రమోదుల ఆరాధనోత్సవాలు ఈనెల 23న ప్రారంభమయ్యాయి. 25వ తేదీ వరకూ కొనసాగుతాయి. శ్రీసత్య ప్రమోదుల 108వ జయంతి సందర్భంగా... ఆయన పేరు మీద 108 రూపాయల వెండి నాణేన్ని ఈ ఏడాది ఆగస్టు ముప్పైన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

• శ్రీ మధ్వ ప్రచార పరిషత్

కార్తిక మాసం



ఆనాటి ఋషులు ఏర్పాటు చేసిన సంప్రదాయాల వెనుక ఎన్నో ఆరోగ్య, ఆధ్యాత్మిక, సామాజిక, జీవనగమన సంబంధమైన ఎన్నో అంశాలు ఉన్నాయి. తమతోపాటు అందరినీ తరింపజేయాలనే నిస్వార్థమైన దృక్పథంతో అనేక విధానాలను వారు మనకు ఏనాడో చెప్పారు. వాటిలో... కార్తిక మాసంలో ఆచరించవలసిన నియమాల గురించి తెలుసుకుందాం.

కార్తికంలో ఆరు నియమాలు

స్నానం దీపంచ దానంచ పురాణ శ్రవణం ద్విజాత్
బిల్వార్చనం చైవ వన భోజనమాచరేత్...

"కార్తిక మాసం అంతటా చేయవలసినవి... స్నానం, దీపం వెలిగించడం, దానం, పండితుల ద్వారా పురాణాన్ని వినడం, లక్ష బిల్వార్చనం, వన భోజనం" అని చెబుతోంది శాస్త్రం.

స్నానం: ఆశ్వయుజం, కార్తికం అనే రెండు మాసాలకూ కలిపి 'శరదృతువు' అని పేరు. ఆశ్వయుజంలో చలి ప్రారంభమైతే... కార్తికంలో కొంత మంచు చేరుతుంది. ఇలాంటి వాతావరణంలో ప్రజలు అనారోగ్యాలకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ఈ వాతావరణ మార్పును శరీరానికి అలవాటు పడేలా చేస్తూ, ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే... ప్రతి నిత్యం చన్నీటి స్నానం చేయాలి. 'అసలే చలి. అందులోనూ చన్నీటి స్నానమా?' అనుకోకూడదు. ఔషధం తప్పనిసరిగా తీయగానే ఉండాలనుకోవడం సరికాదు. తెల్లవారు జామున స్నానాలు ప్రారంభించాక... మొదటి నాలుగైదు రోజులు జలుబు, ముక్కు బిగుసుకుపోవడం లాంటివి కలుగుతాయి. శత్రువుతో పోరాడేటప్పుడు... రెండు మూడు దెబ్బలు తిని ఊరుకుంటే ఓడిపోయినట్టే కదా! ఆ పరిస్థితిని దాటడం కోసం... స్నానాలను కొనసాగిస్తే శత్రువు లొంగుతాడు. శరీరం ఆ స్నానాలకు అలవాటు పడుతుంది. లేదా... మొదటి రెండు మూడు రోజులు కొద్దిగా వెచ్చగా, ఆ తరువాత రెండు రోజులు గోరువెచ్చగా... శరీరం అలవాటు పడేలా చేస్తే... ఆ తరువాత పూర్తిగా చన్నీటి స్నానాలు చేయవచ్చు. అది పెద్ద ఇబ్బందే కాదు. 'స్నానం చేసి తీరాలన్నారు కదా!' అని అనారోగ్యవంతులు, చన్నీటి స్నానాన్ని తట్టుకోలేని వృద్ధులు, రాత్రంతా పనిపాటలు చేసి పొద్దున్న నిద్రించే ఉద్యోగులు దీన్ని పాటించాలని నిర్బంధమేదీ లేదు. కొన్ని సందర్భాల్లో వారికి అది ప్రమాదకరం కూడా. ఈ విషయాన్ని కూడా పెద్దలు చెప్పారు.

దానం: దానం అనగానే లక్షలో, కోట్లో ఖర్చు చేయనవసరం లేదు. దైవదర్శనం కోసం ఆలయానికి వెళ్ళినప్పుడు... దీపారాధన నిమిత్తం కొంత నూనెను రోజూ ఇవ్వడం, అర్చకులకు శక్తిమేర బియ్యాన్ని సమర్పించడం, భోజనం చేసేటప్పుడు కాకులకు నేతి అన్నపు ముద్దను, పిచ్చుకలకు వడ్ల గింజలను పెట్టడం, చీమల కన్నాల దగ్గర బెల్లపు పొడి వేయడం, కుక్కలకు పెరుగన్నం పెట్టడం, పిల్లుల కోసం పాత్రలో పాలు ఉంచడం... ఇవన్నీ దానాలే. అన్ని జీవులూ భగవంతుని సంతానమే. కాబట్టి ఆ సంతానంలో ఒకరుగా మిగిలిన జీవులనూ మనం ఆదరించాలి. అప్పుడే మనకు, మన కుటుంబానికి ఆయన ఆశీస్సులు కలుగుతాయి.

పురాణ శ్రవణం: స్నానం, దీపం, దానం ద్వారా భౌతిక శుద్ధి కలుగుతుంది. మానసిక శుద్ధి కోసం పురాణాలను వినాలి. మనకు వచ్చే సమస్యల్లో చాలా వాటిని ఎవరికీ చెప్పుకోలేం. ఇరుగు పొరుగు వారికి చెబితే... వాటికి చిలవలూ పలవలూ జోడించి ఊరంతా చాటింపు వేయవచ్చు. మరి వాటికి పరిష్కారం ఎలా? పురాణాలు ఎన్నో కథలను చర్చిస్తాయి. వాటిలో చాలా సమస్యలకు పరిష్కారాలు సులువుగా దొరుకుతాయి. గుడిలో పురాణం వినిపించే పండితులను నేటికీ సన్మానిస్తూ ఉండడానికి కారణం... ఈ పరిష్కార లాభమే. అంతేకాదు... ధర్మాచరణను, సత్ప్రవర్తనను పురాణాలు నేర్పుతాయి. చెడు దారులు పట్టినవారికి పతనం తప్పదనే సత్యాన్ని స్పష్టం చేస్తాయి.



దీపం: 'తైలం' అంటే 'తిలలను (నువ్వులను' పిండగా వచ్చినది' అని అర్థం. కాబట్టి అవకాశం ఉంటే నెల మొత్తం ఆవు నేతి దీపాలు రెండు, లేదా నువ్వుల నూనె దీపాలు రెండు నిత్యం పూజా మందిరంలో వెలిగించాలి. ప్రదోష సమయంలో (సాయంత్రం ముగిసి రాత్రి రాబోవడానికి ముందు... చిరు సంజ చీకటి కాలంలో) ప్రధాన ద్వారానికి అటూ ఇటూ పెట్టాలి. చలి వాతావరణంలో పెరిగే లక్షణం ఉన్న హానికర క్రిములు... ఇలా వీధి గుమ్మం దగ్గర పెట్టిన దీపానికి ఆకర్షితమై, మంటల్లో పడి మరణిస్తాయి. లేదా ఆ దరిదాపుల్లోకి రావు. దీపం పెట్టిన తరువాత... ఆ వెలుగులో దైవాన్ని దర్శించుకోవాలి. దేవుని స్తోత్రాలు, మంత్రాలు... ఇలా వేటినైనా చదువుకోవచ్చు. దీపాలను పత్తితో చేసిన వత్తులతో, మట్టి ప్రమిదల్లో పెట్టడం శ్రేష్ఠం.

లక్ష బిల్వార్చన: మారేడు ఆకులతో కషాయం కాచుకొని, రోజూ ఒక్క అర చెంచా చొప్పున తీసుకుంటే శ్వాసకోశ వ్యాధులు తొలగిపోతాయని, లేత మారేడు ఆకులను దంచి, ముద్ద చేసుకొని, ఆవు నేతిలో మిరియపు గింజంత కలిపి రోజూ తింటే జీర్ణక్రియలో లోపం ఉండదని పూర్వులు చెప్పారు. ఇక... లక్ష మారేడు దళాల మీద నుంచి వచ్చే గాలిని అర్చన ముగిసే వరకూ... సుమారు అయిదు గంటల సేపు పీలిస్తే శ్వాస వ్యాధులు పోతాయనేది వైద్య శాస్త్ర రహస్యం. ఈ మాసంలోని శీతోష్ణస్థితి అనారోగ్యాన్ని కలిగించేది కావడం వల్లే... ఈ పద్ధతిని ఏర్పాటు చేశారు. లేత బిల్వ దళాన్ని నీటిలో వేసుకొని, ఆ నీటిని అయిదారు గంటల తరువాత తాగితే ఆరోగ్యం బాగుంటుంది. మారేడువల్ల కలిగే ఇలాంటి ప్రయోజనాలను బిల్వ దళార్చన తరువాత పెద్దలు వివరిస్తూ ఉంటారు. బిల్వం... శివ, విష్ణు ప్రీతికరమైనది. మూడు ఆకులు శివుడి నేత్రాలకు సంకేతం. లక్ష్మీ పూజకు కూడా అవి ప్రశస్తమైనవి. అందుకే... బిల్వ దళాలను కోసిన తరువాత... పది రోజుల పాటు అవే పత్రాలతో పూజ చేయడం దోషం కాదంది శాస్త్రం.

వనభోజనం: వర్ష ఋతువైన శ్రావణ, భాద్రపదాల్లో బాగా కురిసిన వర్షాలకు... అంతకుముందు విత్తనాలుగా ఉన్న మొక్కలు క్రమంగా పెరుగుతాయి. అవి తమలో ఓషధీ శక్తులన్నిటినీ నింపుకొని, దృఢమైన మొక్కలుగా ఉండేది కార్తికానికే.



అందుకే కార్తిక వన భోజనాల పేరిట... వయోధికులను తీసుకువెళ్ళి, ఈ ఓషధీ వృక్షాలు, మొక్కల గురించి వివరంగా తెలుసుకుంటే... మన ఆరోగ్యం మన చేతిలో ఉన్నట్టే. సృష్టిలో మొక్కలకు ఉన్న శక్తి ఎంతటిదో కూడా మనకు అర్థం అవుతుంది. ఇలా పైన పేర్కొన్న అన్నిటిలో ఉన్న ఆరోగ్య రహస్యాలను తెలుసుకున్నప్పుడు... కార్తిక మాస ప్రాధాన్యం మనకు అవగతం అవుతుంది.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

శివాలయాన్ని ఎలా దర్శించాలి?

తెలుసుకుందాం

పవిత్రమైన కార్తిక మాసంలో శివాలయ దర్శనం అత్యంత శుభప్రదం. ఆ దర్శన క్రమాన్ని మన పూర్వులు, మహర్షులు వివరించారు. శివాలయానికి వెళ్ళినవారు మూడు లింగాలను కచ్చితంగా దర్శించుకోవాలి. అవి: స్థూల లింగం, సూక్ష్మ లింగం, భద్ర లింగం. వాటినే 'లింగత్రయం' అంటారు.

స్థూల లింగం విమానంస్యాత్ సూక్ష్మ లింగం సదాశివమ్... బలిపీఠం భద్రలింగం లింగత్రయమిహోచ్యతే... అంటే గర్భగుడిపైన నిర్మితమైన విమానం... స్థూల లింగం. ఆలయంలో కొలువుతీరిన మూల లింగం... సూక్ష్మ లింగం. ధ్వజ స్తంభానికి ముందు ఉండే బలిపీఠం... భద్ర లింగం. మొదట ఆలయ గోపురాన్ని దర్శించిన వెంటనే... దాన్ని స్థూల లింగంగా భావించి, నమస్కరించాలి. ఆ తరువాతనే ఆలయంలో ప్రవేశించాలి. ధ్వజ స్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేయాలి. భగవంతుడి నామాన్ని ఉచ్చరిస్తూ ఆలయానికి ప్రదక్షిణ చేయాలి.



మళ్ళీ ధ్వజ స్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేయాలి. ధ్వజస్తంభం, బలిపీఠం, నంది దగ్గర ఎదురుగా నిలబడి, స్తోత్రం చేసి, ఆలయంలో ప్రవేశించాలి. మొదట వినాయకుణ్ణి దర్శించుకొని... మూడుసార్లు గుంజిళ్ళు తీయాలి. అనంతరం ఆలయంలోని మూలస్థాన మూర్తి ముందు నిలబడి, రెండు చేతులూ జోడించి, నమస్కరించి, పంచాక్షరి మంత్రాన్ని (ఓం నమఃశివాయ) పఠిస్తూ, తమకు వచ్చిన స్తోత్రాలను చదువుతూ దర్శనం చేసుకోవాలి. ఆ తరువాత ఆలయంలోని అమ్మవారి సన్నిధికి వెళ్ళి... దేవీ స్తోత్రాలు పారాయణ చేస్తూ నమస్కారం చేయాలి. అలాగే ఉత్సవ విగ్రహాలను దర్శించి, రెండో ప్రదక్షిణ చేయాలి. తరువాత నటరాజ స్వామిని, శివకామసుందరి అమ్మవార్లను, ప్రాకారంలోని ఇతర పరివార దేవతలను దర్శించి, నమస్కరించుకోవాలి. తరువాత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకొని, నవగ్రహ సన్నిధికి వెళ్ళాలి. అక్కడ ఒకసారి లేదా మూడుసార్లు ప్రదక్షిణలు చేయాలి. చివరిగా... ఆలయానికి మూడో సారి ప్రదక్షిణ చేయాలి. మూడోసారి ప్రదక్షిణ చేసేటప్పుడు... దక్షిణామూర్తి సన్నిధిని, దుర్గా సన్నిధిని, చివరిగా చండీశ్వరుణ్ణి దర్శించాలి. చండీశ్వరుడు మానవునిగా జన్మించి, పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకొని, శివ నిర్మాల్యానికి అధిపతి అయ్యాడు. భక్తి మార్గంలో పరమేశ్వర సాయుజ్యం పొందాడు. ఆయన విగ్రహానికి నమస్కరించి... "ఈ దర్శన క్రమంలో ఏదైనా తప్పు ఉంటే క్షమించి, దర్శన ఫలితాన్ని ఇవ్వు" అని ప్రార్థించాలి. చివరిగా ధ్వజస్తంభం దగ్గరకు వచ్చి, మరోసారి సాష్టాంగ నమస్కారం చేయాలి. అక్కడ కూర్చొని శివనామ జపం చేయాలి. తరువాత కాసేపు కన్నులు మూసుకొని... ఆలయంలో దర్శించిన మూర్తులను గుర్తుకు తెచ్చుకొని నమస్కరించాలి. శివ నామ ధ్యానంతో ఇంటికి బయలుదేరాలి.

అలా చేస్తే సత్ఫలితాలు

ఆలయంలో స్వామిని పాదాల నుంచి కిరీటం వరకూ... దిగువ నుంచి పైకి చూస్తూ దర్శనం చేసుకోవాలి. 'ధూళిదర్శనం దుఃఖనాశనం, పాదదర్శనం పాపనాశనం, శిఖరదర్శనం చింతనాశనం, కటిదర్శనం కర్మనాశనం, కంఠదర్శనం వైకుంఠ సాధనం, ముఖదర్శనం ముక్తిదాయకం, కిరీటదర్శనం కీర్తిదాయకం సర్వాంగ దర్శనం సర్వపాపవిమోచనం' అంటూ భగవంతుణ్ణి, ఆయన అవయవాలను దర్శిస్తే కలిగే ఫలితం గురించి 'తీర్థ క్షేత్ర మహిమ' గ్రంథం వివరించింది. 'ధూళి దర్శనం' అంటే మనం యాత్రకు బయలుదేరిన తరువాత ఆ క్షేత్రాన్ని చేరుకున్నాక... కాళ్ళు, చేతులు కడుక్కోవడం లాంటివి ఏవీ చేయకుండా... నేరుగా ఆలయంలోకి వెళ్ళి స్వామిని దర్శించడం. ఇది వినడానికి కొంత వింతగా అనిపించినా మన పూర్వీకులు దీన్ని సంప్రదాయంగా అనుసరించారు. దీనికి కారణం ఏమిటంటే... తీర్థయాత్ర ప్రారంభించినప్పటి నుంచి యాత్రికులు నియమ నిష్ఠలను, ఆహార నియమాలను పాటిస్తూ ఆ క్షేత్రానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రవేశించి, ధ్వజస్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేసినప్పుడు... ఆ ఆలయంలోని పరమ భక్తుల పాదధూళి, ఆలయంలోని దివ్యత్వం అతణ్ణి పవిత్రుణ్ణి చేస్తాయి. అప్పుడు స్వామిని దర్శించుకొనే అర్హత అతనికి కలుగుతుంది. ధూళి దర్శనం దుఃఖాలను హరింపజేస్తుంది. శ్రీశైల క్షేత్రంలో ఈ ధూళి దర్శన సంప్రదాయం ఉంది. ఇక... ఆలయానికి చేరిన భక్తుడు ముందుగా విమాన శిఖరాన్ని దర్శించాలి. అది అతని చింతలను తీరుస్తుంది. దూరం నుంచి విమాన శిఖరాన్ని చూసినంత మాత్రాన సర్వపాపాల నుంచి విముక్తుడు అవుతాడు. అలాగే ఆలయంలో స్వామివారి వివిధ అవయవాలను దర్శించడం ద్వారా అనేక సత్ఫలితాలను భక్తులు పొందుతారు. కాగా ఆలయ విమానం నీడను దాటడం, తొక్కడం దోషం. బలి పీఠం దగ్గర తప్ప మరెక్కడా సాష్టాంగ నమస్కారం చేయకూడదు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

సహజయోగ

శివతత్త్వం అంటే శివుణ్ణి చేరుకొనే గమ్యం. ఆ తత్త్వాన్ని సాధించాలంటే... మనం పయనించాల్సింది మధ్యస్థమైన విష్ణు మార్గంలో, అంటే సుషుమ్నా మార్గంలో. దానినే 'సోపాన మార్గం' అంటారు. అది సాధించాలంటే ఆ మార్గంలో ఉన్న ఆరు శక్తి కేంద్రాలు శుభ్రపడి, శక్తిని సంతరించు కోవాలి. అప్పుడే మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతాం.

హృదయాన్ని శుభ్రపరుచుకుందాం!

ప్రతికూలతలు తొలగాలి

సర్వశక్తిమంతుడైన సదాశివుడు మనహృదయంలో ఆత్మ స్వరూపునిగా కొలువై ఉన్నాడు. ఆయన సర్వ స్వతంత్రుడు, నిరంతరంగా, శాశ్వతంగా ఉండేవాడు. శివుని నివాస స్థానం అన్నిటికీ అతీతంగా... అంటే మన బుద్ధికన్నా, ఆలోచనలకన్నా ఉన్నతంగా ఉంటుంది. మనం శివతత్త్వాన్ని సంతరించుకోవాలంటే ముందుగా హృదయ పవిత్రతపై దృష్టి పెట్టాలి. మన హృదయంలో ఈర్ష్యకూ, దుష్ట ఆలోచనలకు తావు ఉండకూడదు. సంబంధిత శక్తికేంద్రాలు శుభ్రపడాలి. అప్పుడే అది సాధ్యమవుతుంది. 'మనల్ని మనం తెలుసుకోవడం' అంటే... మన ఆత్మను తెలుసుకోవడం. దాని కోసం శివుణ్ణి ఆరాధించాలి. 'మనం ఆత్మ స్వరూపులం' అని గ్రహించాలి.. హృదయం స్వచ్ఛంగా ఉన్నట్టయితే... మనలోని ఆత్మ... పరిశుభ్రమైన అద్దంలా ఉంటుంది. దాని మీద భగవంతుడి ప్రతిబింబం స్పష్టంగా ఉంటుంది. హృదయం ఈర్షతో, ద్వేషంతో నిండినట్టయితే... ఆ ప్రతిబింబం మసకబారుతుంది. మనం పూజ చేయడానికి ముందు స్నానం చేస్తాం. కానీ శుభ్రపరుచుకోవాల్సింది మన హృదయాన్ని. అందుకోసం మనలో అంతర్గతంగా ఉన్న ప్రతికూలతలను, మన పురోగతిని ఆటంకపరుస్తున్న అరిషడ్వర్గాలను తొలగించుకోవాలి. స్వచ్ఛమైన హృదయం ఉన్నప్పుడే భక్తి సాధ్యపడుతుంది.



ఆ గుణాల జాగృతి కోసం...

శివతత్త్వాన్ని సాధించాలంటే... చిన్న చిన్న విషయాల్లో చిక్కుకుపోకూడదు. శివుడి నుంచి ప్రేమ ప్రవాహం సదా వెలువడుతూనే ఉంటుంది. అందులో మనకు స్థానం ఉండాలంటే... అర్థం లేని విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు. అప్పుడే మన చిత్తం ఆత్మ స్థానమైన హృదయంపైకి మళ్ళుతుంది. ఆత్మ ప్రకాశవంతం అవుతుంది. మనలోని లోపాలు తెలుస్తాయి. మాట్లాడే ప్రతి మాట హృదయం నుంచి వస్తుంది. సత్ప్రవర్తన పరిధులను అతిక్రమించకుండా ఉంటాం. సంపూర్ణ సంతృప్తితో జీవిస్తాం. మనలోని శక్తిని అసూయ, మోహం, శత్రుత్వం లాంటి ఉపయోగంలేని విషయాలతో వృథా చేసుకోకూడదు. అలాగైతేనే మనలోని ఆత్మ మన స్వభావంలో, వ్యక్తిత్వంలో, ప్రవర్తనలో ప్రకాశిస్తుంది. సహజయోగ సాధన ద్వారా మనలోని శివతత్త్వం జాగృతం చేసుకున్నప్పుడు... మనలోని సూక్ష్మమైన గొప్ప గుణాలు జాగృతం అవుతాయి. ఈ కార్తిక మాసం శివుణ్ణి, విష్ణువును ఆరాధించడానికి ఎంతో అనువైన కాలం.




డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

మహా దార్శనికుడు

ఏసు క్రీస్తు శిష్యులలో ప్రముఖుడు యోహాను (జాన్). ఆయనను ఏసుకు ప్రియశిష్యుడిగా పరిగణిస్తారు. ఏసు శిష్యులందరిలో అతను చిన్నవాడు కావడం, ప్రభువును, ప్రభువు కుటుంబాన్ని అత్యంత విశ్వాసంతో, ప్రేమతో అంటిపెట్టుకొని ఉండడం దీనికి కారణాలు కావచ్చు. యోహాను... నలుగురు సువార్తికులలో ఒకరు మాత్రమే కాదు... 'నూతన నిబంధన'లోని చిట్టచివరి 'దర్శన గ్రంథ' రచయిత కూడా. క్రీస్తు జీవితంలోని అన్ని సందర్భాలలో పాలు పంచుకున్న వ్యక్తిగా అతను కనిపిస్తాడు. క్రీస్తు సాక్షాత్తూ దేవుడనీ, మానవుడిగా భూమిపై సంచరిస్తున్నాడని యోహాను గట్టిగా విశ్వసించాడు. అతని సువార్తకు ఈ అంశమే ప్రధాన సూత్రం అయింది. యోహాను మహా దార్శనికుడు. అతని ఊహా సౌందర్యం అత్యద్భుతమైనది. పరలోకాన్ని, పరలోకాధిపతి అయిన ఏసు రాకడను, దానికోసం మానవాళి తీసుకోవలసిన జాగ్రత్తలను, సిద్ధపడవలసిన అంశాలను ఆయన దర్శించాడు. అదే నూతన నిబంధన గ్రంథాలన్నిటిలో అమృతప్రాయమైన, అద్భుతమైన భావాలతో నిండిన 'దర్శన గ్రంథం' అయింది. యోహాను సువార్త 21 అధ్యాయాల గ్రంథం కాగా... దర్శన గ్రంథంలో 22 అధ్యాయాలు ఉన్నాయి. బైబిలు మొత్తాన్ని ఆధ్యాత్మిక కోణంలో... ఆద్యంతం భావనాపరంగానూ, మరెన్నో విశేషాలతోనూ ప్రకటించింది కాబట్టి... దర్శన గ్రంథానికి 'ప్రకటన గ్రంథం' అనే మరో పేరు కూడా ఉంది. యోహాను తన గ్రంథాన్ని కోయినె గ్రీకు భాషలోనే రాశాడు.



అది ప్రభువు మాట్లాడే అరమయిక్ భాషలోంచి కానీ, గ్రీకు నుంచి కానీ తర్జుమా అయినది కాదు. ఏసు ప్రభువును 'ఆదియందలి వాక్కు'గా యోహాను అభివర్ణించాడు. ఆ వాక్కే శరీరాన్ని ధరించి, మనుషుల మధ్య సంచరిస్తోందని పేర్కొన్నాడు. ఒక పేద ఇంట్లోని పెళ్ళి విందులో... నీటిని ద్రాక్ష రసంగా ఏసు మార్చిన వైనం మొదలుకొని... ఏసు మరణం, పునరుత్థానం వరకూ... ఎన్నో అద్భుతాలను తన గ్రంథంలో యోహాను పొందుపరిచాడు. యోహాను చిహ్నం 'ఎగురుతున్న గ్రద్ద' అని 'యెహెజ్కేలు గ్రంథం' పేర్కొంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్ 9866755024

గూగుల్ డేటా సెంటర్‌ను స్వాగతిస్తున్నా

డేటా సెంటర్‌తో ఎకో సిస్టమ్ ఏర్పడుతుంది

పర్యావరణానికి ముప్పు ఉండదు: జగన్

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటును మాజీ సీఎం జగన్ ఎట్టకేలకు స్వాగతించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని క్యాంపు కార్యాలయంలో సానుకూల మీడియా ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడు నడుస్తున్నదేగాక రాబోయేది కూడా క్వాంటమ్ ఏఐ యుగమేనని తెలిపారు. ఇటువంటి సమయంలో రాష్ట్రానికి డేటా సెంటర్లు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని, ఈ సెంటర్ల వల్ల ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని వస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. తామెప్పుడూ గూగుల్ డేటా సెంటర్‌ను వ్యతిరేకించలేదన్న ఆయన, డేటా సెంటర్‌ను తమ హయాంలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. డేటాసెంటర్‌ను అదానీ గ్రూపు నిర్మిస్తుందని, ఆ తర్వాత గూగుల్ ఇక్కడకు వస్తుందని తెలిపారు. తానే డేటా సెంటరును తెచ్చినట్లుగా సీఎం చంద్రబాబు చెబుతుండటం సరికాదని, అదానీకి ఆయన కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పలేదని విమర్శించారు. "2023 మే3వ తేదీన అదానీ డేటా సెంటర్‌కు విశాఖలో శంకుస్థాపన చేశాం. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌ను సింగపూర్ నుంచి తీసుకువచ్చే కార్యక్రమానికి కూడా అప్పుడే అంకురార్పణ జరిగింది" అని తెలిపారు.

మనిషిని బట్టే మందు!

జబ్బును బట్టి అందరికీ ఒకే మెడిసిన్ సరికాదు

- **అందుకు వీలు కల్పించేలా ఫార్మకోజినోమిక్స్ టెస్టు**
- **ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డి. నాగేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికి తీవ్ర విష జ్వరం వచ్చింది. ఓ వైద్యుడి దగ్గరికి వెళితే వారికి ఒకే రకమైన మందులను, ఒకే మోతాదులో సూచించారు. అవి వాడితే ఒకరి వేగంగా కోలుకుంటే.. మరొకరిలో ఏమాత్రం ప్రయోజనం కనిపించలేదు. వేర్వేరు వ్యక్తుల శరీరతత్వం వేర్వేరుగా ఉండటం, ఆయా మందులకు వేర్వేరుగా స్పందించడమే దానికి కారణం. అలా కాకుండా రోగి శరీరతత్వానికి అనుగుణంగా ఏ మందు, ఎంత మోతాదులో, ఎన్నిసార్లు ఇవ్వాలని నిర్ణయించడమే ప్రెసిషన్/పర్సనలైజ్డ్ మెడిసిన్. ఇలా కచ్చితత్వంతో మందులు సూచించడానికి తోడ్పడేదే 'ఫార్మకోజినోమిక్స్' పరీక్ష. వ్యక్తుల శారీరక పరిస్థితి, జన్యుక్రమాన్ని పరిశీలించి, పూర్తిస్థాయిలో విశ్లేషించే ఈ అత్యాధునిక పరీక్ష ఏఐజీ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చినట్టు ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఫార్మకోజినోమిక్స్ పరీక్ష, ప్రయోజనాలపై ఆయన గురువారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఔషధాలకు ప్రతి వ్యక్తి శరీరం భిన్నంగా స్పందిస్తుందని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఒకరికి బాగా పనిచేసే మందు మరొకరికి ఫలించకపోవచ్చు, ఒక్కోసారి హానికరం కూడా కావొచ్చని చెప్పారు. ఈ అంశానికి సంబంధించి ఏఐజీ ఆస్పత్రిలో డాక్టర్ కల్యాణ్ ఉప్పలూరి, డాక్టర్ ఉష ఆధ్వర్యంలో 2వేల మందిపై అధ్యయనం చేశామని వెల్లడించారు. సాధారణంగా ఇచ్చే మందులు ప్రతి 100 మందిలో 70-80 మందికి పనిచేస్తే.. మిగతా 20-30 మందిలో అంతగా ప్రభావం చూపడం లేదని గుర్తించామని తెలిపారు. గుండె జబ్బు బాధితులకు రక్తనాళాల్లో అడ్డంకుల నియంత్రణ కోసం మందులు ఇస్తే.. కొందరిలో తగ్గకపోగా, తిరిగి గుండెపోటుతో ఆస్పత్రిలో చేరుతున్నారని నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ప్రతీ ముగ్గురిలో ఒకరు తమ జన్యునిర్మాణానికి అనువుగాలేని మందులు తీసుకుంటున్నారని.. ఇది రోగి భద్రత, వైద్య ఖర్చులపై ప్రభావం చూపుతుందని తమ అధ్యయనంలో తేలిందని వివరించారు. సాయంతో ఎవరికి ఏ మందులు, ఏ మోతాదులో అవసరమో అంతే వినియోగించవచ్చని వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రెసిషన్ మెడిసిన్ వైపు పరిశోధన చేశామని తెలిపారు.

తక్కువ ధరలో పరీక్ష అందుబాటులోకి..

వైద్య రంగానికి చెందిన ఏఐ సంస్థ 'జీన్‌పవర్ ఎక్స్'తో కలిసి.. ప్రతి వ్యక్తి శరీరతత్వం, జన్యుక్రమం ఆధారంగా కచ్చితత్వంతో మందులు సూచించేందుకు వీలుకల్పించే 'ఫార్మకోజినోమిక్స్' పరీక్షను ప్రారంభించామని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. తమ ఆస్పత్రిలో చేసే ఫార్మకోజినోమిక్స్ టెస్టు వ్యక్తి జన్యుక్రమాన్ని కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో విశ్లేషించి.. గుండె వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్, జీర్ణాశయ సంబంధ వ్యాధులు, నాడీ వ్యవస్థ సమస్యలు, మానసిక రుగ్మతలు, నొప్పి నియంత్రణ కోసం ఉపయోగించే మందులకు వారి శరీరం ఎలా స్పందిస్తుందో అంచనా వేస్తుందని చెప్పారు. పరీక్షలో వెల్లడైన అంశాలతో ప్రత్యేకమైన నివేదికను ఇస్తామని తెలిపారు. దీనిని ఒకసారి చేయించుకుంటే జీవితాంతం వినియోగించుకోవచ్చని వెల్లడించారు. ఏ దేశంలోనైనా, ఏ వైద్యుడికైనా ఈ నివేదికను చూపి కచ్చితమైన మందులు పొందవచ్చని తెలిపారు. పశ్చిమ దేశాల్లో ఇలాంటి జెనొమిక్ పరీక్ష కోసం రూ.80 వేల వరకు తీసుకుంటారని.. ఏఐజీలో కేవలం రూ.5 వేలకే అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. తమ ఆస్పత్రికి వచ్చే ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్లకు ఈ పరీక్ష చేస్తామని తెలిపారు.

భారతీయులకు చెడ్డపేరొస్తోంది!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. కొందరి విపరీత పోకడల వల్ల భారతీయులదరూ అపఖ్యాతిని మూటగట్టుకోవాల్సి వస్తోందని చెప్పారు. తోటకూర ప్రసాద్ ఆధ్వర్యంలో డాలస్‌లో 'ప్రవాస భారతీయ అవగాహనా సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక చట్టాలు, నియమనిబంధనలు, సాంస్కృతిక విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ఎలా జీవించాలన్న అంశంపై చర్చించారు. విభిన్న సంస్కృతులు, భాషలు, మతాల ప్రజలు నివసించే అమెరికాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రవాస భారతీయుల ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని వక్తలు వాపోయారు. అమెరికా చట్టాల ప్రకారం అనుమతులు లేకుండా వీధుల్లో ఉత్సవాలు జరుపుకోవడం, బాణాసంచా కాల్చడం, లౌడ్‌స్పీకర్లు వినియోగించడం ప్రమాదకరమని చెప్పారు. రహదారులు మూసివేసి జరిపిన ఉత్సవాల వల్ల ఒక అమెరికన్ డ్రైవర్ తుపాకీతో బెదిరించిన ఘటనను ఉదహరించారు. ఇలాంటి వేడుకలు ఆలయ ప్రాంగణాలు లేదా ఖాళీ స్థలాల్లోనే చేసుకోవాలని కోరారు. ఇరుదేశాల జాతీయ జెండాలకు సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు. వినోదానికి పరిమితం కావాల్సిన సినిమా థియేటర్ల వద్ద పాలతో అభిషేకాలు, ఈలలు, డ్యాన్సులు వంటి విపరీత చేష్టల వల్ల అమెరికన్లు మనల్ని చిన్నచూపు చూస్తారని.. ఇలాంటి ఘటనలు ప్రవాస భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. రాజకీయ నాయకుల అమెరికా పర్యటనల సందర్భంగా కార్ల ర్యాలీలు, నినాదాలు, హోటళ్ల వద్ద గోల చేయడం సరికాదని వక్తలు సూచించారు. ఇలా చేస్తే స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అమెరికన్లతో స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపర్చుకోవాలని చెప్పారు. డల్లా‌స్‌ను డల్లాస్‌పురమని, గంటర్‌ను గుంటూరు అని, క్యారల్టన్‌ను కేరళటౌన్ అని పేర్కొనడం వల్ల అమెరికన్ల దృష్టిలో భారతీయులంటే చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. దుకాణాల్లో దొంగతనాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ స్థలాల్లో బిగ్గరగా మాట్లాడడం వంటి పనులతో చెడ్డపేరు వస్తుందని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా రాజకీయ విమర్శలు, అనుచిత పోస్టులు అమెరికన్ అధికారుల దృష్టికి వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అమెరికాలో నివసిస్తున్న యువతకు తల్లిదండ్రులు, పెద్దలు మార్గనిర్దేశం చేయాలన్నారు. వారికి అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

చిరంజీవి వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు భంగం కలిగించొద్దు

● కోర్టు ఆదేశం

చిరంజీవికి సిటీ సివిల్ కోర్టులో ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఫొటోలు, బిరుదులు వాడుకోవడాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు రక్షణ కల్పిస్తూ జడ్జి ఎస్.శశిధర్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. ఆన్‌లైన్ దుస్తుల సంస్థలు, డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లు సహా ఏ సంస్థ కూడా చిరంజీవి పేరు, 'మెగాస్టార్', 'చిరు' వంటి బిరుదులు, ఆయన ఫొటోలు, వాయిస్‌ను వ్యాపార ప్రకటనల కోసం వినియోగించకూడదు. పలు సంస్థలు అనుమతి లేకుండా తన గుర్తింపును వాడుకుంటూ వాణిజ్యపరంగా లబ్ధి పొందుతున్నాయని చిరంజీవి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన కోర్టు తక్షణమే ఉల్లంఘనలను ఆపాలని ఆదేశిస్తూ స్టే మంజూరు చేసింది. తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.



ఒకే ఫ్రేమ్‌లో... వెంకీ, చిరు


టాలీవుడ్ దిగ్గజాలు చిరంజీవి, వెంకటేశ్ కలసి ఒక సినిమా చేస్తే చూడాలనేది ఎన్నాళ్లగానో వారిద్దరి అభిమానుల కల. ఒకే ఫ్రేమ్‌లో వారిద్దరూ కలసి కనిపించే ఆ తరుణం ఆసన్నమైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంలో వెంకటేశ్ కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. గురువారం వెంకటేశ్ ఈ చిత్రం సెట్స్‌లోకి అడుగుపెట్టారు. వారిద్దరిపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన వీడియోలో వెంకటేశ్‌కు చిరంజీవి స్వాగతం చెబుతుండగా, ఆయన్ను వెంకటేశ్ ఆత్మీయంగా హత్తుకున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. ఇందులో చిరంజీవి పాత్రచిత్రణ నవ్యపంథాలో ఉండబోతోంది. ఆయనకు జోడీగా నయనతార నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.

అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ



ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు తీపి కబురు అందింది. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రభాస్, హను రాఘవపూడి సినిమా టైటిల్‌ను 'ఫౌజీ'గా మేకర్స్ ప్రకటించారు. ఈ టైటిల్ చిత్రం ప్రారంభమైన నాటి నుంచి ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మేకర్స్ ప్రభాస్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. 'పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడు.. పాండవుల పక్షాల నిలిచిన కర్ణుడు.. గురువులేని ఏకలవ్యుడు.. పుట్టుకతోనే అతను ఓ యోధుడు.. మన చరిత్రలో దాగిన అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ ఇది' అని పేర్కొన్నారు. ఇమాన్వీ కథానాయిక. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు.

సినిమాను పండుగలా...



'సినిమాను పండుగలా మార్చే వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు' అని 'రాజాసాబ్' చిత్రబృందం ప్రభాస్‌కు విషెస్ తెలిపింది. ఈ సందర్భంగా ఓ స్టైలిష్ పిక్‌ను విడుదల చేసింది. ఇందులో చుట్టూ జన సమూహం మధ్యలో ఓపెన్ టాప్ కారులో ప్రభాస్ ఇస్తున్న పోజు ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆయన కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ హారర్ కామెడీ థ్రిల్లర్‌ను నిర్మిస్తున్నారు. మరోవైపు, ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం.



డబుల్ సెలబ్రేషన్

● కవలలకు జన్మనివ్వనున్న రామ్‌చరణ్ ఉపాసన దంపతులు



రామ్‌చరణ్-ఉపాసన దంపతులు అభిమానులకు శుభవార్త చెప్పారు. వారిద్దరూ రెండోసారి తల్లిదండ్రుల వబోతున్నారు. ఈసారి ఉపాసన కవలలకు జన్మనివ్వబోతున్నారు. ఈ విషయాన్ని గురువారం వారి పీఆర్ టీమ్ ధ్రువీకరించింది. అలాగే తన సీమంతం వేడుక వీడియోను షేర్ చేసిన ఉపాసన మరోసారి తల్లి కాబోతున్న ఆనందాన్ని పంచుకున్నారు. 'ఈ దీపావళి మా ఇంట ఆనందాన్ని రెండింతలు చేసింది, రెట్టింపు ఆశీర్వచనాలు అందాయి' అని ఆనందం వ్యక్తం చేశారు. దీపావళి రోజున చిరంజీవి తన నివాసంలో నిర్వహించిన పండుగ వేడుకలకు మెగా కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు, పలువురు సినీ నటులు హాజరయ్యారు. అప్పుడే ఉపాసన సీమంతం వేడుకలను చిరంజీవి ఘనంగా నిర్వహించినట్లు తెలుస్తోంది. 2023లో ఉపాసన తొలికాన్పులో పాప క్లీంకారాకు జన్మనిచ్చారు.



శ్రీవిష్ణుకు జోడీగా...



విభిన్నమైన కథాంశాలను ఎంపిక చేసుకుంటూ తన ప్రతీ సినిమాతో ప్రేక్షకులకు గొప్ప వినోదాన్ని అందిస్తున్నారు కథానాయకుడు శ్రీవిష్ణు. ప్రస్తుతం ఆయన హీరోగా కొత్త దర్శకుడు యధునాథ్ మారుతీరావు 'ఎస్ఎస్‌సీ నంబర్ 3' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బేనర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీవిష్ణు సరసన నయన్ సారిక కథానాయికగా నటించనున్నట్లు దర్శకనిర్మాతలు ప్రకటించారు. గురువారం నయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ చిత్ర యూనిట్ ఓ ప్రత్యేక వీడియోని విడుదల చేసింది. ఒంగోలు పట్టణం నేపథ్యంలో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అంచనాలు రెట్టింపు



సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'త్రిముఖ'. రాజేశ్ నాయుడు దర్శకత్వంలో అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బేనర్‌పై శ్రీదేవి మద్దాలి, రమేశ్ మద్దాలి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన చిత్ర టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. నెట్టింట ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. దీంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'త్రిముఖ' సినిమా పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న అద్భుతమైన ప్రేమతో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం. ఇది మా కష్టానికి నిదర్శనం. మంచి కంటెంట్‌కు ఆదరణ ఎప్పుడూ ఉంటుందని మరోసారి రుజువవుతోంది' అని చిత్రబృందం పేర్కొంది.

కుటుంబ కథా చిత్రం



కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో పి.అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. డీఎస్ గౌడ్ సమర్పిస్తున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌కే గౌడ్ మాట్లాడుతూ 'ఇదొక అందమైన కుటుంబ కథా చిత్రం. త్వరలోనే ఓ ప్రత్యేక పాటను చిత్రీకరించనున్నాం. ఒక మనిషి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే మంచి పాయింట్‌తో మీ ముందుకు తెస్తున్నాం' అని అన్నారు. అక్స ఖాన్, తులసి, అనూష, కీర్తన కీలక పాత్రలు పోషిస్తున్నారు.





బిజినెస్

ఇక బ్యాంకు ఖాతాలకు
నలుగురు నామినీలు

లాకర్లకూ ఇదే నిబంధన ● నవంబరు 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక ఒక్కో బ్యాంకు ఖాతాపై డిపాజిటర్లు నలుగురి వరకు తన నామినీలుగా నామినేట్ చేయవచ్చు. సవరించిన ఈ నిబంధనలు నవంబరు 1 నుంచే అమల్లోకి వస్తాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. డిపాజిటర్లు ఈ నామినీల పేర్లను ఒకేసారి లేదా దఫదఫాలుగా పేర్కొనవచ్చు. అలాగే తన తదనంతరం బ్యాంకులోని తన డిపాజిట్‌లో ఏ నామినీకి ఎంత? లేదా ఎంత శాతం ఇవ్వాలో కూడా పేర్కొనవచ్చు. బ్యాంకు లాకర్లకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త నిబంధనలతో డిపాజిటర్ల తదనంతరం సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత సులభం అవుతుందని భావిస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులు అదుర్స్

దేశంలో డిజిటల్ చెల్లింపులు శరవేగంతో విస్తరిస్తున్నాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్ల విలువైన 3,248 కోట్ల లావాదేవీలు నమోదవగా, గత ఏడాది (2024) మొత్తం మీద రూ.2,830 లక్షల కోట్ల విలువైన 20,849 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. శాతంపరంగా చూస్తే గత ఏడాది నమోదైన మొత్తం చెల్లింపుల లావాదేవీల్లో 99.7 శాతం డిజిటల్ చెల్లింపులని ఆర్‌బీఐ తెలిపింది. విలువపరంగా చూసినా ఈ చెల్లింపుల వాటా మొత్తం చెల్లింపుల్లో 97.5 శాతం వరకు ఉంది. కాగా ఈ ఏడాది (2025) తొలి ఆరు నెలల్లోనూ ఇదే పరిస్థితి. నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్, ఎన్‌ఏసీహెచ్, డెబిట్, క్రెడిట్ కార్డ్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, యూపీఐ వంటి చెల్లింపులన్నీ డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి వస్తాయి. వ్యాపార, వ్యక్తిగత చెల్లింపుల్లో డిజిటల్ లావాదేవీలు శరవేగంతో పెరుగుతుంటే, పేపర్ ఆధారిత చెక్కుల చెల్లింపుల వాటా ఇదే సమయంలో మొత్తం చెల్లింపుల్లో 2.3 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనూ దేశంలో రూ.1,572 లక్షల కోట్ల విలువైన 12,549 కోట్ల డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు నమోదయ్యాయి.

చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా బాలారిష్టాలు: ఎన్‌పీసీఐ

ఈ నెల 4వ తేదీ నుంచి ప్రవేశపెట్టిన సత్వర చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా కొన్ని బాలారిష్టాలు కొనసాగుతున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. వీటిని కూడా అధిగమించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. గతంలో చెక్కుల క్లియరెన్స్‌కు రెండు మూడు రోజుల సమయం పట్టేది. చెక్ ప్రజెంట్ చేసిన కొన్ని గంటల్లో అదే రోజు క్లియర్ చేసేలా చెక్ ట్రంకేటెడ్ సిస్టమ్ (సీటీసీ) పేరుతో ఆర్‌బీఐ ఈ నెల 4వ తేదీ నుంచి కొత్త విధానం ప్రవేశ పెట్టింది. అయితే సాంకేతిక సమస్యలు, బ్యాంకు సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో చెక్కుల క్లియరెన్స్‌కు ఐదారు రోజులు పడుతోంది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం.

అదరగొట్టిన లారస్ ల్యాబ్స్
క్యూ2 లాభంలో 875% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికాని (క్యూ2)కి గాను కంపెనీ రూ.1,653 కోట్ల రెవెన్యూపై రూ.195 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.20 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 875 శాతం వృద్ధి చెందగా ఆదాయం 35 శాతం వృద్ధి చెందింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) విభాగం అద్భుతమైన పనితీరు కనబరచటం సహా జెనరిక్స్‌లో మెరుగైన వృద్ధి కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా వెల్లడించారు.

ఎలీ లిల్లీతో సిప్లా జట్టు

న్యూఢిల్లీ: టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సలో ఉపయోగించే ఔషధం టిర్జెపటైడ్‌ను 'యుర్పీక్' బ్రాండ్‌నేమ్‌తో భారత్‌లో విక్రయించేందుకు అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీతో దేశీయ ఔషధ సంస్థ సిప్లా ఒప్పందం కుదుర్చుకుంది. ఎలీ లిల్లీ టిర్జెపటైడ్ ఔషధాన్ని మౌంజారో పేరుతో ఈ ఏడాది మార్చిలోనే భారత్‌లో ప్రవేశపెట్టింది. అయితే, దేశంలో ఈ ఔషధ లభ్యతను నగరాల పరిధి దాటి విస్తరించేందుకు మరో బ్రాండ్‌నేమ్ (యుర్పీక్)తోనూ విక్రయించేందుకు ఎలి లిల్లీ, సిప్లా జట్టు కట్టాయి. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా ఎలీ లిల్లీ యుర్పీక్‌ను తయారు చేసి సిప్లాకు సరఫరా చేస్తుంది. సిప్లా ఈ ఔషధాన్ని మార్కెట్లో విక్రయిస్తుంది. దీన్ని కూడా మౌంజారో ధరకే విక్రయించనున్నట్లు ఇరు కంపెనీలు స్పష్టం చేశాయి. భారత్‌లో ఇది రెండో టిర్జెపటైడ్ బ్రాండ్.

పసిడి బాండ్లపై 325% రిటర్నులు

2017-18 ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడతగా జారీ చేసిన ప్రభుత్వ పసిడి బాండ్ల విమోచన తుది ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం ప్రకటించింది. యూనిట్‌కు రూ.2,971 చొప్పున 2017 అక్టోబరు 23న ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేసింది. వీటిని నగదీకరించుకునేవారికి చెల్లించబోయే ధరను యూనిట్‌కు రూ.12,704గా నిర్ణయించింది. అంటే, ఒక్కో యూనిట్‌పై ఇన్వెస్టర్లకు 325% ప్రతిఫలం లభించనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,080 ▼	1,14,650 ▼	1,74,000 ▼
విజయవాడ	1,27,000 ▲	1,20,000 ▲	1,58,000 ▲
విశాఖపట్నం	1,27,340 ▲	1,14,650 ▼	1,74,000 ▼
రాజమండ్రి	1,25,070 ▼	1,14,650 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,26,000 ▼	1,15,920 ▼	1,56,000 ▼
ముంబై	1,23,354 ▼	1,12,992 ▼	1,51,450 ▼

అదానీ గ్రూప్ నుంచి రూ.1,050 కోట్ల ఆర్డర్
బొండాడ ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కి అదానీ గ్రూప్ నుంచి రూ.1,050 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఆర్డర్‌లో భాగంగా గుజరాత్‌లోని ఖావ్డా వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ సిక్స్ కంపెనీలు ఏర్పాటు చేసే 650 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన యంత్ర పరికరాలను బొండాడ ఇంజనీరింగ్.. ఈపీసీ పద్ధతిలో సరఫరా చేస్తుంది. ఆర్డర్ అందుకున్న ఏడాదిలోగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	112	విజయవాడ	121
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	102
కర్నూలు	112	నెల్లూరు	107
విశాఖపట్నం	119	అనంతపురం	107
గోదావరి	121		

ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలోకి ప్రీమియర్ ఎనర్జీస్
ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్‌లో 51% వాటా కొనుగోలు

డీల్ విలువ రూ.500 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్.. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలోకి ప్రవేశించింది. హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్ ఈక్విటీలో 51 శాతం వాటాను చేజిక్కించుకోవటం ద్వారా ఈ విభాగంలోకి అడుగుపెట్టినట్లు వెల్లడించింది. ఈ 51 శాతం వాటాను రూ.500.3 కోట్లకు కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది. కాలుష్య రహిత ఇంధన రంగంలో సమగ్ర కంపెనీగా ఎదిగేందుకు ఈ కొనుగోలు దోహదం చేస్తుందని ప్రీమియర్ ఎనర్జీస్ పేర్కొంది. ట్రాన్స్‌కాన్.. విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేస్తోంది.

పుణె కంపెనీలోనూ వాటా: ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్‌తో పాటు పుణె కేంద్రంగా పని చేసే కేసోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలోనూ ప్రీమియర్ ఎనర్జీస్ రూ.86.7 కోట్లతో 51 శాతం వాటా చేజిక్కించుకుంది. మిగతా 49 శాతం వాటాను సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ రూ.83.3 కోట్లకు కొనుగోలు చేసింది. కాగా కేసోలార్ సంస్థ సోలార్ ఇన్వర్టర్ల తయారీలో ఉంది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	72

ఏడాది గరిష్ఠాల నుంచి కిందికి..

- సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 పైన ట్రేడింగ్ ప్రారంభం
- ఆఖర్లో అమ్మకాల కారణంగా స్వల్ప లాభాల్లో ముగింపు

ముంబై: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశావహంతో పాటు ఐటీ, టెక్ షేర్లలో కొనుగోళ్లతో గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 స్థాయిల ఎగువన ట్రేడైనప్పటికీ, మళ్లీ కిందికి జారి స్వల్పలాభాలతో ముగింపు పలికాయి. ముహూరత్ ట్రేడింగ్ (మంగళవారం) ముగింపు స్థాయితో పోలిస్తే.. 727 పాయింట్ల లాభంతో 85,154 వద్ద ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 863.72 పాయింట్ల వరకు ఎగబాకి 85,290.06 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే, రష్యా ఇంధన దిగ్గజ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై ఆ కంపెనీల నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఇతర షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగారు. దాంతో సెన్సెక్స్ 130.06 పాయింట్ల లాభంతో 84,556.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 26,000 ఎగువన ట్రేడింగ్ ఆరంభించి, ఒక దశలో కొత్త ఏడాది గరిష్ఠ స్థాయి 26,104.20 వద్దకు చేరింది. ప్రాఫిట్ బుకింగ్‌తో మళ్లీ జారిన సూచీ కేవలం 22.80 పాయింట్ల లాభంతో 25,891.40 వద్ద ముగిసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు.

కేవైసీ పూర్తి చేస్తేనే మ్యూచువల్ ఫండ్స్
సెబీ

న్యూఢిల్లీ:మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త ప్రామాణికాలు ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. నో యువర్ క్లయింట్ (కేవైసీ) పూర్తి చేసిన మదుపరులను మాత్రమే ఇక నుంచి మ్యూచువల్ ఫండ్స్ సంస్థల్లో తొలి ఫోలియో (ఖాతా) ప్రారంభానికి అనుమతించాలని ప్రతిపాదించింది. చాలా మంది మదుపరులు కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీల (కేఆర్ఏ) వద్ద కేవైసీ పూర్తి చేయకుండానే ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేస్తున్నట్టు ఇటీవల ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో సెబీ ఈ ప్రతిపాదన తీసుకువచ్చింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) తమకు అందిన మదుపరుల సబ్‌స్క్రిప్షన్ వివరాలను కేఆర్ఏలకు పంపించి నిర్ణయం తీసుకుంటాయి.

ఎన్ఆర్ఐలకూ ఊరట: ఎన్ఆర్ఐ మదుపరులకు జియో ట్యాగింగ్ విధానాన్ని సులభతరం చేయాలని సెబీ ప్రతిపాదించింది. వీడియో క్లయింట్ ఐడెంటిఫికేషన్ (వీ-సీఐపీ) లేదా డిజిటల్ ఆన్‌బోర్డింగ్ పద్ధతిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎన్ఆర్ఐలు కేవైసీ చేసేటప్పుడు భౌతికంగా దగ్గర ఉండాల్సిన అవసరం ఉండదు.

కొన్ని ఉత్పత్తుల ధరలు పెరిగే చాన్స్: హెచ్‌యూఎల్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లు తగ్గినా కొన్ని వస్తువుల రేట్లు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) భావిస్తోంది. ముఖ్యంగా జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావం లేని ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని కంపెనీ సీఎఫ్ఓ రితేష్ తివారీ చెప్పారు. అయితే ఈ పెంపు స్వల్పస్థాయిలోనే ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో తమ అమ్మకాల వృద్ధి రేటులో పెద్దగా ఎదుగూ బొదుగూ లేదన్నారు. అయితే నవంబరు నుంచి అమ్మకాల వృద్ధి రేటు ఊపందుకునే అవకాశం ఉందన్నారు. కాగా సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో హెచ్‌యూఎల్ నికర లాభం 3.8 శాతం పెరిగి రూ.2,694 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.15,703 కోట్ల నుంచి రూ.16,034 కోట్లకు పెరిగింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.19 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

తగ్గిన సాగర్ సిమెంట్స్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సాగర్ సిమెంట్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.44 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.57 కోట్లుగా ఉంది. నిర్వహణపరంగా వ్యయాలు పెరిగిపోవటం పనితీరును దెబ్బతీసిందని కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 27 శాతం వృద్ధితో రూ.475 కోట్ల నుంచి రూ.602 కోట్లకు పెరిగింది. అమ్మకాలపరంగా మంచి పనితీరు కనిపించినప్పటికీ రుతుపవనాల ప్రభావం కొంత మేరకు పడిందని సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నిర్వహణాపరంగా సామర్థ్యాలను పెంచుకోవటంపై దృష్టి పెట్టడం సహా వ్యయ నియంత్రణలను పాటించటం కలిసివచ్చిందని ఆయన పేర్కొన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఇన్‌ఫ్రా, హౌసింగ్, నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకుంటాయని అంచనా వేస్తున్నామని, దీంతో డిమాండ్ కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం అమ్మకాలు 60 లక్షల టన్నులుగా ఉంటాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

అడిలైడ్‌లోనూ అదే తీరు

రెండో వన్డేలో టీమిండియా ఓటమి

ఆసీస్‌దే సిరీస్

రోహిత్, శ్రేయాస్ పోరాటం వృథా
స్పిన్నర్ జంపాకు నాలుగు వికెట్లు

17 ఏళ్లుగా అడిలైడ్‌లో భారత జట్టుకు ఓటమి లేదు.. పైగా ఇక్కడ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన అనుభవం.. అంతేకాకుండా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి అచ్చొచ్చిన మైదానం. ఇన్ని అనుకూలతల మధ్య రెండో వన్డే బరిలోకి దిగిన టీమిండియా కచ్చితంగా నెగ్గి సిరీస్‌లో నిలుస్తుందనుకున్న ఆశలు ఆడియాశలే అయ్యాయి. రోహిత్ ఆకట్టుకున్నా, విరాట్ రెండోసారీ డకౌట్ కాగా.. అటు వరుసగా రెండు విజయాలతో ఆతిథ్య ఆసీస్ జట్టు సిరీస్ కూడా దక్కించుకుంది.



1 విరాట్ కోహ్లీ వన్డే కెరీర్‌లో వరుసగా రెండు సార్లు డకౌట్ కావడం ఇదే తొలిసారి.

2008 తర్వాత అడిలైడ్ మైదానంలో భారత్ వన్డేల్లో ఓడడం ఇదే తొలిసారి.

అడిలైడ్: అత్యంత పటిష్ఠమైన జట్టుతో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియాకు మరో పరాభవం. ఒత్తిడిని అధిగమిస్తూ వెటరన్ స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (73) బ్యాటింగ్‌లో చెలరేగినా.. బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఫలితంగా గురువారం జరిగిన రెండో వన్డేలో ఆసీస్ రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే మూడు వన్డేల ఈ సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం సిడ్నీలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 264 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (61), అక్షర్ పటేల్ (44), హర్షిత్ (24 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ ఆడమ్ జంపాకు నాలుగు, పేసర్లు బార్ట్‌లెట్‌కు మూడు, స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 46.2 ఓవర్లలో 265/8 స్కోరుతో గెలిచింది. షార్ట్ (74), కూపర్ (61 నాటౌట్) అదరగొట్టారు. సుందర్, అర్ష్‌దీప్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆడమ్ జంపా నిలిచాడు.

కూపర్ అజేయంగా..: ఈ పిచ్‌పై 265 పరుగుల ఛేదన కష్టమే అనిపించినా వన్‌డౌన్ బ్యాటర్ మాథ్యూ షార్ట్, మిడిలార్డర్‌లో 22 ఏళ్ల కూపర్ కనోలీ, ఓవెన్ సులువు చేశారు. భారత బౌలర్లు చివర్లో వికెట్లు తీసి ఉత్కంఠ నెలకొల్పినా.. ఛేదనకు పుష్కలంగా బంతులు మిగిలి ఉండడంతో ఆసీస్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు. ఓపెనర్లు హెడ్ (28), మార్ష్ (11) విఫలమయ్యారు. అయితే షార్ట్ మాత్రం రెన్షా (30)తో మూడో వికెట్‌కు 55, కూపర్‌తో ఐదో వికెట్‌కు 55 రన్స్ జోడించి 36వ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత కూపర్ బాధ్యత తీసుకుని హాఫ్ సెంచరీతో అజేయంగా నిలిచాడు. ఓవెన్ సహకారంతో ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించాడు. చివర్లో విజయానికి 34 బంతుల్లో 10 రన్స్ కావాల్సిన వేళ 2 వికెట్లు కోల్పోయినప్పటికీ.. కూపర్ మరో 22 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న రోహిత్-శ్రేయాస్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్కోరు 250 దాటగలిగిందంటే రోహిత్ శర్మ పోరాటమే కారణం. అతడికి శ్రేయాస్ సహకరించడంతో మూడో వికెట్‌కు 118 పరుగులు సమకూరాయి. అయితే ఆరంభంలో రోహిత్ తీవ్రంగా తడబడ్డాడు. తానెదుర్కొన్న తొలి 32 బంతుల్లో కేవలం 8 పరుగులే చేయడంతో పాటు మూడు సార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అటు పేసర్ బార్ట్‌లెట్ ఏడో ఓవర్‌లో కెప్టెన్ గిల్ (8), విరాట్ (0)ల వికెట్లు తీయడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో రోహిత్‌కు శ్రేయాస్ జత కట్టాడు. ఆ తర్వాత రోహిత్ 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లు,



శ్రేయాస్ ఫోర్‌తో 17 రన్స్ రాబట్టారు. ఇదే క్రమంలో ఇద్దరూ తమ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే వీరు స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరగా, అటు స్పిన్నర్ జంపా, హాజెల్‌వుడ్ మధ్య ఓవర్లలో రన్స్‌ను కట్టడి చేశారు. అక్షర్ బౌండరీలతో ఆకట్టుకున్నా మరో ఎండ్ నుంచి సహకారం అందలేదు. ఒకే ఓవర్‌లో అక్షర్, నితీశ్ (8)లను జంపా పెవిలియన్‌కు చేర్చడంతో భారీ స్కోరుపై ప్రభావం పడింది. కానీ తొమ్మిదో వికెట్‌కు హర్షిత్-అర్ష్‌దీప్ (13) జోడీ 37 పరుగులు జత చేయడంతో సవాల్ విసిరే స్కోరందుకుంది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) హాజెల్‌వుడ్ (బి) స్టార్క్ 73, గిల్ (సి) మార్ష్ (బి) బార్ట్‌లెట్ 9, విరాట్ (ఎల్బీ) బార్ట్‌లెట్ 0, శ్రేయాస్ (బి) జంపా 61, అక్షర్ (సి) స్టార్క్ (బి) జంపా 44, రాహుల్ (బి) జంపా 11, సుందర్ (సి) హాజెల్‌వుడ్ (బి)బార్ట్‌లెట్ 12, నితీశ్ (స్టంప్) క్యారీ (బి) జంపా 8, హర్షిత్ (నాటౌట్) 24, అర్ష్‌దీప్ (బి) స్టార్క్ 13, సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 50 ఓవర్లలో 264/9. వికెట్ల పతనం:** 1-17, 2-17, 3-135, 4-160, 5-174, 6-213, 7-223, 8-226, 9-263; **బౌలింగ్:** స్టార్క్ 10-0-62-2, హాజెల్‌వుడ్ 10-2-29-0, బార్ట్‌లెట్ 10-1-39-3, ఓవెన్ 2-0-20-0, జంపా 10-0-60-4, కూపర్ 3-0-11-0, షార్ట్ 3-0-23-0, హెడ్ 2-0-16-0.

ఆస్ట్రేలియా: మార్ష్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 11, హెడ్ (సి) విరాట్ (బి) హర్షిత్ 28, షార్ట్ (సి) సిరాజ్ (బి) హర్షిత్ 74, రెన్షా (బి) అక్షర్ 30, క్యారీ (బి) సుందర్ 9, కూపర్ (నాటౌట్) 61, ఓవెన్ (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 36, బార్ట్‌లెట్ (సి) గిల్ (బి) అర్ష్‌దీప్ 3, స్టార్క్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 4, జంపా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 46.2 ఓవర్లలో 265/8. వికెట్ల పతనం:** 1-30, 2-54, 3-109, 4-132, 5-187, 6-246, 7-255, 8-260; **బౌలింగ్:** సిరాజ్ 10-0-49-1, అర్ష్‌దీప్ 8.2-0-41-2, హర్షిత్ 8-0-59-2, సుందర్ 7-0-37-2, నితీశ్ 3-0-24-0, అక్షర్ 10-0-52-1.

స్పోర్ట్స్

సెమీస్‌కు భారత్

మహిళల వరల్డ్‌కప్

53 పరుగులతో విజయం
- ప్రతీక, మంధాన శతక మోత
- న్యూజిలాండ్ అవుట్



ముంబై: హ్యాట్రిక్ ఓటములతో డీలాపడిన భారత్.. మళ్లీ గెలుపు బాట పట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (95 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), ప్రతీక రావల్ (134 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 122) శతకాల మోతతో భారత్.. ప్రపంచ కప్‌లో సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. గురువారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో భారత్ 53 పరుగుల (డ/లూ పద్ధతి)తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మిగిలిన నాలుగో బెర్త్ హర్మన్‌సేన సొంతమవడంతో.. కివీస్ టోర్నీ నుంచి అవుటైంది. తొలుత భారత్ 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగులు చేసింది. మెగా టోర్నీలో మనకిదే అత్యధిక స్కోరు. జెమీమా రోడ్రిగ్స్ (55 బంతుల్లో 11 ఫోర్లతో 76 నాటౌట్) దూకుడుగా ఆడింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. భారత ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత మరోసారి వరుణుడు పలకరించడంతో డక్‌వర్త్-లూయిస్ పద్ధతిలో కివీస్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 325 రన్స్‌గా సవరించారు. ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 271/8 స్కోరు మాత్రమే చేసింది. హాలిడే (81), గేజ్ (65 నాటౌట్) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. రేణుక, క్రాంతి చెరో 2 వికెట్లు పడగొట్టారు.

నెమ్మదిగా మొదలెట్టి..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ప్రతీక, మంధాన.. తొలి వికెట్‌కు 212 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ఠ పునాది వేశారు. 10 ఓవర్లలో భారత్ 40/0తో నిలిచింది. మంధాన.. జెస్ కెర్ బౌలింగ్‌లో సింగిల్‌తో టోర్నీలో తొలి శతకాన్ని నమోదు చేసింది. కానీ, స్మృతిని అవుట్ చేసి బేట్స్ జట్టుకు తొలి బ్రేక్ అందించింది. ఆ తర్వాత సింగిల్‌తో ప్రతీక శతకం సాధించగా.. జెమీమా బౌండ్రీలతో బౌలర్ల భరతం పట్టింది. కాగా, 43వ ఓవర్‌లో ప్రతీక క్యాచవుటైంది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (10) సహకారంతో ఫిఫ్టీ కొట్టిన రోడ్రిగ్స్.. జట్టు స్కోరును 300 దాటించింది.

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధికంగా 17 శతకాలు సాధించిన మెగ్ లానింగ్ రికార్డును మంధాన సమం చేసింది. కాగా, వన్డేల్లో 14వ సెంచరీ సాధించిన స్మృతి.. లానింగ్ (15 శతకాలు) తర్వాతి స్థానంలో ఉంది.

స్కోరుబోర్డు

భారత్: ప్రతీక (సి/సబ్) రోవ్ (బి) కెర్ 122, మంధాన (సి/సబ్) రోవ్ (బి) బేట్స్ 109, జెమీమా (నాటౌట్) 76, హర్మన్‌ప్రీత్ (సి) కార్సన్ (బి) రోజ్‌మేరీ 10, రిచా ఘోష్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 49 ఓవర్లలో 340/3; వికెట్ల పతనం:** 1-212, 2-288, 3-336; **బౌలింగ్:** రోజ్‌మేరీ మెయిర్ 8-1-52-1, జెస్ కెర్ 8-1-51-0, డివైన్ 6-0-34-0, కార్సన్ 6-0-46-0, తహూహు 4-0-37-0, అమేలియా కెర్ 10-0-69-1, సుజీ బేట్స్ 7-0-40-1.

న్యూజిలాండ్: సుజీ బేట్స్ (సి) ప్రతీక (బి) క్రాంతి 1, ప్లిమ్మర్ (బి) రేణుక 30, అమేలియా కెర్ (సి) మంధాన (బి) రాణా 45, డివైన్ (బి) రేణుక 6, హాలిడే (సి) రాణా (బి) శ్రీచరణి 81, గ్రీన్ (సి) క్రాంతి (బి) ప్రతీక 18, ఇసబెల్లా (నాటౌట్) 65, జెస్ కెర్ (సి) మంధాన (బి) క్రాంతి 18, రోజ్‌మేరీ (సి) మంధాన (బి) దీప్తి 1, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 44 ఓవర్లలో 271/8; వికెట్ల పతనం:** 1-1, 2-51, 3-59, 4-115, 5-154, 6-226, 7-266, 8-271; **బౌలింగ్:** రేణుక 6-0-25-2, క్రాంతి గౌడ్ 9-0-48-2, స్నేహ్ రాణా 8-0-60-1, శ్రీచరణి 9-0-58-1, దీప్తి 8-0-57-1, ప్రతీక 4-0-19-1.

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
శ్రీలంక x పాకిస్థాన్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	6	5	0	1	11	1.704
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఇంగ్లండ్	6	4	1	1	9	1.024
భారత్	6	3	3	0	6	0.628
న్యూజిలాండ్	6	1	3	2	4	-0.490
శ్రీలంక	6	1	3	2	4	-1.035
బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.578
పాకిస్థాన్	6	0	4	2	2	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

దక్షిణాఫ్రికా ఘనవిజయం

- పాక్‌తో సిరీస్ 1-1తో సమం
- స్పిన్నర్ హార్మర్‌కు ఆరు వికెట్లు

రావల్పిండి: పాకిస్థాన్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమమైంది. గురువారం ముగిసిన ఆఖరి, రెండో టెస్టులో స్పిన్నర్ సిమోన్ హార్మర్ ఆరు వికెట్లతో పాక్‌ను దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు హార్మర్ ధాటికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 138 రన్స్‌కే పరిమితమైంది. బాబర్ ఆజమ్ (50), సల్మాన్ (28) రాణించారు. అనంతరం 68 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీలు 12.3 ఓవర్లలో 73/2 స్కోరుతో గెలిచారు. మార్‌క్రమ్ (42) వేగంగా ఆడాడు.

ఉన్నతి కూడా ఇంటికి..
ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్

సెసాన్-సెవిగ్నె (ఫ్రాన్స్): ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో ఉన్నతి 14-21, 11-21తో వాంగ్ జియి (చైనా) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్/రుత్విక 23-21, 8-21, 17-21తో స్థానిక జంట థామ్ గిక్వెల్/డెల్ఫిన్ డెల్రూ చేతిలో ఓటమి పాలైంది.

ప్రపంచ రెజ్లింగ్‌లో ప్రియకు కాంస్యం

నోవి సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ ప్రియ పతకంతో సత్తా చాటింది. మహిళల 76 కిలోల విభాగంలో ప్రియ కాంస్యం సాధించింది. పతకపోరులో ప్రియ 8-1తో జిమెనెజ్ విలాల్బ (మెక్సికో)పై నెగ్గింది. మిగతా రెజ్లర్లలో నిషు (55 కి.), పుల్కిత్ (65 కి.), శ్రిష్టి (68 కి.) కాంస్య పోరుకు అర్హత సాధించారు.

ఆసియా యూత్ గేమ్స్ కబడ్డీలో స్వర్ణాలు

రిఫ్ఫా (బహ్రెయిన్): ఆసియా యూత్ గేమ్స్‌లో భారత కబడ్డీ బాలబాలికల జట్లు స్వర్ణాలు సాధించాయి. బాలుర ఫైనల్లో భారత్ 35-32తో ఇరాన్‌ను ఓడించగా.. బాలికల జట్టు కూడా 75-21తో ఇరాన్‌నే చిత్తుచేసింది. బాలికల 5 వేల మీటర్ల రేస్ వాక్‌లో రంజన రజతం నెగ్గింది. ఇక కురాష్ ఈవెంట్‌లో భారత క్రీడాకారులు ఓ రజతం, రెండు కాంస్యాలు.. తైక్వాండోలో రెండు కాంస్యాలు సాధించారు.

ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీ పెడతా

- ప్రజా సమస్యలపై 'జాగృతి జనం బాట'
- రేపు నిజామాబాద్ నుంచి ప్రారంభం
- 4 నెలల పాటు 33 జిల్లాల్లో పర్యటనలు: కవిత



యాదాద్రి/హైదరాబాద్/కవాడిగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కోరుకుంటే తాను తప్పకుండా రాజకీయ పార్టీని పెడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 25వ తేదీ నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, నిజామాబాద్ జిల్లా నుంచి ఈ యాత్రను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 33 జిల్లాల్లో నాలుగు నెలల పాటు యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. 'జాగృతి జనం బాట' విజయవంతం కావాలని, ప్రజలకు వద్దకు వెళ్లే క్రమంలో అర్థం చేసుకునే శక్తిని ప్రసాదించాలన్న ఆలోచనలతో దైవ దర్శనం చేసుకున్నానని తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు వేదిక ఏర్పాటుచేసి, ఈ సమావేశానికి విద్యావంతులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, మహిళలు, యువతను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా గ్రూప్-1 నియామకాలు చేపట్టడంతో తెలంగాణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సుమోటోగా విచారణ జరపాలని కవిత కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌కి గురువారం ఆమె లేఖ రాశారు. ఇక వీఓఏల హక్కుల సాధన కోసం పోరాడుతామని, లాఠీ దెబ్బలు తినడానికి తాను సిద్ధమని కవిత అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం విలేజీ ఆర్గనైజర్ అసిస్టెంట్ (వీఓఏ)ల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం(సెర్ప్) ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాధర్నాకు కవిత ముఖ్య అతిథిగా హాజరై మద్దతు ప్రకటించారు.

పామాయిల్‌లో అంతరపంటగా పసుపు సాగు!

- కుర్కుమిన్ అధికంగా ఉన్న వంగడాలను సాగు చేయాలి
- పసుపు బోర్డు కార్యదర్శితో భేటీలో మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ తోటల్లో అంతర పంటగా పసుపు సాగుచేయటానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పసుపు బోర్డు కార్యదర్శికి సూచించారు. అదేక్రమంలో కుర్కుమిన్ శాతం అధికంగా ఉండే వంగడాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్. భవానిశ్రీ గురువారం సచివాలయంలో మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటైన తర్వాత ఆరు నెలల్లో సాధించిన ప్రగతిని ఆమె వివరించారు. ఫార్మా, ఆయుర్వేద రంగంలో పసుపు ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా.. పసుపు ఉత్పాదకాల మార్కెటింగ్‌పై శ్రద్ధ పెట్టాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. పసుపు రైతు ఉత్పత్తి సంఘాలను గుర్తించి, వారికి రూ. 23 లక్షల వరకు రాయితీ కల్పించి, కోత అనంతరం పసుపులో అవసరమయ్యే పనిముట్లను, యంత్రాలను అందిస్తున్నట్లు కార్యదర్శి భవానిశ్రీ తెలిపారు.

పింఛనుదారుల బకాయిలు చెల్లించకుంటే ధర్నా చేస్తాం: ఐకాస

ప్రభుత్వ పింఛనుదారులకు చెల్లించాల్సిన బకాయిలను నవంబరు 10వ తేదీ లోగా చెల్లించాలని పింఛనుదారుల ఐకాస చైర్మన్ కె. లక్ష్మయ్య డిమాండ్ చేశారు. లేదంటే నవంబరు 17న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకాయిలు అందక పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు.

బీసీ బిల్లు కోసం కేంద్రంపై ఒత్తిడి: కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదానికి కేంద్ర ప్రభుత్వంపై ఏపీ సీఎం చంద్రబాబు ఒత్తిడి పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం త్వరలో ప్రధాని మోదీని కలవాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం: మహేశ్ గౌడ్

నిజామాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలవనుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేరుకు జూబ్లీహిల్స్ అయినా అక్కడ ఎంతోమంది పేదలు ప్రభుత్వ పథకాలను పొందుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్, రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ చౌకబారు ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పాదయాత్రలు చేసినా స్వాగతిస్తామన్న మహేశ్‌గౌడ్.. తెలంగాణను దోచుకున్న ముఠాలో తన పాత్ర ఉందా, లేదా? అన్న సంగతి 'కవిత జనంబాట' పాదయాత్రలో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర క్యాబినెట్‌లో మైనారిటీలకు చోటు దక్కలేదని, డిసెంబరు, జనవరి నెలల్లో జరిగే విస్తరణలో చోటు కల్పిస్తామని మహేశ్ గౌడ్ తెలిపారు.



రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

బీసీ బిల్లును ఆమోదిస్తారా... రాజీనామా చేస్తారా..?

- గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధం
- చలో రాజ్‌భవన్‌లో బీసీ జేఏసీ నాయకులు

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను గవర్నర్ వెంటనే ఆమోదించాలని.. లేకుంటే పదవికి రాజీనామా చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూలులో చేర్చాలనే డిమాండుతో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం చలో రాజ్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ మేధావుల ఫోరం చైర్మన్, టి.చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బి.బాలరాజుగౌడ్ తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై గవర్నర్ వెంటనే సంతకం చేసేలా, 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా బీజేపీ రాష్ట్ర ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు గవర్నర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కాగా, చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, సంఘం సభ్యులను పోలీసులు అడ్డుకుని ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గోవుల అక్రమ రవాణాపై సమాచారం ఇస్తున్నాడనే..

ప్రశాంత్‌పై కాల్పులు

బాధితుడికి, నిందితుడికి గతంలోనే పరిచయం.. మాట్లాడుకుందామని పిలిచి తుపాకీతో కాల్చాడు

- ప్రశాంత్ డబ్బు డిమాండ్ చేశాడని ఆరోపిస్తున్నారు
- ఛత్తీస్‌గఢ్ నుంచి తపంచా కొనుగోలు చేసిన ఇబ్రహీం
- గంటల వ్యవధిలోనే ముగ్గురి అరెస్టు
- ప్రశాంత్ ప్రాణాలకు ప్రమాదం లేదు: సీపీ
- ముస్లిం ఓట్లు పోతాయని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు భయం
- గోవులతో రూ.కోట్ల దందా చేస్తుంటే ఏం చేస్తున్నారు?: సంజయ్
- ప్రశాంత్‌కు బీజేపీ నేతల పరామర్శ
- డీజీపీ ఆఫీసుకు వెళ్తున్న రాంచందర్‌రావు అరెస్టు



డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ/ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణా గురించి సమాచారం అందిస్తున్నాడన్న కోపంతోనే గోరక్షక్ దళ సభ్యుడు ప్రశాంత్‌కుమార్ అలియాస్ సోనూసింగ్‌పై ఇబ్రహీం ఖురేషీ కాల్పులకు తెగబడ్డాడని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ కేసులో గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నిందితుడు ఇబ్రహీం, బాధితుడు ప్రశాంత్‌లకు గతంలోనే పరిచయం ఉందని చెప్పారు. ఈ కేసులో సాంకేతికతను ఉపయోగించి, పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. 'బండ్లగూడకు చెందిన మొహమ్మద్ ఇబ్రహీం ఖురేషీ(24) అక్రమంగా పశువులను కబేళాలకు విక్రయిస్తున్నాడు. అత్తాపూర్‌కు చెందిన బిడ్ల ప్రశాంత్ కుమార్ అలియాస్ సోనూసింగ్ (28) ఏడాది క్రితం కుటుంబంతో కీసర ప్రాంతానికి మకాం మార్చాడు. ప్రశాంత్ గోరక్ష దళంలో సభ్యుడిగా ఉన్నాడు. ఇబ్రహీం అక్రమ వ్యాపారంపై దృష్టి పెట్టిన ప్రశాంత్ పలుమార్లు అతణ్ని అడ్డుకొని, పోలీసులకు అప్పగించాడు. దీంతో ఇబ్రహీంకు దాదాపు రూ.కోటి వరకు నష్టం వాటిల్లింది. కోపం పెంచుకున్న ఇబ్రహీం.. మాట్లాడాలంటూ తన స్నేహితుడు కురువ శ్రీనివాస్‌తో ప్రశాంత్‌కు కబురు పెట్టాడు. శంషాబాద్‌లో కలుద్దామని శ్రీనివాస్ సూచించగా, ప్రశాంత్ వారిని పోచారం రమ్మన్నాడు. ఇబ్రహీం తన స్నేహితులు మహ్మద్ హనీఫ్ ఖురేషీ(34), మస్నాబిన్ మోసిన్(22), శ్రీనివాస్‌లతో కలిసి పోచారం వెళ్లాడు. ఇబ్రహీం, ప్రశాంత్ కలిసి హోటల్ వెనక్కి వెళ్లి.. గంటకుపైగా మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఇబ్రహీం తన దగ్గరున్న తపంచాతో ఓ రౌండ్ గాల్లోకి కాల్చి, మరో రౌండ్ ప్రశాంత్‌ను కాల్చి, స్నేహితులతో కలిసి పరారయ్యాడు' అని సీపీ తెలిపారు. ప్రశాంత్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో ప్రశాంత్, ఇబ్రహీం ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు గుర్తించామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబరుల్లో గోవుల అక్రమ రవాణా గురించి ప్రశాంత్‌కు తెలిసినా.. సమాచారం ఇవ్వలేదని సీపీ తెలిపారు. గోవుల అక్రమ రవాణా సమాచారం ఇవ్వకుండా ఉండేందుకు ప్రశాంత్ రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు నిందితుడు శ్రీనివాస్ చెప్పాడన్నారు.



కాల్పుల ఘటనలో గాయపడిన ప్రశాంత్‌సింగ్‌ను పరామర్శిస్తున్న బండి సంజయ్

ఛత్తీస్‌గఢ్‌లో తుపాకీ కొని..

ఇబ్రహీం ఖురేషీ ఛత్తీస్‌గఢ్‌లోని స్నేహితుడి ద్వారా తపంచా కొనుగోలు చేశాడని సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఆ తుపాకీతోనే ప్రశాంత్‌పై కాల్పులు జరిపాడన్నారు. ఈ కేసులో మరో నిందితుడు హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడని, అతడిని అదుపులోకి తీసుకుంటే మరింత సమాచారం తెలుస్తుందని చెప్పారు. నిందితుల నుంచి తపంచా, కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు. పశువులను అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మీరేం చేస్తున్నారు?: బీజేపీ

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేస్తే ముస్లిం ఓట్లు పోతాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గురువారం ఆయన ఎంపీ కె.లక్ష్మణ్, బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్ తదితరులతో కలిసి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోనూ సింగ్‌ను పరామర్శించారు. అతని వైద్యానికయ్యే ఖర్చును పార్టీ భరిస్తుందని, అతనికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గోవులను గోశాలకు తరలిస్తామని సీఎం చెప్పడం కాదని.. గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. 'హిందువుల మనోభావాలను, హిందూ ధర్మాన్ని హేళన చేస్తే, గోరక్షకులను అవమానిస్తే కేసీఆర్‌కు ఎలాంటి గతి పట్టిందో చూడండి. కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతకంటే ఘోరమైన పరిస్థితి ఏర్పడుతుంది' అని సంజయ్ చెప్పారు. సోనూసింగ్ రూ.5 లక్షలు డిమాండ్ చేశాడని చెప్పడం దుర్మార్గమని, ఇబ్రహీం వ్యాపారానికి రూ.కోటి నష్టం వాటిల్లిందని చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

డీజీపీకి వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో అసలు శాంతి భద్రతలు ఉన్నాయా? అని కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ఇప్పటికే 500కు పైగా హత్యలు జరిగాయని, తుపాకీ సంస్కృతి పెరిగిపోయిందని, పోలీసుల ప్రాణాలు కూడా పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని తీసుకురావాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. డీజీపీకి వినతిపత్రం అందించేందుకు బయల్దేరిన ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలో నడుస్తున్నది రేవంత్‌రెడ్డి సర్కారు కాదని, రేవంతుద్దీన్ సర్కారని రాంచందర్‌రావు ఆరోపించారు. బాధితుడిపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరిగిందన్నారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న 'ఆస్ బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైఫ్ సైన్సెస్, ఉన్నతవిద్య, పరిశోధన రంగాల్లో పెట్టుబడుల కోసం రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఆయన వివరించారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, టీ హబ్, ఫ్యూచర్ సిటీ, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్ వంటి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 20 నెలల కాలంలో రాష్ట్రానికి రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63 వేల కోట్లు అని శ్రీధర్‌బాబు చెప్పారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ"ని అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రం భౌగోళికంగా 11, జనాభాలో 12వ స్థానాల్లో ఉన్నప్పటికీ, జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి తెలిపారు. 2024-25లో రాష్ట్ర జీఎస్‌డీపీ రేటు జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉందన్నారు. రాబోయే ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని ఈ సందర్భంగా దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను మంత్రి ఆహ్వానించారు. ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025'లో ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్ల జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే అని అన్నారు. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యం.. రాబోయే "బయో-డిజిటల్" యుగానికి కావాల్సిన 'రెడీ టూ వర్క్ ఫోర్స్' తయారీకి దోహదపడుతుందని మంత్రి అన్నారు.

ఆబ్కారీ శాఖలో అవినీతిపై విచారణ జరపాలి: జాన్‌వెస్లీ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆబ్కారీ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మంత్రులు, పలుకుబడి ఉన్న నాయకుల ఒత్తిడి వల్లనే పదేళ్ల సర్వీస్ ఉన్న ఐఏఎస్ అధికారి పదవీ విరమణ చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఆ అధికారి వీఆర్ఎస్ తీసుకోవడానికి గల కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలు, టెండర్లు దాఖలు చేసే విషయంలో సిండికేట్ అయ్యారని, పాత వారికే దుకాణాలు ఇవ్వాలని అధికారులు.. కొత్తవారికి ఇవ్వాలని మంత్రి పట్టుబట్టినట్లు తెలిసిందని గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

సినీ కార్మికుల ఓటు ఎటు?

జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో 22 వేలకుపైగా సినీ కార్మికుల ఓట్లు.. కీలకంగా సినీ యూనియన్లు

- ముగ్గురు అభ్యర్థులతోనూ వారికి సత్సంబంధాలు
- కార్మికులను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల ప్రయత్నాలు
- ఎవరికి మద్దతనే దానిపై యూనియన్ల నేతల తర్జనభర్జన



బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం జోరందుకుంది. స్టార్ క్యాంపెయినర్లు హోరెత్తిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో గంపగుత్తగా వచ్చే ఓట్లపై అన్ని పార్టీలు దృష్టిపెట్టాయి. ఈ క్రమంలో సినీ కార్మికులు కీలకంగా మారారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ డివిజన్‌లో కృష్ణానగర్, శ్రీనగర్ కాలనీ, రహమత్‌నగర్ డివిజన్ పరిధిలో.. 24 క్రాఫ్టులకు చెందిన సినీ కళాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారికి సంబంధించి సుమారు 22 వేల ఓట్లు ఉన్నట్టు అంచనా. ఎన్నికల బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు సినీ రంగంతో సత్సంబంధాలు ఉండటంతో.. సినీ కార్మికులు ఎవరి వైపు మొగ్గు చూపిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల యత్నాలు..

బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భర్త మాగంటి గోపీనాథ్ సినీ నిర్మాత కూడా. ఆయనకు సినీ కార్మిక సంఘాలతో మొదటి నుంచీ మంచి సంబంధాలు ఉన్నాయి. ఎమ్మెల్యేగా గెలిచాక సినీ పరిశ్రమలో ఎవరికి సమస్య వచ్చినా మాగంటిని ఆశ్రయించేవారు. చిత్రపురి కాలనీ అంశంలో కూడా ఆయన కీలకంగా వ్యవహరించారు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు కార్మికుల్లో చాలా వరకు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపించారని లెక్కలు చెబుతున్నాయి. ఈ సారి కూడా వారి ఓట్లు సాధించుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ కుటుంబానికి సినీ పరిశ్రమతో మంచి సంబంధాలు ఉన్నాయి. కృష్ణానగర్ ఏర్పాటులో నవీన్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ కీలకంగా వ్యవహరించారు. కొంతకాలం సినిమా రంగానికి చెందిన పలు యూనియన్లకు పెద్ద దిక్కుగా వ్యవహరించారు. చిత్రపురికాలనీ ఏర్పాటులోనూ నటుడు ప్రభాకర్‌రెడ్డితో కలిసి కృషి చేశారనే పేరుంది. అంతేకాదు తన కుమారుడికి మద్దతివ్వాలని సినీ కార్మికులకు చిన్న శ్రీశైలం యాదవ్ ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. సినీ నటుడు సుమన్ అయితే చిన్న శ్రీశైలం యాదవ్‌తో కలసి ఎన్నికల ప్రచారం కూడా చేస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఇంతకుముందు టీడీపీలో ఉన్నప్పుడు సినీ పరిశ్రమతో మంచి సంబంధాలు నెరిపారు. కొన్ని సినిమాలకు స్నేహితులతో కలిసి ఫైనాన్స్ కూడా చేశారు. కార్మికుల యూనియన్లతోనూ టచ్‌లో ఉన్నారు.

కీలకంగా మారిన సినీ యూనియన్లు

ముగ్గురు ప్రధాన అభ్యర్థులకు సినీ కార్మికులతో సంబంధం ఉండటంతో ఎవరికి ఓటేయాలో తేల్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో 24 క్రాఫ్టులకు చెందిన యూనియన్లు కీలకంగా మారాయి. అభ్యర్థులు ఇప్పటికే ఆయా యూనియన్ నేతలతో సంప్రదింపులు జరిపి, తమకు మద్దతు తెలపాలని, యూనియన్‌లోని కార్మికులతో ఓట్లు వేయించాలని కోరినట్లు తెలిసింది. కానీ ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై యూనియన్ల నేతలు తర్జనభర్జన పడుతున్నారని, ఎవరికి మద్దతిస్తే ఎలాంటి లాభనష్టాలు ఉంటాయని బేరీజు వేసుకుంటున్నారని సమాచారం.



మాగంటి సునీత విజయం ఖాయం!

(మొదటిపేజీ తరువాయి)



సమావేశమయ్యారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు క్షేత్రస్థాయిలో అనుకూల పరిస్థితులు, ఇతర అంశాలతో రూపొందించిన నివేదికలు పార్టీ ఇన్‌చార్జిలు కేసీఆర్‌కు అందజేశారు. ప్రచారం కొనసాగుతున్న తీరును కేసీఆర్ సమీక్షించారు. విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ శ్రేణులు జూబ్లీహిల్స్ ప్రజలతో మమేకం కావాలని, కాంగ్రెస్ దుష్టపాలనపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిందని, దాని దోపిడీ పాలనతో రాష్ట్రం గుల్ల అయిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అద్భుత కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రౌడీ షీటర్ కుటుంబానికి చెందిన వ్యక్తిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి, నగర ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందన్నారు. ఓటర్లు అతన్ని చిత్తుగా ఓడించి, జూబ్లీహిల్స్ గౌరవాన్ని హైదరాబాద్‌లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి, ఆర్థిక దుస్థితిని ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలనలో ఎందుకు మాయమయ్యాయి? అనే అంశంపై ప్రజలతో చర్చ జరపాలని మాజీ ముఖ్యమంత్రి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్‌కు ఢోకాలేదని, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలబెట్టిన బీఆర్ఎస్ వైపే ప్రజలు ఉన్నారని చెప్పారు. కేసీఆర్ కిట్‌లు, గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, మిషన్ భగీరథ నీళ్ల ఎందుకు ఆపారో కాంగ్రెస్ అభ్యర్థిని, నాయకులను నిలదీయాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. హైడ్రా పేరుతో గుడిసెల మీదకు బుల్డోజర్లు పంపుతున్న కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి నిలదీయండి అన్నారు. తాను కరోనా, పెద్ద నోట్ల రద్దు లాంటి సంక్షోభాల్లో తట్టుకొని, రాష్ట్రాన్ని ముందుకు నడిపించానని గుర్తు చేసుకున్నారు. అలాంటి రాష్ట్రాన్ని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా అతలాకుతలం చేస్తోందని వ్యాఖ్యానించారు. వాళ్లకు ఉన్న ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని, రాష్ట్ర ప్రజలు పూర్తి స్పష్టతతో ఉన్నారని అన్నారు. తెలంగాణలో పల్లెల్లోనే కాకుండా హైదరాబాద్ లాంటి నగరాల్లో కూడా జనం చేతుల్లో పైసల్లేక అల్లాడిపోతున్నారని చెప్పారు. కారోబార్ లేక రాష్ట్రంలోని అన్ని వర్గాలు అల్లాడిపోతున్నాయని తనను కలిసిన ఒక పెద్దమనిషి చెప్పారన్నారు. పదేళ్ల పస్తులుండి పైసా పైసా కూడబెడితే కాంగ్రెస్ వచ్చి రెండేళ్లలో ఖతం జేసిందని ఆరోపించారు. ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారని, చివరిదాకా నిలబడటమే పార్టీ నేతలు చేయాల్సిన పని అని చెప్పారు. నామినేషన్ల రోజే కత్తులు తిప్పారంటే రేపు గెలిస్తే పరిస్థితి దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. మాగంటి గోపీనాథ్ నియోజకవర్గ ప్రజల హృదయాలు గెలిచిన నేత అని, ఆ అభిమానాన్ని బీఆర్ఎస్ కాపాడుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లు, క్లస్టర్ల ఇన్‌చార్జులు దాదాపు 400 మంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ బరిలో 81 మంది

130 నామినేషన్ల తిరస్కరణ.. ముగిసిన నామినేషన్ల పరిశీలన.. 17 గంటలపాటు స్క్రూటినీ

ఉపసంహరణకు నేడు ఆఖరి రోజు.. విత్‌డ్రా చేయించేందుకు నేతల యత్నాలు

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల లెక్క తేలింది. సుదీర్ఘ పరిశీలన అనంతరం 81 మంది నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం ఆమోదించారు. బుధవారం ఉదయం 11 గంటలకు మొదలైన స్క్రూటినీ గురువారం తెల్లవారుజాము వరకు సుమారు 17 గంటలపాటు సాగింది. మొత్తం 211 మంది 321 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 130 మంది నామినేషన్లను పలు కారణాలతో తిరస్కరించారు. ఎక్కువగా స్వతంత్రులు, ఎన్నికల సంఘం గుర్తింపులేని పార్టీల అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. సరైన పత్రాలు సమర్పించకపోవడం, ఫారం పూర్తిగా నింపకపోవడం, ఇతర నియోజకవర్గాలకు చెందిన వారిని బలపరచాల్సిన పది మంది జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందినవారు కాకపోవడం వంటి కారణాలతో నామినేషన్లను తిరస్కరించినట్టు అధికారులు తెలిపారు. కాగా, నామినేషన్ల ఉపసంహరణకు శుక్రవారం ఆఖరు తేదీ. దీంతో బరిలో ఉండేది ఎందరు? తప్పుకొనేది ఎవరన్నది శుక్రవారమే తేలనుంది. ఇదిలా ఉండగా.. తమ నామినేషన్ల తిరస్కరణకు కారణాలు చెప్పాలంటూ కొందరు అభ్యర్థులు గురువారం షేక్‌పేటలోని రిటర్నింగ్ కార్యాలయం వద్దకు వచ్చారు. తిరస్కరణకు కారణాలను లిఖితపూర్వంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుందని ఎన్నికల అధికారులు తెలపడంతో ఆందోళనకు దిగారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించవద్దని పోలీసులు వారించారు.

విత్‌డ్రా చేయించే ప్రయత్నాలు షురూ..

ప్రధాన పార్టీల అభ్యర్థులు అనేక కాలమ్‌లు వదిలేసినా వారి నామినేషన్లను ఆమోదించారని, కానీ, తాము కేవలం ఒక్క కాలమ్ నింపనందుకే తమ నామినేషన్లను తిరస్కరించారని మాల మహానాడు జేఏసీ నాయకులు ఆరోపించారు. కాగా, తన నామినేషన్‌లో ఎలాంటి తప్పులు లేకపోయినా తిరస్కరించారని, దీనిపై కోర్టుకు వెళతానని ఓ స్వతంత్ర అభ్యర్థి తెలిపారు. మరోవైపు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇబ్బందికరంగా ఉన్న స్వతంత్రులను విత్‌డ్రా చేయించేందుకు ఆయా పార్టీల సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. వెయ్యి, అంతకుమించి ఓట్ల ప్రభావం చూపించే వారిని ఉపసంహరింపజేసేలా చర్చలు మొదలు పెట్టారు.

కాంగ్రెస్ పాలనలోనే యువతకు ఉద్యోగాలు

» కొత్త సబ్ రిజిస్ట్రార్లు నిబద్ధతతో పనిచేయాలి:పొంగులేటి

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గ్రూప్-2 ద్వారా నియామకమైన 14 మంది సబ్‌రిజిస్ట్రార్లు సచివాలయంలో గురువారం మంత్రిని కలిశారు. కొత్తగా రిజిస్ట్రేషన్ శాఖలోకి వచ్చిన వీరందరికీ ఇండియన్ స్టాంప్ యాక్ట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారు.. సామాన్య ప్రజలే లక్ష్యంగా నిబద్ధతతో పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లో అలసత్వం చూపారని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు.

సింగరేణిలో అరుదైన ఖనిజాల ఉత్పత్తి

» ప్రయోగాత్మకంగా ఓ ప్లాంట్ నిర్మాణం

» ఎన్ఎఫ్‌టీడీసీతో సింగరేణి ఒప్పందం: సీఎండీ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కీలక ఖనిజ రంగంలోనూ ప్రవేశించాలని నిర్ణయించిన సింగరేణి సంస్థ ఆ దిశగా మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ సూచనతో సింగరేణి ప్రాంతంలో అరుదైన ఖనిజాలను (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) గుర్తించి, ఉత్పత్తి చేయడానికి వీలుగా ప్రయోగాత్మకంగా ఒక ప్లాంటు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. దీనికోసం గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కేంద్ర ప్రభుత్వ అధికారిక పరిశోధన సంస్థ ఎన్ఎఫ్‌టీడీసీ (నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్)తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి సంస్థ తరఫున సీఎండీ ఎన్.బలరామ్, ఎన్ఎఫ్‌టీడీసీ నుంచి డైరెక్టర్ బాలసుబ్రమణియన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అరుదైన ఖనిజాల ఉనికిని తెలుసుకోవడానికి, లభ్యమవుతున్న మూలకాలను ఉత్పత్తి చేయడానికి ప్రయోగాత్మకంగా ఒక ప్లాంట్‌ను కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని సీఎండీ బలరామ్ చెప్పారు. ఈ ప్లాంట్‌లో ఓవర్ బర్డెన్(బొగ్గు ఉపరితలంపై ఉండే మట్టి) మట్టిలో లభించే అరుదైన ఖనిజాలతో పాటు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే బూడిదలోను, ఇతర వ్యర్థాలలోనూ లభ్యమయ్యే ఖనిజాలను గుర్తిస్తామని, ప్రయోగాత్మకంగా వీటిని కూడా ఉత్పత్తి చేస్తామని పేర్కొన్నారు.

యువ పోలీసులకు క్రికెట్‌లో అధునాతన శిక్షణ: డీజీపీ

» డీజీపీ శివధర్ రెడ్డిని కలిసిన తిలక్ వర్మ కోచ్ సలాం

హైదరాబాద్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువ పోలీసుల్లో క్రికెట్‌పై ఆసక్తి ఉండి గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఆడిన వారికి అధునాతన శిక్షణ ఇప్పిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. క్రికెటర్ తిలక్ వర్మ కోచ్ బయాష్ సలాం డీజీపీ కార్యాలయంలో శివధర్ రెడ్డిని కలిశారు. తిలక్ వర్మకు 12 ఏళ్ల వయసు నుంచే తాను కోచ్‌గా వ్యవహరించానని, శేరిలింగంపల్లిలోని లేగాల క్రికెట్ అకాడమిలో శిక్షణ ఇచ్చానని సలాం డీజీపీకి వివరించారు. పోలీసుశాఖలో క్రికెట్‌పై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇవ్వాలని ఈ సందర్భంగా సలాంను డీజీపీ కోరారు.

మేడ్చల్-ముద్ఖేడ్ మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థ

» మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్‌ల మధ్య కూడా

» రూ.316 కోట్ల ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే బోర్డు ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మేడ్చల్-ముద్ఖేడ్, మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్‌ల మధ్య రూ.316కోట్ల అంచనా వ్యయంతో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ వ్యవస్థను పటిష్ఠం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పంపిన ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. మేడ్చల్-ముద్ఖేడ్ మధ్య ప్రాజెక్టుకు రూ.193.26 కోట్లు, మహబూబ్‌నగర్-డోన్ మధ్య దాదాపు రూ.122.81 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తరించిన విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటారు.

20 పైసలకే యూనిట్ కరెంట్!

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రియల్ టైమ్ మార్కెట్‌లో గురువారం యూనిట్ కరెంట్ 20 పైసలకే అమ్ముడుపోయింది. మధ్యాహ్నం 1.15 నుంచి 1.30 గంటల మధ్య బ్లాకులో 5,743 మెగావాట్ల కరెంట్‌ను యూనిట్ 20 పైసల చొప్పున వినియోగదారులు కొనుగోలు చేశారు. ఇండియన్ ఎనర్జీ ఎక్సేంజ్ (ఐఈఎక్స్)లో రోజూ ప్రతీ 15 నిమిషాలకు ఒక బ్లాకు చొప్పున 90 బ్లాకులుగా విద్యుత్ విక్రయాలు జరుగుతుంటాయి. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ అమ్మకాలు/కొనుగోళ్లు రకరకాలుగా ఉంటాయి. వాటిలో కీలకమైనవి రెండే. ఒకటి రియల్ టైమ్ మార్కెట్ (ఏ సమయానికి ఆ సమయంలో కాస్త ముందు బిడ్ దాఖలు చేసే విధానం), మరొకటి డే ఎహెడ్ మార్కెట్ (ఒక రోజు ముందుగా వేలంలో పాల్గొనే విధానం). దేశవ్యాప్తంగా భారీగా సౌర విద్యుత్ అందుబాటులోకి రావడం, ఈశాన్య రాష్ట్రాల్లో జల విద్యుదుత్పత్తి జోరందుకోవడంతో కరెంట్ ఈ రెండు మార్కెట్లలోనూ తక్కువ ధరకే లభిస్తోంది. డే ఎహెడ్ మార్కెట్‌లో గురువారం కనిష్ఠంగా యూనిట్ 63 పైసలకు అమ్ముడుపోగా... గరిష్ఠ ధర రూ.5లోపే ఉంది. ఇది కూడా సాయంత్రం సాయంత్రం 6 నుంచి 7 గంటల్లోపే. పగలు రూ.3లోపే అమ్ముడుపోయింది. తెలంగాణ విషయానికొస్తే జల విద్యుత్ ఉత్పత్తి రోజుకు 50 మిలియన్ యూనిట్ల నుంచి 41 మిలియన్ యూనిట్లకు పడిపోయింది.

పుట్టుకతో గుండెలో రంధ్రం..

దెబ్బతిన్న ఊపిరితిత్తులు!

చెన్నైకు చెందిన మహిళకు నిమ్స్‌లో అరుదైన చికిత్స

'పల్మనరీ ఆర్టరీ డీనెర్వేషన్'తో ప్రాణాలు కాపాడిన వైద్యులు

హైదరాబాద్ సిటీ/నిమ్స్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టుకతో గుండెలో రంధ్రం... చిన్నప్పుడే చికిత్స చేయించుకోకపోవంతో ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ మహిళకు నిమ్స్ కార్డియాలజీ విభాగం వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. నిమ్స్‌లో చెన్నైకు చెందిన నాగ శర్వాణి (30) అనే మహిళకు అత్యాధునిక 'పల్మనరీ ఆర్టరీ డీనెర్వేషన్ (పీఏడీఎన్)'ను విజయవంతంగా నిర్వహించారు. ఆమె కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఆమెకు పుట్టుకతోనే గుండెలో రంధ్రంతో ఏర్పడింది. చిన్నప్పుడే శస్త్రచికిత్స చేసి ఉంటే సమస్య ఉండేది కాదు. తల్లితండ్రులు అశ్రద్ధ చేయడంతో ఊపిరితిత్తులపై ప్రభావం పడింది. దీనికి ఊపిరితిత్తుల్లోని ధమనుల్లో అధిక రక్తపోటు కారణం. విపరీతమైన ఆయాసం, నడవలేకపోవడం, ఉన్నట్లుండి కళ్లు తిరిగి పడిపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ఇటీవల నిమ్స్‌కు తీసుకొచ్చారు. నిమ్స్‌లో ఆమెకు పీఏడీఎన్ విధానంలో శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. పీఏడీఎన్ అనేది క్యాథెటర్ ఆధారిత వైద్య పద్ధతి అని, సాధారణ ఔషధ చికిత్సలకు స్పందించని తీవ్రమైన పల్మనరీ హైపర్‌టెన్షన్ రోగులకు ఉపయోగపడుతుందని నిమ్స్ డాక్టర్ ఉమాదేవి తెలిపారు. ఈ విధానంలో అధిక ఒత్తిడికి కారణమవుతున్న ధమనులను 'బర్న్' చేస్తామని చెప్పారు. తద్వారా రోగి 'పల్మనరీ ఆర్టరీ ప్రెషర్' తగ్గి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్స తెలంగాణ, ఏపీల్లో మొదటిది కాగా, దేశంలో ఆరో విజయవంతమైన కేసుగా గుర్తించారని తెలిపారు. ఇది ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రంగంలో నిమ్స్ వేసిన ముందడుగని పేర్కొన్నారు. నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.రామకుమారి ఆధ్వర్యంలో వైద్యులు నూషా డొడ్డి, ఉమాదేవి కరూరు, అజేయ్ కశ్యప్, మౌనిక మెల్లంపుట్టి, పీ వినయ్ కుమార్, కే భారత్‌రెడ్డి, నరేష్ నాయుడు, పీ చంద్రకాంత్‌ల బృందం ఈ శస్త్రచికిత్స నిర్వహించింది.

హైకోర్టు తీర్పు తర్వాతే

స్థానిక ఎన్నికలపై నిర్ణయం

3న హైకోర్టు ఇచ్చే తీర్పును అధ్యయనం చేయాలి.. 7న కేబినెట్లో చర్చించాక నిర్ణయాన్ని వెల్లడిస్తాం

» బీసీలకు 42% రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

» 15 వేల మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజీ ప్లాంటు

» మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. నవంబరు మూడో తేదీన హైకోర్టులో ఈ కేసుపై విచారణ జరగనున్న నేపథ్యంలో ఆ తీర్పు ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. నవంబరు 7న మంత్రివర్గం మరోసారి సమావేశమై స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో గురువారం రాత్రి మంత్రివర్గ సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ బలరామ్‌నాయక్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై మంత్రివర్గంలో సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని పొంగులేటి తెలిపారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లామని, హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు సూచించిందని, ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం తిరిగి హైకోర్టును ఆశ్రయించిందని వెల్లడించారు. నవంబరు 3న ఈ కేసు హైకోర్టులో విచారణకు వస్తుందని తెలిపారు. ఆ రోజున ఇచ్చే తీర్పును ఏడున కేబినేట్ సమావేశంలో చర్చించి స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్ల అమలుపై చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా శ్రీశైలం నుంచి ఫ్లోరైడ్ ప్రాంతమైన నల్లగొండకు నేరుగా గ్రావిటీ, టన్నెల్ ద్వారా కృష్ణా జలాలను తీసుకురావాలనే సంకల్పంతో ఎస్ఎల్‌బీసీ మొదలు పెట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. మొత్తం 44 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణానికి గాను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 32 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులకు మంచినీటిని అందించే ప్రయత్నం చేయలేదని అన్నారు. పదేళ్ల పాలనలో కేవలం రెండున్నర కిలోమీటర్ల టన్నెల్ పనులు మొక్కుబడిగా చేసి చేతులు దులిపేసుకున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయాలని సంకల్పించిందని తెలిపారు. కాంట్రాక్టు ఏజెన్సీకి ఎదురైన సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించి ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఈ ఏడాది జరిగిన దురదృష్టకరమైన సంఘటనలో 10-11 మంది ప్రాణాలు పోయాయని ప్రస్తావించారు. ప్రపంచంలోనే అతి పొడవైన ఈ సొరంగ మార్గాన్ని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని పట్టుదలతో ఉన్నామని, ఇప్పటికే 80 శాతం వరకు నిధులు ఖర్చు చేశామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే 30 టీఎంసీల నీరు రూపాయి ఖర్చు లేకుండా ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ ప్రాంతానికి గ్రావిటీలో వస్తుందని చెప్పారు. టీబీఎంలతో చేసే పనులకు ఫుల్ స్టాప్ పెట్టి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి అదనంగా ఖర్చు కాకుండా ఉండేలా, అదే ఏజెన్సీతో పనులు చేయించి, 2027 ఆరంభంలోగా పనులు పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు పొంగులేటి వెల్లడించారు.

ఇతర ముఖ్య నిర్ణయాలు

- స్థానిక స్సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం- 2018లో సెక్షన్ 21(3)ని తొలగిస్తారు. అసెంబ్లీ సమావేశాలు లేని సమయం కావటం, చట్టం చేయటానికి అవకాశం లేని సమయం కావటంతో ప్రత్యేక ఆర్డినెన్స్ తీయాలని, గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపించి ఆమోదింపజేసుకొని అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- నిర్మాణంలో ఉన్న 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు(ఎల్‌బీనగర్, సనత్‌నగర్, అల్వాల్, వరంగల్) ఎలాంటి అడ్డంకులు ఎదురైనా యుద్ధ ప్రాతికన పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయించింది.
- రాష్ట్రంలో 1,500 వేల మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించింది. పదేళ్లలో రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. 52 సంవత్సరాల క్రితం రామగుండంలో నిర్మించిన 65 మెగావాట్ల యూనిట్‌కు కాలం చెల్లిన నేపథ్యంలో ఆ యూనిట్‌ను తొలగించాలని నిర్ణయించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు తీర్చటంతోపాటు రాబోయే 10 ఏళ్లకు సరిపడా సోలార్, బ్యాటరీ స్టోరేజీ, రివర్స్ పంపింగ్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలను వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

కొత్త టెక్నాలజీతో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం

మంత్రివర్గం ఆమోదం

హైదరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగాన్ని టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో కాకుండా కొత్త విధానంలో చేపట్టే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఒత్తిడితో మట్టి/రాళ్లను కదిలించే/తొలగించే పేలుడు పదార్థాలు వినియోగించి టన్నెల్‌ను తవ్వే ప్రతిపాదనలపై గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం చర్చించింది. ఈ ప్రాజెక్టు పనులను 2005లో ప్రారంభించగా ఇప్పటికీ పూర్తికాలేదు. ఇందులో 43.93 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉండగా ఇన్‌లెట్ (శ్రీశైలం) వైపు నుంచి 13.936 కిలోమీటర్లు, ఔట్‌లెట్ (అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి) వైపు నుంచి 20.436 కిలోమీటర్లు తవ్వారు. ఇక రెండువైపుల నుంచి 9.56 కిలోమీటర్ల మేర తవ్వితే టన్నెల్ పూర్తవుతుంది. శబ్దాలు లేకుండా ఒత్తిడితో రాళ్లు/రప్పలు/మట్టిని కదిలించి... కిందపడేసే పేలుడు పదార్థాలను అమెరికాలోని ఆటోస్టెమ్ అనే కంపెనీ తయారుచేస్తోందని, మన దేశంలో కూడా ఆ తరహా పేలుడు పదార్థాలు తయారుచేస్తున్నారని అధికారులు నివేదించగా... మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 11న టన్నెల్ పనులు జరుగుతుండగా... ఇన్‌లెట్ (శ్రీశైలం వైపు) ప్రమాదం జరిగి 8 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో టీబీఎం కూడా ధ్వంసమైంది.

లిక్కర్ దందా..

కల్వకుంట్ల పేటెంట్!

కేటీఆర్ అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా?

» మీ చెల్లెలు ఢిల్లీకి వెళ్లి లిక్కర్ స్కాంలో ఇరుక్కోలేదా?

» మీరు బీజేపీ కాళ్లపై మోకరిల్లలేదా?

» నేను లేఖ రాస్తేనే రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నాడా?: మంత్రి జూపల్లి



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లిక్కర్ దందా అంటేనే కల్వకుంట్ల కుటుంబ పేటెంట్ హక్కు అని, వారిదే బ్రాండ్ అని ఆరోపించారు. సీఎస్‌కు తాను రాసిన లేఖ వల్లే ఐఏఎస్ అధికారి రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రంగా మండిపడ్డారు. నిజానికి తాను వీఆర్ఎస్‌ను ఆమోదించొద్దని చెప్పానని తెలిపారు. మద్యం సీసాలపై హోలోగ్రామ్ వేసే టెండర్లపై తాను రాసిన లేఖలకు స్పందించకపోవడంతో రిజ్వీపై సీఎస్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. గురువారం మంత్రివర్గ సమావేశం అనంతరం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో కలిసి జూపల్లి కృష్ణారావు విలేకరులతో మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ బాటిళ్లపై ఉండే హోలోగ్రామ్ కాంట్రాక్టును 2013 ఆగస్టు 21న ఒక కంపెనీకి ఇచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అదే కంపెనీతో 2014 జూలై 1న ఒప్పందం చేసుకుని, 2019 వరకు కొనసాగించింది. 2019లో ఆ కంపెనీ ఒప్పందం గడువు ముగిసింది. అయినా 2019 నుంచి 2023 వరకు ఎలాంటి టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిన అదే కంపెనీకి ప్రతి ఏటా పొడిగిస్తూ వచ్చారు. నేను మంత్రినయ్యాక రెండు నెలలకే అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ విషయం నా దృష్టికి వచ్చింది. దీంతో.. ఏటా రూ.40 కోట్లకు ఇవ్వాల్సిన కాంట్రాక్టును ఐదేళ్లపాటు నామినేషన్ పద్ధతిన ఎలా కొనసాగించారని, టెండర్లు ఎందుకు పిలవలేదని ప్రశ్నించాను. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పాను" అని మంత్రి జూపల్లి వివరించారు.

లిఖితపూర్వకంగా లేఖ రాసినా స్పందనలేదు..

అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో 2024 ఆగస్టు 13న లిఖిత పూర్వకంగా లేఖ పంపానని మంత్రి తెలిపారు. మళ్లీ అదే ఏడాది సెప్టెంబరు 27న, అక్టోబరు 17న రిమైండర్‌తోపాటు లేఖ పంపించానన్నారు. తిరిగి డిసెంబరు 9న మరోసారి లేఖ పంపించినట్లు పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉన్న గొప్ప టెక్నాలజీని గుర్తించి, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈఓఐ)ను ఆహ్వానించి, దాని ప్రకారం టెండర్లు పిలవాలని చెప్పాం. దానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి, చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి రిజ్వీని వేశాం. అయినా.. కమిటీ సమావేశంలో కూడా ఈ అంశాన్ని పెట్టలేదు. మంత్రిగా నేను ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా వాళ్లు స్పందించలేదు. చివరికి స్పందించి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను ఆహ్వానించారు. దీనికి 23 దరఖాస్తులు వచ్చాయి. ఇవి వచ్చి నాలుగైదు నెలలు దాటిపోయింది. దీనిపై ఇప్పటివరకు ప్రజెంటేషన్ ఇవ్వలేదు. మంత్రి అంటే ప్రభుత్వం. చట్టం, రూల్స్ ప్రకారం ఆదేశాలు జారీ చేసినా... స్పందించకపోవడంతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని భావించి, ఎందుకు ఆలస్యం చేస్తున్నారని అడిగాం. కమిటీకి కూడా ఆయనే(రిజ్వీ) చైర్మన్. ఆయన నిజాయితీ అధికారి అని కేటీఆర్ అంటున్నారు. మరి ఆ నిజాయితీ అధికారినే చైర్మన్‌గా నియమించాం కదా? ఆదేశాలిచ్చిన తర్వాత కూడా ఆయన ఏమీ చేయలేదు. దాంతో నేను అక్టోబరు 11న సీఎస్‌కు లేఖ పంపించాను. విధులు నిర్వర్తించకపోవడం, నిర్లక్ష్యం చేయడం, ప్రభుత్వ విధి నిర్వహణకు అడ్డంకులు కలిగించారంటూ సీఎస్‌ఎకు వివరించాను" అని జూపల్లి వెల్లడించారు.

సీఎస్‌కు అందుకే ఫిర్యాదు చేశాను..

డిస్టిలరీల ఏర్పాటు గురించి అధికారులు మంత్రికి రూల్స్ వివరించాలని మంత్రి అన్నారు. డిస్టిలరీ వల్ల ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని చెప్పారు. అయితే, "గత ప్రభుత్వంలో కేసీఆర్ క్యాబినెట్‌కు పంపారు.. మీరు కూడా క్యాబినెట్‌కు పంపండంటూ ఆ అధికారి(రిజ్వీ) నాకు చెప్పాడు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఏం పంపారో ఆ ఫైళ్లను పంపించాలని అడిగాను. కానీ, అది కూడా పంపలేదు. దీని గురించి సీఎస్‌కు వివరించాను. డిస్టిలరీల లీజు లైసెన్స్ గడువు ముగియగానే మళ్లీ పొడిగించాలి. అలా చేయని కారణంగా ఒక కంపెనీ వల్ల నెలకు రూ.23 కోట్లు, 10 నెలలకు రూ.230 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం జరిగింది. చట్టంలో లేనివి చేశారు.. ఉన్నవి చేయలేదు. ఇలా రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం జరుగుతున్నందున.. సీఎస్‌కు ఫిర్యాదు చేశాను. నేను లేఖ పంపినందుకే వీఆర్ఎస్ తీసుకున్నారని అంటున్నారు. అది వాస్తవం కాదు. ఆయనకు ఏఐజీలో నెలకు రూ.10 లక్షల వేతనం ఆఫర్ వచ్చింది. ఢిల్లీలో కూడా కొన్ని కంపెనీలు ఎక్కువ వేతనాలిస్తాయి. దాని కోసమే వీఆర్ఎస్ పెట్టుకున్నారు. ఆ విషయం నాకు తెలియదు. ఇది వాస్తవం" అని జూపల్లి అన్నారు.

ప్రభుత్వానికి మేలు జరగాలనుకోవడం తప్పా?

ప్రభుత్వానికి జరగాల్సిన మేలు చేయనప్పుడు ప్రశ్నించడం తప్పవుతుందా? అని మంత్రి జూపల్లి నిలదీశారు. సొంత ఉద్యోగం కోసం వీఆర్ఎస్ తీసుకుంటే దానికి, దీనికి ముడిపెట్టి కేటీఆర్ మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. "ఏడాదికి రూ.40 కోట్ల హోలోగ్రామ్ కాంట్రాక్టుకు టెండరు పిలవలేదు. దీనిని రాజకీయం చేసి, ముఖ్యమంత్రి అల్లుడిపై రూ.500 కోట్ల ఆరోపణలు చేశారు. నా కొడుకు కూడా కాంట్రాక్టు కోసం ప్రయత్నించాడని అంటున్నారు. కేటీఆర్‌కు మతిస్థిమితం ఉందా? అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా? నా చరిత్ర కేటీఆర్‌కు తెలియదా? ఉమ్మడి రాష్ట్రంలో మూడున్నరేళ్ల మంత్రి పదవిని వదిలిపెట్టాను. పదవులు, డబ్బు కోసం ఆశ పడలేదు. ఆనాడు నేను ఎన్నికల్లో ఓడిపోతే ఇదే కేటీఆర్ 'మీరు ఓడిపోవడం బాధగా ఉంది, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి మీకు బాగుంటుంది. ఒకసారి కేసీఆర్‌ను అడగండి' అని నాతో అన్నాడు. లిక్కర్ దందా అంటేనే కల్వకుంట్ల కుటుంబానికి పేటెంట్ రైట్, వాళ్లదే బ్రాండ్. మీ సొంత చెల్లెలు ఢిల్లీకి వెళ్లి లిక్కర్ స్కాంలో ఇరుక్కోలేదా? రూ.కోట్ల దోపిడీ జరగలేదా? బీఆర్ఎస్‌ను తాకట్టు పెట్టి, బీజేపీ కాళ్ల మీద మోకరిల్లలేదా?" అని వ్యాఖ్యానించారు.

రూ.వేల కోట్లకు పడగలెత్తారు..

కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత, సంతోష్ అప్పుడు ఎలా ఉన్నారు? ఇప్పుడెలా ఉన్నారని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. ఒకప్పుడు లక్ష రూపాయలకు కారు అమ్ముకున్నారని, ఈరోజు ఒక్కొక్కరు రూ.వేల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. "మీరు నన్ను, మా ముఖ్యమంత్రిని వేలెత్తి చూపుతారా? రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో నేను మంత్రిగా ఉన్నా. ఏ ఒక్కరోజైనా నాపై ఆరోపణలు వచ్చాయా? మీ రాజకీయ పబ్బం కోసం అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారు. ఈడీ, సీబీఐ కేసులను మీరే ఎదుర్కొంటున్నారు. అమరుల త్యాగాలపై వచ్చిన రాష్ట్రాన్ని దోచుకోలేదా? రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయలేదా? జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం బట్టకాల్చి మీదేసే కార్యక్రమం చేస్తున్నారు. మీరు తలకిందులుగా తపస్సు చేసినా.. మీకు పుట్టగతులు ఉండవు. ప్రతి దానినీ తప్పు పడుతున్నారు. నేను లేఖ రాస్తేనే రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నారని అంటున్నారు. దీనిపై పరువు నష్టం దావా వేస్తాను. ఇంత దిగజారుడుతనమా? మానవత్వం, విలువలు ఉండాలి. మీ చేత చెప్పించుకునే ఖర్మ మాకు పట్టలేదు" జూపల్లి ధ్వజమెత్తారు. రిజ్వీ వీఆర్ఎస్ ఆమోదించవద్దని తానే చెప్పానని మరోసారి స్పష్టం చేశారు.

క్యాబినెట్ భేటీకి రిజ్వీ

వీఆర్ఎస్ తీసుకొని కూడా హాజరు..

ఐఏఎస్ అధికారి తీరుపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకోవడం ద్వారా చర్చనీయాంశంగా మారిన ఐఏఎస్ అధికారి ఎస్ఏఎం రిజ్వీ గురువారం మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు. వీఆర్ఎస్ దరఖాస్తు ఆమోదం పొందాక కూడా ఆయన అధికారిక హోదాలో క్యాబినెట్ భేటీకి హాజరవ్వడంపై సర్వత్రా చర్చ జరిగింది. అయితే ఎక్సైజ్ శాఖకు ముఖ్య కార్యదర్శిగా, సాధారణ పరిపాలన శాఖ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న రిజ్వీ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఆయన నిర్ణయం రాజకీయంగా దుమారం రేపడంతో అధికార, ప్రతిపక్షాల మధ్యన మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ వ్యవహారం కారణంగానే రిజ్వీ రాజీనామా చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. వాస్తవానికి ఆయన తన వ్యక్తిగత కారణాలతోనే స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టతనిచ్చారు. రిజ్వీకి ఏఐజీలో ఎక్కువ జీతంతో ఆఫర్ రావడంతోనే రాజీనామా చేశారని చెప్పారు. అయితే ఏఐజీ అంటే ఆస్పత్రి కాదని, అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్‌కు సంబంధించిన ఓ పెద్ద కంపెనీ అనే చర్చ జరుగుతోంది.

రోడ్డున పడొద్దు!

(మొదటిపేజీ తరువాయి)



మంత్రుల మధ్య సఖ్యత లేకపోవడంపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల మధ్య కాంట్రాక్టుకు సంబంధించిన వివాదం; కొండా సురేఖ మాజీ ఓఎస్డీని అరెస్టు చేసేందుకు పోలీసులు మంత్రి నివాసానికి వెళ్లినప్పుడు జరిగిన రభస; మంత్రి పొన్నం ప్రభాకర్ నోరు జారడంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి; మంత్రులు అడ్లూరి, వివేక్ మధ్య వివాదం తదితర అంశాలపై చర్చించారు. చిన్నచిన్న అంశాలపై మంత్రులు రచ్చ చేసుకోవడం వల్ల ప్రజల్లో చులకన అవుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాలకు మనమే అస్త్రం అందించినట్లు అవుతోందన్న చర్చ కూడా జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల మధ్య వివాదానికి బీఆర్ఎస్ పార్టీ నేతలు మరికొన్ని కల్పితాలను జోడించి ప్రచారం చేస్తున్నారన్న చర్చ జరిగింది. కాగా, సీఎం రేవంత్‌ని ఉద్దేశించి తన కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొండా సురేఖ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా జరిగింది వదిలేసి.. ఇకపై మంత్రులంతా సంఘటితంగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చారు. సురేఖ, పొంగులేటి మధ్య వివాదం ముగిసిందన్న సంకేతాన్ని ఇచ్చేందుకుమీడియా సమావేశంలో వారిద్దరూ కలిసి కూర్చున్నారు. మీడియాకు పరిచయం చేసేటప్పుడు సురేఖ అక్క అంటూ పొంగులేటి పరిచయం చేయడం విశేషం.

పారదర్శకంగా ఉందాం..

ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకోవడం, ఆమోదించవద్దంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం.. దీని వెనక మద్యం కాంట్రాక్టుల వివాదం ఉందంటూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేయడం పైనా క్యాబినెట్‌లో చర్చ జరిగింది. వాస్తవానికి కేటీఆర్ వ్యాఖ్యలపై సమాధానం ఇచ్చేందుకు గురువారం మధ్యాహ్నమే జూపల్లి ప్రెస్ మీట్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించిన తర్వాత మాట్లాడవచ్చన్న సీఎం రేవంత్ సూచనతో ఆయన సమావేశాన్ని రద్దుచేసుకున్నారు. ప్రతి అంశానికి కట్టుకథలు జోడించి ప్రచారం చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని జూపల్లి అన్నట్లు తెలిసింది. రిజ్వీకి ఒక ప్రముఖ కార్పొరేటు గ్రూపులో నెలకు రూ.10 లక్షల వేతనంతో ఉద్యోగం ఆఫర్ రావడంతోనే ఆయన రాజీనామాకు సిద్ధపడ్డారని మంత్రి చెప్పినట్లు సమాచారం. ఇలాంటి వివాదాస్పద అంశాల్లో పారదర్శకంగా ఉందామని.. ఏం జరిగిందీ మీడియా సమావేశంలో ప్రజలకు వివరించాలని సహచర మంత్రులు సూచించారు. వారి సూచన మేరకు మీడియాకు పూర్తి వివరాలు తెలిపారు. స్థానిక ఎన్నికలపై ఏం చేద్దామంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులను అడిగారు. తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌లు పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళదామన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులూ రావట్లేదని గుర్తుచేశారు. మెజారిటీ మంత్రులు మాత్రం ఈ అంశాన్ని ఇక్కడి దాకా తీసుకొచ్చాం కాబట్టి.. హైకోర్టు స్పందనను బట్టి నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఆలోగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగుస్తుందని, అందులో గెలిచి.. స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు.

మా పాప వ్యాఖ్యలపై క్షమాపణ చెబుతున్నా: సురేఖ

సీఎం రేవంత్‌రెడ్డిపై తన కూతురు చేసిన వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పారు. తనకు ఓఎస్డీగా పనిచేసిన వ్యక్తి విషయంలో జరిగిన వ్యవహారం, మంత్రిగా ఉన్నప్పటికీ రాత్రివేళ తన ఇంటికి మఫ్టీలో పోలీసులు రావడంతో చోటుచేసుకున్న అంశంపై కొండా స్పందించారు. "టీ కప్పులో తుపానులా కొంత గొడవ జరిగింది. మా ఇంటికి పోలీసులు రావడంతో మా పాప సీఎం రేవంత్‌పై కొంత ఆవేశంగా మాట్లాడింది. అందుకు క్షమాపణ చెబుతున్నా. మాదంతా ఒకటే కుటుంబం. అంతా సర్దుకుపోయాం. కుటుంబం అన్నాక అందరం కలిసి నడవాల్సిందే" అని చెప్పారు.

అధికారులను బలి చేస్తారా?

» మీ అవినీతికి తల వంచకపోతే వేధిస్తారా?:సంజయ్

» రిజ్వీ వీఆర్ఎస్‌పై సర్కారు సమాధానం చెప్పాలి: లక్ష్మణ్



హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'మీ అవినీతికి తలవంచకపోతే అధికారులను బలి చేస్తారా? మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను వేధిస్తారా?' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్ అసమర్థ పాలన, అవినీతి రాజకీయాలకు సీనియర్ ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్సే నిదర్శనమని వ్యాఖ్యానించారు. నిజాయితీగల, సమర్థుడైన అధికారి వీఆర్ఎస్ తీసుకునే పరిస్థితి ఎందుకొచ్చిందని సంజయ్ ప్రశ్నించారు. 'టెండర్లలో మంత్రులు జోక్యం చేసుకుంటున్నారు. నిబంధనలు మార్చుతారు. అవినీతి బయటపడితే రాజీ పడని అధికారులపైనే నిందలు వేస్తారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ అధికారులను బలి చేశారు. ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ అధికారులపై నిందలు మోపారు. కాంగ్రెస్ సైతం బీఆర్ఎస్ దారిలోనే నడుస్తోంది' అని సంజయ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ విచారణ

» రెండో రోజు కళ్యాణిని విచారించిన అధికారులు

సైదాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ మహిళా జైలులో రిమాండ్‌లో ఉన్న సృష్టి ఫెర్టిలిటీ కేసు నిందితుల విచారణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కొనసాగిస్తోంది. ఈ కేసులో నిందితులు డాక్టర్ నమ్రత, కళ్యాణి, నందిని, సంతోషిలతో పాటు పురుషుల జైలులో ఉన్న జయంత్ కృష్ణను విచారించేందుకు ఈడీకి కోర్టు ఈ నెల 28 వరకు అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఈడీ అధికారులు గురువారం ఉదయం 11.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళ్యాణిని విచారించారు. మిగతా నిందితులను దశలవారీగా వేర్వేరుగా విచారించి వివరాలు సేకరించిన అనంతరం ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతను ప్రశ్నించనున్నట్టు సమాచారం.

బాలికపై యువకుడి లైంగికదాడి

» పరారీలో నిందితుడు.. పోక్సో కేసు నమోదు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై తమ బంధువైన యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిల్లోనిగూడ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు ఈ నెల 18న శంషాబాద్‌లో కూలి పనులకు వెళ్లారు. అదేరోజు షాబాద్ మండలం మద్దూర్ గ్రామానికి చెందిన వారి బంధువు నవీన్ (25) పిల్లోనిగూడకు వచ్చి ఇంట్లో ఎవరు లేరని గ్రహించి తాగడానికి నీళ్లు ఇవ్వాలని బాలికను అడిగాడు. బాలిక ఇంట్లోకి వెళ్లగానే నవీన్ ఆమెతో పాటే వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికీ చెప్పొద్దని, చెబితే చంపేస్తానని బెదిరించాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

» పోక్సో కేసు నమోదు

తాండూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదయింది. తాండూరు మండలం కరణ్‌కోట్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాఘవేందర్‌రెడ్డి పాఠశాల కొనసాగుతున్న సమయంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడి పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వం ఆదర్శ యజమానిగా ఉండాలి

» సర్వీసు క్రమబద్ధీకరణపై తప్పించుకునే ధోరణి తగదు

» హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ యజమానిగా ఉండాలే తప్ప, ఉద్యోగుల సర్వీసు విషయంలో తప్పించుకునే ధోరణి ప్రదర్శించరాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించే సమయంలో వారి తాత్కాలిక సర్వీసును సైతం లెక్కించాలని, అందుకు అనుగుణంగా పింఛను, ఇతర ప్రయోజనాలు చెల్లించాలని 2012లో అప్పటి ఉమ్మడి ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం సమర్థించాయి. అయినప్పటికీ ఆ ఉత్తర్వులను తమ విషయంలో అమలు చేయడం లేదంటూ ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ఏకేసింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పును అమలు చేయకపోవడం ఆందోళనకరమని తెలిపింది. పిటిషనర్‌లు తెలంగాణ ప్రాంతంలోనే సర్వీసు చేసినందున 2012 నాటి ట్రైబ్యునల్ ఆదేశాలు అమలు చేయాలని సూచించింది.

రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల వసూళ్ల విప్లవం

» న్యాయవాదులూ ఆలోచించాలి: హైకోర్టు

రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల వసూళ్ల విప్లవం సాగుతోందంటూ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇష్టారాజ్యంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలతో భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని, అలాంటి కేసులు వాదించే ముందు న్యాయవాదులు కూడా ఒకసారి ఆలోచించాలని సూచించింది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం పర్వతపురంలో 175 గజాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ బీ సంజీవ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగానే అక్రమ నిరాణాలపై ధర్మసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రణాళికకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాల కారణంగా పార్కింగ్ లేమి వంటి సమస్యలు తలెత్తుతుండడంతో ఇరుగు పొరుగు మధ్య సఖ్యత లేకుండా పోతోందని తెలిపింది. జీ+2 నిర్మాణానికి అనుమతి తీసుకుని మరో రెండు అంతస్తులు అక్రమంగా ఎలా నిర్మిస్తారని అక్రమ నిర్మాణదారును ప్రశ్నించింది. పిటిషనర్, అక్రమ నిర్మాణదారు అన్నదమ్ములని న్యాయవాది చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఆస్తి వివాదాలు ఉన్నాయి కాబట్టే ఈ ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించింది. కాలానుగుణంగా విప్లవాలు వస్తుంటాయని, ఇప్పుడు అక్రమ నిర్మాణాల వసూళ్ల విప్లవం సాగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల విషయంలో అధికారులు, న్యాయవాదులు ఆలోచించాలని సూచించింది. అక్రమ నిర్మాణాలు సమస్యలు తెచ్చిపెడుతాయని, భవిష్యత్తు తరాలు వీటిని క్షమించవని తెలిపింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

నేడు మావోయిస్టుల బంద్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ (ఎంఎల్- మావోయిస్టు) పార్టీ దేశవ్యాప్త బంద్‌కు పిలుపునివ్వడంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. బంద్ విజయవంతానికి ప్రజా సంఘాలు, విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు కృషి చేయాలని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఇటీవల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంద్ పిలుపుకు అంత స్పందన ఉండదన్న సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు.. అయినా తమ జాగ్రత్తలో తాము ఉన్నామన్నారు.

గూగుల్ వచ్చినా సమస్య వస్తే గురువే దిక్కు



చాగంటి కోటేశ్వరరావుకు సాహిత్యపురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వెంకయ్యనాయుడు

» మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్య

» చాగంటికి పోలూరి హనుమజ్జానకీ రామశర్మ పురస్కారం ప్రదానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): గూగుల్ వచ్చినా సమస్య వస్తే మాత్రం గురువు దగ్గరకే వెళ్లాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చమత్కరించారు. ధారాళంగా మాట్లాడే నేర్పు తన గురువు బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ప్రేరణతోనే తనకు వచ్చిందన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాల్లో జరిగిన కార్యక్రమంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావుకు వెంకయ్య అందజేశారు. శాలువా, జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రంతో సత్కరించి రూ.25వేలు నగదు పురస్కారాన్ని అందించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు పెద్దవారికి మాత్రమే అనుకునే భ్రమను తొలగించి యువతరాన్ని కూడా ఆకట్టుకున్నారని చాగంటిని ప్రశంసించారు. యువతను భారతీయ చింతన దిశగా నడిపించడంలో చాగంటి వంటి దార్శనికుల పాత్ర శ్లాఘనీయమైనదని వెంకయ్య అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తుకు వెంకయ్య నాయుడు ఇచ్చిన రూ.5లక్షల విరాళంతో ఆయన గురువు హనుమజ్జానకీరామశర్మ పేరుమీద ఏటా ఒకరికి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి జే.చెన్నయ్య చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న శాంతా-వసంతా ట్రస్టు వ్యవస్థాపకుడు కేవీ వరప్రసాదరెడ్డి, సాహితీవేత్త రేపూరి అనంతపద్మనాభరావు కూడా పోలూరి శిష్యులే అని సభాధ్యక్షత వహించిన తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు రమణాచారి చెప్పారు. పురస్కార గ్రహీత చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సనాతన ధర్మంలో గురువు మాటకు విశిష్టమైన స్థానం ఉందని, పొరపాటున కూడా గురువు మీద హాస్యమాడరాదని హితవు పలికారు.

'కలుపు యాజమాన్యం' పుస్తకం ఆవిష్కరణ

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అట్లూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు రాసిన 'కలుపు యాజమాన్యం' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తన స్వగృహంలో ఆవిష్కరించారు. కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ముఖ్యంగా రసాయనాల వాడకం వాటి పరిణామాలు వంటి అనేక విషయాలను రైతులకు అర్థమయ్యేలా పుస్తకం రాశారని వెంకయ్య రచయితను అభినందించారు. శాస్త్రపరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కాంగ్రెస్ మాఫియా రాజ్యం..!

సెటిల్మెంట్లకు కేంద్రంగా రేవంత్‌రెడ్డి ఇల్లు.. తుపాకీ సంస్కృతి ఆరోపణలపై సీఎం స్పందించాలి

» మంత్రి వేధింపులు భరించలేకనే రిజ్వీ వీఆర్ఎస్

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు



బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం పార్టీ నాయకులకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం అవినీతి, భూఆక్రమణలు, సెటిల్మెంట్లకు కేంద్రంగా మారిపోయిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మాఫియా రాజ్యంగా మారిందని, సీఎం రూ.వేల కోట్లు పోగేసుకుంటుంటే తాము వందల కోట్లయినా సంపాదించొద్దా.. అంటూ మంత్రులు పోటీ పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో గురువారం హైదరాబాద్ యూత్ కరేజ్ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త సల్మాన్‌ఖాన్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో కేసీఆర్‌లాంటి సెక్యులర్ నేత ఎవరూ లేరని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తోందని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఇదేతీరు కొనసాగుతోందన్నారు. మంత్రుల మధ్య అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ వంటివి.. కాంగ్రెస్ ఇంటి పంచాయితీలుగా మారాయన్నారు. ఇంత బహిరంగంగా దేశచరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. పొంగులేటి తమ టెండర్లలో తలదూర్చారని ఓ మంత్రి కుమార్తె ఆరోపించారని అన్నారు. ముఖ్యమంత్రి ప్రోద్బలంతో ఆయన అనుచరుడు రోహిన్‌రెడ్డి ఓ పారిశ్రామికవేత్త నెత్తిన గన్నుపెట్టి బెదిరించారంటూ ఆమె చేసిన ఆరోపణలపై రేవంత్‌రెడ్డికి సిగ్గుంటే స్పందించాలన్నారు. మంత్రి కూతురు ఆరోపణలుచేస్తే ఆ మంత్రిని తొలగించలేని బలహీనమైన ఇలాంటి సీఎంను ఇప్పటివరకు చూడలేదన్నారు. దావూద్ ఇబ్రహీంలాంటి ఈ సీఎంను తరిమేస్తేనే తెలంగాణకు పట్టిన శని పోతుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. ఓ మంత్రి వేధింపులు భరించలేకనే ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్‌కు సిద్ధపడ్డారన్నారు. తాను చెప్పినపని చేయలేదన్న ఉద్దేశంతో.. ఆయన రాజీనామాను ఆమోదించొద్దని జూపల్లి కృష్ణారావు కోరడం ప్రభుత్వ వేధింపులకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నేతల వాటాల పంచాయితీలో తమకు భాగస్వామ్యం వద్దని అధికారులు పారిపోతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దండుపాళ్యం ముఠా రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అక్రమాల్లో భాగస్వాములైతే, గతంలో మాదిరిగానే జైలుకు వెళ్లాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు.

డీజీపీ ఏం చేస్తున్నారు?

తమకు పింక్, రెడ్ బుక్కుల్లేవని రాష్ట్రంలో ఖాకీ బుక్కు మాత్రమే ఉంటుందని గొప్పలకు పోయిన డీజీపీ ఏం చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు.. కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రి కుమార్తె ఆపినా, అతన్ని స్వయంగా మంత్రి తన కారులో తీసుకెళ్ళిపోయినా చర్యల్లేవన్నారు. మంచిరేవుల భూముల వ్యవహారంలో సీఎం సోదరుడు బెదిరించారని, తుపాకీ ఇచ్చింది రేవంత్‌రెడ్డి, తెచ్చింది రోహిన్‌రెడ్డి అని మంత్రి కుమార్తె చెబుతున్నారు. పోలీసులు మాత్రం గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ అని చెబుతున్నారన్నారు. ఈ రెండు అంశాల్లోనూ డీజీపీ చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ అంశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభిప్రాయాన్ని రికార్డు చేయాలని, సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలన్నారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ జాయింట్ వెంచర్ పరిపాలన నడుస్తోందని.. అందుకే ఇక్కడి అవినీతి, అరాచకాలపై కేంద్ర మంత్రులు, ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల్ల అంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిజం చెప్పారని, తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తపరిచినందుకు ఆయనకు తమ పార్టీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు.




రాకేశ్, శ్రీజ (ఫైల్)

ముగ్గురు స్నేహితులు.. వరుసగా ఆత్మహత్య!

ఒకే ఊరు.. టెన్త్‌లో కలిసి విద్యాభ్యాసం

ముగ్గురిలో ఈనెల 21న ఓ యువతి బలవన్మరణం

ఆ మర్నాడు ఒకరు.. గురువారం మరొకరి ఆత్మహత్య

హయత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒక యువకుడు, ఇద్దరు యువతులు. ఈ ముగ్గురూ స్నేహితులు. ఒకే ఊరు.. టెన్త్ క్లాసులో కలిసి చదువుకున్నారు! . ఈ ముగ్గురు, వరుసగా మూడు రోజుల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన హయత్‌నగర్ పరిధిలోని కోహెడలో జరిగింది. మృతులు కోహెడకు చెందిన గ్యార వైష్ణవి (18), బుడ్డ శ్రీజ (18) సతాలి రాకేశ్ (21). వైష్ణవి కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మందులు వాడకపోవడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈనెల 21న ఇంట్లో ఉరివేసుకుంది. బుధవారం నిర్వహించిన వైష్ణవి అంత్యక్రియలకు సతాలి రాకేశ్ హాజరయ్యాడు. ఆ రోజు రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన రాకేశ్, సమీపంలోని ఓ షటర్‌లో నిద్రపోయాడు. గురువారం ఉదయం తల్లి యాదమ్మ నిద్రలేచి చూడగా రాకేశ్ ఫ్యానుకు ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు శ్రీజ తండ్రి నరసింహ ఆమెను నిద్రలేపాడు. తాను డ్యూటీకి వెళుతున్నాని చెప్పి బయలుదేరాడు. ఆయనకు ఉదయం 11గంటలకు ఫోనొచ్చింది. కూతురు ఆత్మహత్య చేసుకుందని చెప్పడంతో.. ఇంటికొచ్చి చూసేసరికి కూతురు ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. కలిసి చదువుకున్న స్నేహితులు.. ఒకరి తర్వాత మరొకరు వరుసగా మూడు రోజుల్లో ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లోకాయుక్త ఆదేశాలపై
హైకోర్టు స్టే

» ఆక్రమణదారులకే భూములు కేటాయించాలంటూ ఉత్తర్వులు

» ఆ అధికారం లోకాయుక్తకు లేదని కలెక్టర్ పిటిషన్

» మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ట్రస్ట్‌పై వ్యాజ్యం

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ భూవివాదానికి సంబంధించి తెలంగాణ లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. ఆక్రమించుకున్న భూములను సంబంధిత వ్యక్తులకే కేటాయించే అధికారం లోకాయుక్తకు లేదంటూ దాఖలైన వ్యాజ్యంపై ఈ ఆదేశాలు ఇచ్చింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ 'శ్రీ సూర్య చంద్ర శ్రీసాయి సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్' పేరిట ఓ సంస్థ ఏర్పాటు చేసి, ఆలయ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం మహబూబాబాద్ జిల్లా అనంతారం గ్రామ పరిధిలో 10-15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ లోకాయుక్తకు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆయన లోకాయుక్తకు వివరణ ఇస్తూ స్థానిక గిరిజనుల కోరిక మేరకు ఆలయం నిర్మించడానికి కేవలం 1.07 ఎకరాలు మాత్రమే తీసుకున్నట్లు పేర్కొన్నారు. తీసుకున్న ఈ స్థలం కోసం తగిన ధర ప్రభుత్వానికి చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన లోకాయుక్త.. ఆ స్థలాన్ని ట్రస్టుకు లీజుకు ఇవ్వాలని, లేదంటే కనీస ధరకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. ఇది తెలంగాణ లోకాయుక్త చట్టం - 1983, తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (బదిలీపై నిషేధం) చట్టం- 1977కి విరుద్ధమని పేర్కొంటూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా గురువారం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వివరణ ఇవ్వాలని లోకాయుక్త రిజిస్ట్రార్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌లకు నోటీసులు జారీ చేస్తూ విచారణను నవంబర్ 21కి వాయిదా వేసింది.

లిక్కర్ షాపుల దరఖాస్తు గడువు పెంపును వ్యతిరేకిస్తూ పిటిషన్

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం పొడిగించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హరీందర్‌పాల్ సింగ్ బంగా, మాన్‌జీత్‌సింగ్ బగ్గా, డి. వెంకటేశ్వరరావు తదితరులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. లైసెన్స్ నిబంధనలకు విరుద్ధంగా గడువు తేదీని ఎక్సైజ్ శాఖ కమిషనర్ పొడిగించారని తెలిపారు. ఈనెల 18 తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించకుండా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

మద్యం దరఖాస్తులతో 2,863 కోట్ల ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబరు 25న ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ మరుసటి రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు పెట్టింది. కాగా, క్రితంసారి దాదాపు 1.32 లక్షల దరఖాస్తుల విక్రయం ద్వారా ఎక్సైజ్ శాఖకు దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గినా.. గతంలో రూ.2 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుమును ఈసారి రూ.3 లక్షలకు పెంచినందున రూ.3 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. లక్ష్యాన్ని సాధించడానికి ఎక్సైజ్ అధికారులు.. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. ఈ నెల 18 అర్ధరాత్రి వరకు 89,344 మంది దరఖాస్తు చేశారు. అయితే.. అదేరోజు బీసీ బంద్ ఉండటంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో పలువురు వ్యాపారుల అభ్యర్థన మేరకు గడువును ఈ నెల 23 వరకు పొడిగించారు. ఇది వ్యాపారులకు ఊరటనిచ్చింది. ఇక ఈనెల 27న డ్రా తీసి వ్యాపారులను ఎంపిక చేయనున్నారు.



శంషాబాద్‌లో అత్యధికం.. ఆసిఫాబాద్‌లో అత్యల్పం..

మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా శంషాబాద్ ఎక్సైజ్ డివిజన్ నుంచి 8,502 వచ్చాయి. ఆ తర్వాత సరూర్‌నగర్‌లో 7,850 దరఖాస్తులు రాగా, మేడ్చల్‌లో 5,958, మల్కాజిగిరి 5,127, నల్లగొండ 4,902, సంగారెడ్డి 4,390, ఖమ్మం 4,430, కొత్తగూడెం 3,902, వరంగల్ అర్బన్‌లో 3,174, హైదరాబాద్ 3,200, సికింద్రాబాద్ 3,100, మహబూబ్‌నగర్ 2,487 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో కేవలం 667 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక వనపర్తిలో 757 దరఖాస్తులు, ఆదిలాబాద్‌లో 748, జోగులాంబ గద్వాలలో 800, జగిత్యాల 1956, కరీంనగర్ 2740, రాజన్న సిరిసిల్ల 1380, సంగారెడ్డి 4390, సూర్యాపేట 2770 దరఖాస్తులు వచ్చాయి.

పాపం పండింది!

» చెరువులోకి దూకి అత్యాచార నిందితుడి మృతి

» బహిర్భూమి కోసం వాహనం ఆపి చెరువులో దూకిన నారాయణరావు

» చెరువులో లభించిన మృతదేహం

» చావడమే కరెక్ట్: కుటుంబ సభ్యులు

కాకినాడ/తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పశ్చాత్తాపమా... తప్పించుకునే ప్రయత్నంలో జరిగిన ప్రమాదమా... తునిలో బాలికపై అత్యాచారం జరిపిన కేసులో నిందితుడైన నారాయణరావు (62) చెరువులో శవమై తేలాడు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడి మరణం కూడా అంతే సంచలనంగా మారింది. తుని పట్టణ సీఐ, ఎస్ఐల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన ఒక బాలిక స్థానిక గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె సమీప బంధువు తాటిక నారాయణరావు(62) అప్పుడప్పుడు పాఠశాలకు వచ్చి... ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ బాలికను బయటకు తీసుకెళ్లేవాడు. తాతయ్య వరుస అని చెప్పడంతో సిబ్బందికీ ఎలాంటి అనుమానం రాలేదు. మంగళవారం మధ్యాహ్నం నారాయణరావు మరోసారి బాలికను తనతో తీసుకెళ్లాడు. తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు అప్పటికప్పుడు స్పందించి కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు నారాయణరావును అరెస్ట్ చేశారు. ఎఫ్ఐఆర్, ఇతర ప్రాథమిక సాక్ష్యాల సేకరణ పూర్తి చేసి నిందితుడిని తుని న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే... అక్కడ మేజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ప్రత్తిపాడు న్యాయాధికారి ముందు హాజరుపరిచేందుకు బయలుదేరారు. రాత్రి 10.30 గంటల సమయంలో తుని శివారులోని కోమటిచెరువు వద్దకు రాగానే.. నిందితుడు తాను బహిర్భూమికి వెళ్లాలని, వాహనం ఆపాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో పోలీసులు జీపు ఆపారు. ఆ సమయంలో వర్షం పడుతుంటంతో ఎస్కార్ట్ పోలీసులు అతనికి దూరంగా చెట్ల కింద నిలబడ్డారు. పోలీసులు చూస్తుండగానే నారాయణరావు చెరువులోకి దూకేశాడు. అతను పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోయాడా, పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులో దూకాడా పోలీసులకు అర్థం కాలేదు. నారాయణరావుకోసం చెరువులో అప్పటికప్పుడు గాలింపు జరిపినా ఆచూకీ లభించలేదు. అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించారు. గురువారం ఉదయం వలలతో గాలించగా, చెరువు మధ్యలో నిందితుడి మృతదేహం లభించింది.

చనిపోవడమే కరెక్ట్ అంటూ...

పోలీసులు నారాయణరావు మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శవపంచనామాకు కుటుంబ సభ్యుల నుంచి అనుమతిపత్రం అవసరం కాగా... వారెవరూ సంతకం చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియలో జాప్యం జరిగింది. ఆయనకు ఇద్దరు భార్యలు. తమ కుటుంబసభ్యుడే అయినా నారాయణరావు చేసిన పనిని క్షమించలేమని ఆయన కుమారుడు సురేశ్, కోడలు రాజేశ్వరి అన్నారు. "పోలీసులు ఫోన్ చేసి నారాయణరావు చనిపోయాడని తెలిపారు. అలాంటి వాడు చావడమే కరెక్ట్ అని అనుకున్నాం" అని తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

» రూ.2.70 కోట్ల సరకు స్వాధీనం

మదీన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. రూ.2.70 కోట్ల 908.41 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు సంయుక్తంగా ఈ ముఠాలోని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ వివరాలు వెల్లడించారు. గోల్కొండకు చెందిన భారీ మోటార్ వాహన డ్రైవర్ మహ్మద్ కలీముద్దీన్ అలియాస్ మహ్మద్ ఫరీదుద్దీన్ (32)పాత నేరస్తుడు. అంబర్‌పేట్ పటేల్‌నగర్‌కు చెందిన ఏసీ టెక్నీషియన్ షేక్ సొహైల్ అలియాస్ సొహైల్(23) చిన్ననాటి స్నేహితులు. కలీముద్దీన్ సోదరుడు రహమాన్, అతని స్నేహితుడు మహ్మద్ అఫ్జల్ అలియాస్ అబ్బు(25) ముఠాగా ఏర్పడ్డారు. గత జూన్‌లో రహ్మాన్‌కు గంజాయి సరఫరాదార్లు ఒడిశా కలిమెలకి చెందిన జిత్తు, శ్రీకాకుళంకు చెందిన సురేశ్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల మీదుగా మహారాష్ట్ర నాసిక్‌కి చెందిన మహేశ్‌కు గంజాయి చేరవేయాలని, ఒక్కో ట్రిప్పుకు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఇస్తానని రెహ్మాన్‌కు చెప్పాడు. రెహ్మాన్ తన సహచరులతో ఈ నెల 16న శ్రీకాకుళం జిల్లా పలాస వెళ్లారు. జీడిపప్పు పొట్టుతో తయారుచేసిన పశువుల దాణా సంచులను డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేశారు. అక్కడి నుంచి ఒడిశాలోని మల్కన్‌గిరి అటవీ ప్రాంతానికి వెళ్లి సురేశ్, జిత్తుల నుంచి 28 గంజాయి సంచులు తీసుకున్నారు. వాటిని వ్యాన్‌లో దాణా కింద దాచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అంబర్‌పేట్ పటేల్‌నగర్‌లో రెండురోజులపాటు వ్యాన్‌ను నిర్మానుష్య ప్రదేశంలో ఉంచారు. 22వ తేదీన కలీముద్దీన్, సొహైల్, మహ్మద్ అఫ్జల్‌లు చాంద్రాయణగుట్ట బండ్లగూడ మీదుగా నాసిక్‌కు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బండ్లగూడలో మహ్మద్ కలీముద్దీన్, షేక్ సొహైల్, మహ్మద్ అఫ్జల్‌లను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రెహ్మాన్, జిత్తు, సురేశ్, మహేశ్‌ల కోసం గాలిస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.